thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 302 కరీంనగర్ గురువారం, 8 జనవరి 2026 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## కమీషన్ పెంపు కోసం వంట గ్యాస్ డీలర్ల సమ్మె హెచ్చరిక

న్యూఢిల్లీ : తమ సమస్యలను పరిష్కరించకుంటే దేశ వ్యాప్త సమ్మె చేస్తామని వంటగ్యాస్ డీలర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇందుకు మూడు వారాల సమయం ఇస్తున్నట్టు ఎల్‌పీజీ డిస్ట్రిబ్యూటర్ల సంఘం అధ్యక్షుడు బి.ఎస.శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు పెట్రోలియం, సహజవాయుల మంత్రిత్వ శాఖకు కూడా లేఖ రాసినట్టు తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించిన నిర్వహణ వ్యయం పెరుగుతున్న దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న కమీషన్ సరిపోవడం లేదని, అందువల్ల దాన్ని కనీసం రూ.150కి పెంచాలని డిమాండు చేశారు. తాము అడగకపోయినా ఆయిల్ కంపెనీలు వాణిజ్య సిలిండర్లను పంపిస్తున్నాయని, ఇది తమకు సమస్యలు తెచ్చిపెడుతున్నాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా అమలు చేస్తున్న ఈ విధానాన్ని వెంటనే నిలిపివేయాలనీ డిమాండు చేశారు.




## మున్సిపల్ ఎన్నికలపై ఈసీ కసరత్తు.. ఈనెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా

హైదరాబాద్: రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. ఈ నెల 20వ తేదీలోగా నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. అందుకు తగ్గట్టుగా ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు మొదలు పెట్టాయి. ఇందులో భాగంగా మున్సిపల్ ఎన్నికలపై ఉన్నతాధికారులతో ఎస్ఈసీ రాణికుముదిని బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ గడువును రాష్ట్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఈ నెల 13 నాటికి పోలింగ్‌స్టేషన్ల వివరాల ముసాయిదా ప్రచురించాలని ఎస్ఈసీ ఆదేశించారు. ఈ నెల 16 నాటికి ఓటర్ల తుది జాబితా ప్రచురించాలని స్పష్టం చేశారు. బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకంపై చర్చించారు. ఇప్పటికే జిల్లా, మండల స్థాయిలో రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించిన ఈసీ.. గురువారం రాజకీయ పార్టీల రాష్ట్ర స్థాయి ప్రతినిధులతో సమావేశం కానుంది. తెలంగాణలో గడువు ముగిసిన 117 మున్సిపాల్టీ పాలకవర్గాలకు ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.




## తెలంగాణ టూరిజాన్ని ప్రమోట్ చేసేలా సంక్రాంతి కార్యక్రమాలు

హైదరాబాద్: ఈ సంక్రాంతి పండుగను సంప్రదాయం, సంస్కృతి పరిరక్షణకు అనుగుణంగా ఘనంగా జరుపుతున్నామని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర టూరిజాన్ని ప్రమోట్ చేయడానికి ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జనవరి 13 నుంచి 17 వరకు 'కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ల పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫెస్టివల్‌లో 19 దేశాల నుంచి 40 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్స్, అదేవిధంగా మన దేశంలోని 15 రాష్ట్రాల కైట్ ఫ్లయర్స్ పాల్గొంటున్నారని తెలిపారు. ఈ ఉత్సవంలో వివిధ రాష్ట్రాలకు చెందిన స్వీట్ స్టాల్‌లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. జనవరి 16 నుంచి 18 వరకు హాట్ ఎయిర్ బెలూన్ షో కోసం ఏవియేషన్ అనుమతి ఇప్పటికే తీసుకున్నామన్నారు. ఈ బెలూన్ షో బుకింగ్ కోసం ఆన్‌లైన్ సౌకర్యం కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. గచ్చిబౌలి స్టేడియంలో పగలు గోల్ఫ్ కోర్స్, పరేడ్ గ్రౌండ్‌లో నైట్ డ్రోన్ షోలు కూడా ఉంటాయన్నారు. చెరువుల పరిరక్షణ లక్ష్యంగా నగరంలోని అన్ని చెరువుల వద్ద కైట్ ఫెస్టివల్ కార్యక్రమం జరుగుతుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.





## తెలంగాణలో మరో సారి జిల్లాల పునర్వ్యవస్థీకరణ - ఇక కొత్తగా..!!

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మరో సంచలన నిర్ణయానికి సిద్దమైంది. గ్రేటర్ హైదరాబాద్ లో కీలక మార్పులు చేసిన ప్రభుత్వం జిల్లాల పైన ఫోకస్ చేసింది. కేసీఆర్ హయాంలో జిల్లాల సంఖ్య పెంచతూ నిర్ణయం చేసారు. ప్రస్తుతం ఉన్న 33 జిల్లాల తెలంగాణపై ప్రభుత్వం సమీక్షస్తోంది. జిల్లాల ఏర్పాటు పైన వచ్చిన ఫిర్యాదులు... పాలా సౌలభ్యం పరిశీలించి జిల్లాల పై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాలని భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల తరువాత ఈ మేరకు కసరత్తు చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో జిల్లాల సంఖ్య పెరిగే అవకాశం కనిపిస్తోంది.

జిల్లాల నుంచి వస్తున్న డిమాండ్ల మేరకు ప్రస్తుత జిల్లాల పునర్విభజన తీరు...స్థానిక పరిస్థితులు.. పాలనా సౌలభ్యం వంటి అంశాల ను పరిగణలోకి తీసుకొని ప్రభుత్వం కొత్త జిల్లాల పైన కసరత్తు చేయాలని భావిస్తోంది. కొత్తగా 5జిల్లాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. పది జిల్లాలుగా ఉన్న తెలంగాణను 33 జిల్లాలు గా కేసీఆర్ మార్చే క్రమంలో కొన్ని అభ్యంతరాలు... అదే సమయంలో భారీ స్థాయిలో వినతులు వచ్చాయి. అందులో కొంత వరకే పరిష్కారం అయ్యాయి. అయితే, జిల్లాల పుర్విభజన మరోసారి చేయటం అవసరమని ప్రభుత్వం భావిస్తోంది. అదిలాబాద్ తో సహా తమ ప్రాంతాలను అశాస్త్రీ యంగా విభజించారని మహబూబ్ నగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

# అంతకు మించి!

## పురపాలికల్లోనూ సత్తా చాటాలి!!

### పంచాయతీ ఫలితాలను పునరావృతం అయ్యేలా...

### అభ్యర్థుల ఎంపికే కీలకం.. గెలుపే ఇందుకు ప్రాతిపదిక

### ఫిబ్రవరి మూడో వారంలో మున్సిపోల్స్ ఉండే చాన్స్



## మున్సిపోల్స్‌పై నేడు గాంధీ భవన్‌లో విస్తృత స్థాయి సమావేశం

హైదరాబాద్ : పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లు దక్కించుకున్న అధికార కాంగ్రెస్ పార్టీ.. మునిసిపల్ ఎన్నికల్లోనూ ఆ ఫలితాన్ని పునరావృతం చేయాలని నిర్ణయించింది. ఈ ఎన్నికలను మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని నిశ్చయించింది. మెజారిటీ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు దక్కించుకుని పురపాలికల్లోనూ పాగా వేయాలని నిర్ణయించింది. మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చ, పార్టీ యంత్రాంగానికి దిశానిర్దేశం చేయడానికి గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ అధ్యక్షతన పార్టీ విస్తృతస్థాయి సమావేశం జరగనుంది. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్ష నటరాజన్, మంత్రులు, కార్యవర్గ సభ్యులు, డీసీసీ అధ్యక్షులు పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో మున్సిపల్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, టీపీసీసీ విస్తృత సమావేశం అజెండాను ఖరారు చేసేందుకు సీఎం రేవంత్‌తో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్ సమావేశమయ్యారు. ఇందులో ప్రధానంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపైనే చర్చించారు. డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులూ ఈ భేటీలో పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను గెలవడం ద్వారా ప్రభుత్వ పాలన పట్ల గ్రామీణ ప్రజలు సంతృప్తిగా ఉన్నారని చాటగలిగామని, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఈ విజయాన్ని పునరావృతం చేయడం ద్వారా పట్టణ ప్రజలు కూడా పాలనపై సానుకూలంగా ఉన్నారని చాటాలని సమావేశంలో నిర్ణయించారు. పార్టీ గుర్తుపై జరిగే ఎన్నికలు కావడంతో మరింత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని అనుకున్నారు. డివిజన్లు, వార్డుల్లో అభ్యర్థుల ఎంపికే ఇందులో కీలకమని, గెలుపు ప్రాతిపదికనే అభ్యర్థుల ఎంపిక ఉండాలని నిర్ణయించారు. అదే సమయంలో సామాజిక న్యాయాన్ని కూడా దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులను ఎంపిక చేయాలని భావించారు. ప్రతి డివిజన్/వార్డుకు ఆరుగురు చొప్పున ఆశావహులను ఎంపిక చేసి సర్వేలు నిర్వహించాలని, వాటి ఆధారంగానే అభ్యర్థిని ఎంపిక చేయాలన్న నిర్ణయానికి వచ్చారు. కాగా.. ఏఐసీసీ పిలుపు మేరకు ఉపాధి హామీ పథకం పేరు మార్పును నిరసిస్తూ ఆందోళన కార్యక్రమాల నిర్వహణపైనా మాట్లాడుకున్నారు. కాగా.. కృష్ణా నదీ జలాలపై అసెంబ్లీలో చర్చ సందర్భంగా ప్రజలకు వాస్తవాలను వెల్లడించడం ద్వారా సాగునీటి రంగానికి సంబంధించి కేసీఆర్‌పై వారికి ఉన్న భ్రమలను తొలగించగలిగామన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. కవిత రాజీనామా అంశమూ ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. రాజీనామా సందర్భంగా ఆమె చేసిన ప్రసంగం.. బీఆర్ఎస్‌కు నష్టం చేకూరుస్తుందని,మహిళల్లో ఇది చర్చనీయాంశంగా మారనుందని ఒకరిద్దరు మంత్రులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది.

**ఫిబ్రవరి మూడో వారంలో మున్సిపోల్స్..!...** మెగా హైదరాబాద్ మినహా అన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఫిబ్రవరి మూడో వారంలో ఎన్నికలు జరగనున్నట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ఈనెల చివరి వారంలో విడుదల కానున్నట్లు సమాచారం. ఎన్నికల నిర్వహణకు అధికారులు, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడమే తరువాయి అని చెబుతున్నారు.




## ఎవరికి ఎదురుదెబ్బ తగలనుందో!

# బెంగాల్ దంగల్

## బెంగాల్‌లో ఎవరి ప్రభుత్వం ఏర్పడబోతోంది?

### ఫలోది సట్టా బజార్ షాకింగ్ జోస్యం!

బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు: పశ్చిమ బెంగాల్‌లో 2026 అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, రాజకీయ వాతావరణం అప్పుడే వేడెక్కింది. తృణమూల్ కాంగ్రెస్ (TMC) మరియు భారతీయ జనతా పార్టీ (BJP) మధ్య హోరాహోరీ పోరు సాగే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రాజస్థాన్‌కు చెందిన 'ఫలోది సట్టా బజార్ల అంచనాలు మరోసారి చర్చనీయాంశమయ్యాయి. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాల ప్రకారం, బెంగాల్ అధికార పీఠం విషయంలో ఒక పెద్ద రాజకీయ పార్టీకి మరియు దిగ్గజ నాయకురాలికి గట్టి దెబ్బ తగలనుందని అంచనా వేస్తున్నారు.

ఆ వివరాలు ఏమిటో చూద్దాం. ఫలోది సట్టా బజార్ ఎందుకు వార్తల్లో ఉంది? ఏ పెద్ద ఎన్నికలు వచ్చినా ఫలోది సట్టా బజార్ పేరు మారుమోగుతుంది. ఇక్కడి అంచనాలు చాలా వరకు నిజమవుతాయనే నమ్మకం ఉండటమే దీనికి కారణం. లోక్‌సభ లేదా అసెంబ్లీ ఎన్నికలు ఏవైనా సరే, ఇక్కడి రేట్లు (భావ్) రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారుతుంటాయి.

ఫలోది సట్టా బజార్ అంచనా ఏమిటి? వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం, పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 294 అసెంబ్లీ సీట్లలో బీజేపీ 180 సీట్లు గెలుచుకునే అవకాశం ఉందని, మమతా బెనర్జీ నేతృత్వంలోని ౧వీజ 114 సీట్లకే పరిమితం కావచ్చని అంచనా వేస్తున్నారు. బెంగాల్‌లో మెజారిటీ మార్కు 148. అయితే, ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే, సమయాన్ని బట్టి ఇవి మారవచ్చు. సట్టా బజార్ అంచనాలు ఎలా వేస్తుంది? ఫలోదిలోని బుకీలు మీడియా నివేదికలు, రాజకీయ ర్యాలీలకు వస్తున్న జనం, క్షత్రస్థాయి ఫీడ్‌బ్యాక్ మరియు తమ నెట్‌వర్క్ సమాచారం ఆధారంగా రేట్లను నిర్ణయిస్తారు.

అయితే, ఇది అధికారిక సంస్థ కాదు. భారతదేశంలో ఎన్నికలపై బెట్టింగ్ వేయడం చట్టవిరుద్ధం. పోలీసు యంత్రాంగం కూడా దీనికి ఎలాంటి గుర్తింపు లేదని పదే పదే స్పష్టం చేస్తోంది. 2021 ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నాయి? గత 2021 ఎన్నికల్లో మొత్తం 294 స్థానాలకు గానూ మమతా బెనర్జీ నేతృత్వంలోని TMC 213 సీట్లను గెలుచుకుని ఘనవిజయం సాధించింది. బీజేపీ మొదటిసారిగా బలాన్ని పెంచుకుని 77 సీట్లను గెలుచుకుంది.





# ఖమ్మంలో బీఆర్ఎస్‌కు మళ్లీ షాక్.. కాంగ్రెస్‌లోకి మరో ముగ్గురు కార్పొరేటర్లు



హైదరాబాద్: ఖమ్మం నగరపాలక సంస్థలో బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. ఇటీవల ఆ పార్టీకి చెందిన ఐదుగురు కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరగా.. బుధవారం మరో ముగ్గురు చేరారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తాజాగా కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లలో ధనియాల రాధ, తోట ఉమారాణి, రుద్రగాని శ్రీదేవి ఉన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. ఇటీవల బీఆర్ఎస్ నుంచి హస్తం పార్టీకి వచ్చిన కార్పొరేటర్లు సీహెచ్ లక్ష్మి, జి.చంద్రకళ, డి.సరస్వతి, అమృతమ్మ, ఎం.శ్రావణి సీఎంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కీలక పరిణామం.. ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రికి నోటీసులు




ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రావు తండ్రి కొండల్ రావుకు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. అంతేకాదు.. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కొడుకు సందీప్ రావుకు కూడా నోటీసులు ఇచ్చారు. ఈ రోజు (బుధవారం) మధ్యాహ్నం ఒంటి గంటకు జూబ్లీహిల్స్ పీఎస్‌కి రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

**9 గంటల పాటు నవీన్ రావు విచారణ...** రెండు రోజుల క్రితం ఎమ్మెల్సీ నవీన్ రావును సిట్ అధికారులు విచారించారు. దాదాపు 9 గంటల పాటు విచారణ సాగింది. ఉదయం 11 గంటలకు మొదలైన విచారణ రాత్రి 8 గంటల వరకు సాగింది. బీఆర్ఎస్ పెద్దలతో ఉన్న ఆర్థిక సంబంధాల గురించి నవీన్ రావును అధికారులు విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం నవీన్ రావు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో విచారణకు హాజరయ్యానని, అప్పట్లో మూడు గంటల పాటు అధికారులు తనను విచారించారని చెప్పారు. అప్పుడు చెప్పిన విషయాలనే ఇప్పుడు కూడా చెప్పానని అన్నారు. విచారణకు సహకరించానని, మళ్లీ పిలిచినా కూడా వస్తానని స్పష్టం చేశారు.

# కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం: మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి



హైదరాబాద్: కవిత వచ్చి విజ్ఞప్తి చేయడంతోనే ఆమె రాజీనామాను ఆమోదించినట్లు తెలంగాణ శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తెలిపారు. భావోద్వేగంతో రాజీనామా చేసినప్పుడు కొంతకాలం వేచిచూస్తామని.. ఆమె విషయంలోనూ అదే జరిగిందన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ప్రకటనపైనా గుత్తా స్పందించారు. "రాష్ట్రంలో కొత్తగా పార్టీలు పెట్టాల్సినంత అవసరం లేదు. కొత్త పార్టీ వచ్చినా మనుగడ కష్టం. గతంలో వచ్చిన పలు రాజకీయ పార్టీలు కనుమరుగయ్యాయి. ఏ ప్రాతిపదికన డీలిమిటేషన్ చేపడతారనే దానిపై స్పష్టత లేదు. జనాభా ప్రాతిపదికన జరిగిన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం. హిల్ట్ విధానం ద్వారా ఎలాంటి అవినీతి జరగదు. కాలుష్యం కట్టడికి పారిశ్రామిక భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు తొలగించడం సరికాదు" అని గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు.




కల్వకుర్తి : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పీఎస్ నుంచి పరారైన కరడుకట్టిన అంతర్రాష్ట్ర దొంగను ఎట్టకేలకు సీసీఎస్ పోలీసులు పట్టుకున్నారు. పోలీస్ వర్గాల నుంచి తెలిసిన విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. తెలుగు నాగిరెడ్డి అలియాస్ మల్లెపూల నాగిరెడ్డిది ఏపీలోని నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం వీరాపూర్ గ్రామం. పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కల్వకుర్తి పరిధి పీఎస్‌లోనూ కేసులు ఉన్నాయి. అనంతపురం జిల్లా జైలులో ఉన్న నాగిరెడ్డిని గత ఏడాది నవంబర్ 11న కల్వకుర్తి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి కల్వకుర్తికి తీసుకొచ్చి విచారించారు. అదే నెల 13న రాత్రి హెడ్ కానిస్టేబుల్ నిరంజన్, కానిస్టేబుల్ లాల్‌సింగ్ నాయక్, హోంగార్డు లక్ష్మణ్ కాపలా ఉండగానే వారి కళ్లుగప్పి మరుగుదొడ్డి కిటికీలోంచి చాకచక్యంగా పరారయ్యాడు. అతడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చేపట్టినా ఫలితం లేపోయింది. దీంతో ఉన్నతాధికారులు అదే నెలాఖరులో కల్వకుర్తి ఎస్సై మాధవరెడ్డికి ఛార్జ్ మెమో ఇచ్చారు. హెడ్‌కానిస్టేబుల్, కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. హోంగార్డును ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. హైదరాబాద్‌లోని మేడ్చల్ సీసీఎస్ పోలీసులు మంగళవారం రాత్రి నాగిరెడ్డిని అరెస్ట్ చేసినట్లు తెలిసింది. బుధవారం తెల్లవారుజామున కల్వకుర్తి పీఎస్‌కు తీసుకొచ్చినట్లు సమాచారం.

# గుడిలో భారీ చోరీ.. ఆభరణాలు ఎత్తుకెళ్లిన దుండగులు

హైదరాబాద్ నగరంలోని ఆలయంలో భారీ చోరీ జరిగింది. కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆలయంలో దొంగలు స్వామి వారి నగలను చోరీ చేశారు. సుమారు రూ.50 లక్షల విలువ చేసే ఆభరణాలను ఎత్తుళ్లిపోయారు.

దుండగులు అర్ధరాత్రి సర్దార్ పటేల్ నగర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలోకి ప్రవేశించారు. గర్భగుడి తాళాలు పగులగొట్టి విగ్రహంపై ఉన్న రూ.50 లక్షల విలువైన వెండి ఆభరణాలను ఎత్తుళ్లిపోయారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. గుడి దగ్గరకు చేరుకున్న పోలీసులు క్లూస్ సేకరిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# సంక్రాంతి వేళ.. భారీగా బస్ చార్జీల పెంపు

**- రూట్లు.. 4 రెట్లు.. - ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాల ఇష్టారాజ్యం**

**- డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్న వైనం - మూలన పడిన వాహనాలూ రోడ్లపైకి**

**- అనుమతి, ఫిట్‌నెస్ లేకున్నా రాకపోకలు - పట్టించుకోని రవాణా శాఖ, ట్రాఫిక్ అధికారులు**

హైదరాబాద్ : పండుగ వేళ సొంతూళ్లకు వెళ్లి అయిన వారితో సంతోషంగా గడపాలనుకుంటున్న సిటీజనులకు చుక్కలు కనిపిస్తున్నాయి. టికెట్ల బుకింగ్ సమయంలోనే వారి ఆనందం ఆవిరవుతోంది. డిమాండ్ ఎక్కువగా ఉండడంతో ప్రైవేట్ ట్రావెల్స్ యాజమాన్యాలు కృత్రిమ కొరత సృష్టించి ఇష్టానికి టికెట్ల ధరలు పెంచుతున్నాయి. సాధారణ రోజులతో పోలిస్తే మూడు, నాలుగు రెట్లు.. కొన్ని ట్రావెల్స్ ఐదు రెట్లు అంతకంటే ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నాయి. దీంతో పండుగకు పల్లెటూరి ప్రయాణం ఆర్థిక భారంగా మారుతోంది. రెండు నెలల ముందు రైళ్లలో టికెట్ బుకింగ్ మొదలు కాగా వారం, పది రోజుల్లోనే పూర్తయ్యాయి.

నెలన్నరగా చాలా రైళ్లలో బుకింగ్ రిగ్రెట్‌గా చూపుతోంది. దీంతో మెజార్టీ ప్రయాణికులకు బస్సులే దిక్కయ్యాయి. దీంతో ప్రైవేట్ ట్రావెల్స్ యజమాన్యాలు ఇష్టానికి దోచుకుంటున్నాయి.

**భారీ డిమాండ్..** సంక్రాంతి ఈ నెల 14, 15, 16 తేదీల్లో మూడు రోజులపాటు ఉంది. విద్యార్థులకూ ఈ నెల 10వ తేదీ నుంచి సెలవులు ఉన్నా యి. దీంతో 9వ తేదీన స్వగ్రామాలకు వెళ్లేందుకు మెజార్టీ ప్రయాణికులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఆ వారం రోజులపాటు టికెట్ల ధరల్లో భారీ పెరుగుదల కనిపిస్తోంది. సాధారణ రోజుల్లో బస్సు కేటగిరీని బట్టి హైదరాబాద్ నుంచి కాకినాడుకు రూ.800 నుంచి రూ.3,299 వరకు ఉండే టికెట్ ధరలు ఇప్పుడు రూ.1,500 నుంచి రూ.7 వేలు, 8 వేలకు చేరుకున్నాయి. హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లే ఏసీ స్లీపర్ కోచ్‌లో టికెట్ ధరలు రూ.2,222 నుంచి రూ.5099 వరకు ఉన్నాయి. నాన్ ఏసీ కోచ్‌లో ఈ ధరలు రూ.1,349 నుంచి రూ.2,699, వోల్వో సర్వీసుల్లో రూ.4,239 నుంచి రూ.4,799, అంతకంటే ఎక్కువ చార్జీలు వసూలు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి విశాఖపట్నం వెళ్లే ఏసీ స్లీపర్ బస్సుల్లో సీట్ల ధరలు రూ.3,899 నుంచి రూ.6,349 వరకు ఉన్నాయి. వోల్వో బస్సుల్లో టికెట్ ధరలు దూరాన్ని బట్టి రూ.7 వేల వరకు ఉండడం గమనార్హం. తిరుగు ప్రయాణంలోనూ 16నుంచి 20 తేదీ వరకు టికెట్ల ధరలు ఎక్కువగానే ఉన్నాయి. నగరం నుంచి నిజామాబాద్, ఆదిలాబాద్, కొత్తగూడెం వెళ్లే ప్రైవేట్ ట్రావెల్స్‌లోనూ టికెట్ రేట్లలో పెరుగుదల కనిపిస్తోంది.

**మూలన పడిన వాహనాలూ..** డిమాండ్ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మూలనపడ్డ, కాలం చెల్లిన, ఫిట్‌నెస్ లేని బస్సులకూ తూతూ మంత్రంగా మరమ్మతు చేసి కొందరు యజమానులు రోడ్లపైకి తీసుకువస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అయినా రవాణా శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు.




# ఐబొమ్మ రవికి షాక్.. ఆ ఐదు కేసుల్లోనూ..

సినిమాల పైరసీ కేసులో అరెస్టైన ఇమంది రవి అలియాస్ ఐ బొమ్మ రవికి నాంపల్లి కోర్టు షాక్ ఇచ్చింది. అతడి బెయిల్ పిటిషన్లను కొట్టి వేసింది. హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో అతడిపై ఐదు కేసులు నమోదు అయ్యాయి. ఈ ఐదు కేసుల్లో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ రవి కోర్టును ఆశ్రయించాడు.

తాజాగా, ఈ బెయిల్ పిటిషన్‌లపై నాంపల్లి కోర్టు విచారణ జరిపింది. కేసు దర్యాప్తు దశలో ఉందని, అతను విదేశాల్లో పౌరసత్వం కలిగి ఉన్నాడని పోలీసులు కోర్టుకు తెలిపారు. బెయిల్ ఇస్తే దేశం దాటిపోయే అవకాశం ఉందని కోర్టుకు విన్నవించారు. దీంతో కోర్టు రవి బెయిల్ పిటిషన్‌లను కొట్టి వేసింది.

**కస్టడీ రిపోర్టులో కీలక విషయాలు...** ఐబొమ్మ రవి కస్టడీ రిపోర్టును పోలీసులు గత బుధవారం కోర్టుకు సమర్పించారు. అందులో కీలక అంశాలు వెలుగు చూశాయి. ఐబొమ్మ రవి రెండు రకాలుగా సినిమా ప్రింట్‌అబశ్రీశ్రీలను కొనుగోలు చేశాడు.

నార్మల్ ప్రింట్‌కు 100 డాలర్లు, హెచ్‌డీ ప్రింట్‌కు 200 డాలర్లు చెల్లించాడు. అతడికి సంబంధించిన ఏడు ఖాతాలను పోలీసులు గుర్తించారు. వాటిలో రూ.13.40 కోట్ల నగదు ఉన్నట్లు కనుగొన్నారు.

బెట్టింగ్ యాడ్‌ల ద్వారా రూ.1.78 కోట్లు కూడబెట్టినట్లు గుర్తించారు. ఐబొమ్మ రవి తన సోదరి చంద్రికకు రూ. 90 లక్షల నగదు పంపినట్లు పోలీసులు తెలుసుకున్నారు.




# సుక్మా జిల్లాలో 26 మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో 26 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ ఎదుట లొంగిపోయారు. వీరిలో ఏడుగురు మహిళలు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులపై రూ.64లక్షల రివార్డు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికైనా మిగిలిన మావోయిస్టులు హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలోకి రావాలని ఆయన కోరారు.


# కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమే కానీ..: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 07: అధికార కాంగ్రెస్ పార్టీలోని అగ్రనేతలకు, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీలోని కీలక నేతల మధ్య మాటలు తూటాలు పేలుతున్నాయి. ఈ రెండు పార్టీల మధ్య విమర్శలు, ప్రతి విమర్శలతో మాటల వేడి బాగా పెరిగింది. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ బుధవారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ ప్రభుత్వంతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని రైతుబంధు ఏమైందని ప్రశ్నిస్తే.. లాగులో తొండలు వదులుతాం అంటున్నారని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి తీవ్రమైన ఫ్రస్టేషన్లో ఉన్నారన్నారు. ఆయనలో అంత ఫ్రస్టేషన్ ఎందుకో తనకు అర్థం కావడం లేదని తెలిపారు. సెక్యూరిటీ వాళ్లతో పాటు పోలీసుల్ని సైతం ఆయన కొడుతున్నారని ఆరోపించారు. 'రేవంత్ రెడ్డి ఫ్రస్టేషన్‌లో ఉన్నాడని.. అరుస్తున్నాడు.. కొడుతున్నాడు.. రేపు ఎవరినైనా కరుస్తాడేమో జాగ్రత్త' అంటూ సీఎం భార్య గీతకు ఈ సందర్భంగా కేటీఆర్ హితవు పలికారు. ఎప్పటికప్పుడు న్యూఢిల్లీ పోయి కప్పం కట్టి వస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలో కప్పం కట్టకపోతే తన పదవి ఉండదని.. ఊడిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్‌కి తెలుసునన్నారు. తాను ఆంధ్రప్రదేశ్ వెళ్లి చదువుకుంటే తప్పు.. ఆయన మాత్రం ఆంధ్రాలోని భీమవరంకు చెందిన వ్యక్తిని అల్లుడిగా తెచ్చుకోవచ్చునంటూ కేటీఆర్ వ్యంగ్యంగా పేర్కొన్నారు. తాను అమెరికాలో బాత్‌రూమ్‌లు కడుక్కుంటున్నానని అన్నారు. మరి అమెరికాలో మీ సోదరుడు జగదీష్ రెడ్డి కూడా ఉన్నాడని.. ఆయన తన ఇంట్లో ఆయనే కడుక్కోవట్లేదా? అంటూ సీఎం రేవంత్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ చురకలంటించారు. అమెరికాలో ఎవరింట్లో పనులు వాళ్లే చేసుకుంటారని.. ఈ విషయం తెలయకుంటే తెలుసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ప్రజలు.. మిమ్మల్ని గెలిపించింది ఈ పనికిమాలిన డైలాగుల కోసం కాదని.. పనిచేసి చూపించాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన స్పష్టం చేశారు. యూరియా బస్తాల కోసం ప్రతి రోజు షాపుల ముందు రైతులు క్యూ కడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. షాపుల్లో యూరియా లేనప్పుడు అందుకోసం రూపొందించిన యాప్‌అబశ్రీశ్రీలు ఏమి చేస్తాయంటూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. యూరియా అంశంలో యాప్‌ల సమస్య రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం కొత్త డ్రామాకు తెరలేపిందని విమర్శించారు. ఇప్పుడు కొత్తగా మళ్ళీ కార్డులు తీసుకు వస్తామని ప్రభుత్వం చెబుతుందన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అద్భుతమైన ప్రాజెక్టులు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పు చేసిన మాట వాస్తవమేనని కేటీఆర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆ చేసిన అప్పు తెలంగాణ రాష్ట్రాభివృద్ధి కోసం వినియోగించారని వివరించారు.

# నూతన ఆవిష్కరణల రూప కర్త గెలీలియో - జనవరి 8... గెలీలియో వర్ధంతి

గెలీలియో గెలీల ఇటలీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త, గణితజ్ఞుడు, భౌగోళిక శాస్త్రజ్ఞుడు, తత్వవేత్త. టెలిస్కోపు (దూరదర్శిని) ను వాడుకలోకి తెచ్చాడు. గెలీలియో గెలీలి (జననం 1564 ఫిబ్రవరి 15..మరణం 1642 జనవరి 8) ఇటలీలోని పీసా నగరంలో జన్మించాడు. చిన్న వయసులో తండ్రి వద్దనే విద్యాభ్యాసం చేశాడు. తరువాత పీసా విశ్వవిద్యాలయంలో వైద్య విద్యార్థిగా చేరాడు. అయితే అక్కడి గణితశాస్త్ర ఉపన్యాసాలకు ప్రభావితుడై వైద్యవిద్యను విడిచి, గణిత శాస్త్రాన్ని అధ్యయనం చేశాడు. ఆ తరువాత అక్కడే గణితశాస్త్రంలో ఉపన్యాసకులుగా చేరాడు. గెలీలియో కాలం అనగా 16 వ శతాబ్దం వరకు క్రీ.పూ. 4వ శతాబ్దంలో గ్రీకు తత్వవేత్త అరిస్టాటిల్ ప్రతిపాదించిన సిద్ధాంతాలే ప్రాచుర్యంలో ఉండేవి. సృష్టిలోని సత్యాలనన్నిటినీ స్వచ్ఛమైన ఆలోచనల ద్వారా మాత్రమే వివరించ వచ్చును. ప్రయోగాల ప్రమేయం ఏ మాత్రం అవసరం లేదన్నది అరిస్టాటిల్ సిద్ధాంతాల్లోని పెద్ద లోపం. అరిస్టాటిల్ సిద్ధాంతంతో ఏకీభవించని గెలీలియో పీసా గోపురం 180 అడుగుల ఎత్తు పైనుంచి 100 పౌండ్లు, 1 పౌండు బరువు గల రెండు ఇనప గుండ్లను ఒకేసారి క్రిందికి వదలి, అవి రెండూ ఒకే కాలంలో భూమిని చేరుకుంటాయని ప్రయోగం ద్వారా నిరూపించాడు. గురుత్వ త్వరణం గూర్చి ఆ కాలం నాటికే అర్థం చేసుకో గలిగాడు. 20 సంవత్సరాల వయసులో అయన ఒక రోజు ప్రార్థన కోసం చర్చికి వెళ్ళాడు. చీకటి పడుతున్న వేళలో చర్చి సేవకుడు దీపాలు వెలి గించగా ఎన్నో దీపాలు చర్చి పైభాగం నుండి వ్రేలాడుతూ ఉన్నాయి. ఆ దీపాలు ఉయ్యాల మాదిరి అటు, యిటూ ఊగటం గమనించాడు. వాటి డోలనా సమయాలు ఒకటేనని లెక్క వేశాడు. గెలీలియో కాలంనాటికి కచ్చితంగా కాల నిర్ణయం చేసే గడియారాలు లేనప్పటికి ఆయన డోలన కాలాలను గణించటం విశేషం. వైద్య విద్యార్థి కాబట్టి, నాడి కొట్టుకోవటం, గుండె కొట్టుకోవటం గురించి పరిచయం ఉంది కాబట్టి కాల నిర్ణయాన్ని తేలికగా చేయగలిగాడని అనుకోవచ్చు. ఈ పరిశీలన ఆధారంగా గెలీలియో "పల్స్ మీటరు" రూపొందించాడు. పాండువా విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర ప్రధానాచార్యునిగా చేరాడు. అక్కడే గెలీలియో యాంత్రిక శాస్త్రం రచించాడు. ఇది సామాన్యులకు కప్పీలు, తులాదండాలు, వాలుతలాల ద్వారా బరువులు సులభంగా ఎత్తడానికి ఉపకరించింది. ఆ సమయంలోనే వాయు థర్మామీటర్ ను, పల్లపు ప్రాంతం నుంచి ఎత్తుకు నీటిని చేరవేసి వ్యవసాయానికి ఉపయోగించే యంత్రాన్ని, గణితంలో వర్గాలు, వర్గమూలాలు కనుగొనే కంపాస్ పరికరాన్ని కనుగొన్నారు. ఆ సమయంలోనే లోలకాలు, వాయు తలాలపై కూడా కీలకమైన ప్రయోగాలు చేశాడు. గెలీలియో మొట్టమొదటి నాణ్యత గల టెలిస్కోప్ నిర్మాత. ఆయన టెలిస్కోప్ గురించి విని సింగ్ ఆరోరియా మహారాజు వెనిస్ కు రమ్మని కబురు చేశాడు. ఆయన టెలిస్కోప్ చూసి ఎంతోమంది ఆశ్చర్య పడ్డారు. వెనిస్ చర్చి పైభాగానికి వెళ్ళీ ఎంతో దూరంలో ఉన్న నౌకలను పది రెట్లు దగ్గరగా ఎంతో మంది గెలీలియో టెలిస్కోప్ ద్వారా చూడ గలిగారు. ఆయనను ప్రశంసించారు. ఈ టెలిస్కోప్ గెలీలియో పరిశోధనలో ముఖ్యమైనది. ఎన్నో విశ్వ రహస్యాలను గెలీలియో ఛేదించ గలిగాడు. బృహస్పతి గ్రహానికి ఉన్న ఉపగ్రహాలను గెలీలియో చూడగలిగాడు. గెలీలియో అప్పుడే కనుగొన్న టెలిస్కోపు ద్వారా శు క్రగ్రహ ఉపగ్రహాలను ప్రజలకు చూపించి నికోలస్ కోపర్నికస్



సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ధృవీకరించాడు. పాలపుంతలో కోట్లాది నక్షత్రాలు ఉన్నాయని ఊహించి చెప్పగలిగాడు. ఈ టెలిస్కోప్ ను ఉ పయోగించి సేకరించిన సమాచారాన్ని బట్టి కోపర్నికస్ సూర్య కేంద్రక సిద్ధాంతను బలపరిచాడు. క్రీ.శ 1616 లో గెలీలియో, సూర్యుడే కేంద్రమని సూర్యుని చుట్టే భూమి తిరుగుతుందని నిర్ద్వందంగా ప్రకటించాడు. అప్పటికే మత గ్రంథలలో ప్రముఖ స్థానాన్ని పొందిన భూకేంద్రక సిద్ధాంతాన్ని వ్యతిరేకిస్తున్నందుకు కోపర్నికస్ సిద్ధాంతాన్ని నిషేధించి, కొందరు మతాధికారులు గెలీలియో ప్రయోగాలు మత వ్యతిరేకమైనవని తీర్మానించారు. తన ప్రయోగాలను ఎన్నటికీ బహిర్గతం చేయనని ప్రమాణం తీసుకున్నారు. ఈ ప్రకటనకు ఆగ్రహం చెందిన చర్చి మతాధికారులు గెలీలియో ఎటువంటి ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. దీంతో క్రీ.శ.1630 వరకు గెలీలియో నోరు విప్పలేక పోయాడు. అయినా ఆయన తన వాదాలను విడిచి పెట్టలేదు. వాటిని పుస్తక రూపంలో వెలువరించాడు. 1632లో వెలువడిన ఈ "Dialogues concerning the two chief world systems" అనే గ్రంథం ఐరోపా ఖండంలో సారస్వత వేదాంత గ్రంథనికి ఉదాహరణగా పేర్కొంటారు. నిర్భయంగా తాను వాస్తవమని నమ్మిన శాస్త్రీయ విషయాలను వెల్లడించాడు. అయితే ఈ గ్రంథన్ని ప్రజలు కోపర్నికస్ సిద్ధాంతాన్ని సమర్ధించేదిగా భావిస్తున్నారని తెలుసుకున్న మతాధికారులు దీని ప్రచురణను నిలిపివేయడమే కాకుండా గెలీలియోకు యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. క్రీ.శ. 1637 లో పాపం గెలీలియో గుడ్డి వాడయ్యాడు. అంతటి మహానుభావుడు శిక్షను అనుభవిస్తూనే 1642, జనవరి 8 తేదీన తన 78వ ఏట మరణించారు. శాస్త్రీయ వాస్తవాలను తెలియజేసి ఈ ప్రపంచమంతా వెలుగులు నింపాలని ప్రయత్నించిన ఒక మహా మనిషిని మూర?త్వం బలిగొంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**



# పోలవరం ప్రాజెక్టును సందర్శించిన సీఎం చంద్రబాబు

**పోలవరం: ముఖ్యమంత్రి చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును సందర్శించారు. నిర్మాణ పనుల పురోగతిని సీఎం అడిగి తెలుసుకున్నారు. కాఫర్ డ్యామ్, ఈసీఆర్ఎఫ్ గ్యాప్-1, 2 పనుల వివరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు ఏరియల్ వ్యూ ద్వారా ప్రాజెక్టు పరిసరాలను సీఎం పరిశీలించారు. చంద్రబాబుకు మంత్రి నిమ్మల రామానాయుడు, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు.**




# ఏపీలో హైవే నిర్మాణం.. రెండు గిన్నిస్ రికార్డులు: సీఎం చంద్రబాబు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారి నిర్మాణం విషయంలో ఎన్‌హెచ్ఏఐ రెండు గిన్నిస్ రికార్డులు సాధించిందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. బెంగళూరు- కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ (ఎన్‌హెచ్-544జీ)లో 24 గంటల్లో 10,675 మెట్రిక్ టన్నుల బిట్యూమినస్ కాంక్రీట్ నిరంతరాయంగా వేసినట్లు చెప్పారు. అదేవిధంగా 24 గంటల్లోనే 28.95 లేన్ కిలోమీటర్ల రహదారి ఏర్పాటైందన్నారు. ఈ ఘనత.. దేశ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై భారత ప్రభుత్వ దృక్పథనికి నిదర్శనమని తెలిపారు.

# రాజకీయ మేధావి మధు లిమాయె

# - జనవరి 8...మధు లిమాయె వర్ధంతి



మధు లిమాయె పూణే పట్టణంలో 1922 మే 1వ తేదీన జన్మించారు. ఆయన పూర్తి పేరు మధుకర్ రామచంద్ర లిమాయే. మధులి మాయె స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న, కాంగ్రెస్ ను ముఖ్యంగా ఇందిరా గాంధీని వ్యతిరేకించిన ప్రముఖ వ్యక్తులలో ఒకరు. ఆయన సోషలిస్ట్ వ్యాసకర్త, సామాజిక కార్యకర్త. పూణే లోని ఫెర్గుసన్ కళాశాల నుండి విద్యను పూర్తి చేసారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడం వల్ల చదువుకు అంత రాయం ఏర్పడింది. 1940 నుండి 1945 మధ్య కాలంలో నాలుగు సంవత్సరాల జైలు జీవితం కూడా గడిపారు. గోవా విముక్తి ఉద్యమం లో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. కాంగ్రెస్ పార్టీలో 1938-1939 లలో సభ్యునిగా ఉన్నారు. తర్వాత రాం మనోహర్ లోహియా సోషలిష్ట్ పార్టీలో ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. సోషలిస్టు నేత రామ్ మనోహర్ లోహియా అనుయాయు లైన జార్జ్ ఫెర్నాండెజ్, మధు లిమాయే, రాజ్ నారాయణ్‌లు ఎప్పుడూ కాంగ్రెస్‌ను వ్యతిరేకిస్తూ వచ్చారు. సోషలిస్టు ఉద్యమంలో అంబేడ్కర్ ఆవశ్యకతని గుర్తించిన మొదటి వ్యక్తి బహుశ మధు లిమాయే నేమో. 'కమ్యూనిస్టు మానిఫెస్టో' ఎంత ముఖ్యమో అంబేడ్కర్ 'కుల నిర్మూలన' కూడా అంతే ముఖ్యమని లిమాయే ప్రకటించారు. అంబేడ్కర్ కుల నిర్మూలన కోరుకున్నారు. ఎందుకంటే కుల నిర్మూలన జరగకుండా దేశంలో వర్గాలు ఏర్పడవని, వర్గ పోరాటమూ సంభవించదని భావించారు. గోవా విముక్తి ఉద్యమంలో పాల్గొని చాలాకాలం జైలు జీవితం అనుభవించారు. మధు లిమాయే బీహార్ లోని బంక లోక్‌సభ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. మధులిమాయే 1964-1979 తన లోక్ సభ పదవి కాలంలో ఉత్తమమైన వక్తగా ప్రజా సమస్యలు తెలుపడంలో చురుకైన పార్లమెంటేరియేన్ గా పేరు గడించారు. అత్యవసర పరిస్థితి సమయంలో 1975 నుంచి 1977 వరకు జైలులో వున్నారు. తర్వాత జయప్రకాశ్ నారాయణ నాయ కత్వంలో ప్రతిపక్ష పార్టీలను సమైక్య పరిచే ప్రయత్నంలో ప్రముఖ పాత్ర పోషించారు. జార్జ్ ఫెర్నాండెజ్ తో పాటు వివిధ అంశాలపై పని చేసేవారు. అత్యవసర పరిస్థితి తర్వాత కేంద్రంలో అధికారం చేజిక్కించుకున్న జనతా ప్రభుత్వంలో ముఖ్య పాత్రలు పోషించాడు. మొరార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా ప్రభుత్వం 1979 సంవత్సరంలో కూలి పోవడానికి, జనతా పార్టీలో చీలిక రావటంలో ...జనసంఘ్ - రాష్ట్రీయ స్వయం సేవక్ పార్టీ ద్వంద సభ్యత్వాల కారణాలలో మధులిమాయే పాత్ర ప్రధానమైనది.. జనతా పార్టీలో భాగమైన వారు ఇతర పార్టీలలో గాని, రాజకీయ సంస్థలతో గాని భాగస్వామ్యంలో ఉ ండరాదని, మురార్జీ దేశాయ్ నేతృత్వంలో ఏర్పడిన జనతా సంకీర్ణ ప్రభుత్వం అధికారం నుండి దింపడంలో రాజ నారాయణ్ కృష్ణ కాంత్ తదితర సహచరులతో కలిసి ప్రణాళికలు రూపొందించి సఫలమయ్యారు. జనతా పార్టీలో భాగస్వాములైన జనసంఘ్ నాయకులు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ((ఆరెస్సెస్) సభ్యులుగా ఉండడంతో ద్వంద్వ సభ్యత్వంపై మధులిమాయే లాంటి నేతల అభ్యంతరాలు 1979 లో జనతా ప్రభుత్వం పతనానికి, జనతా కూటమి పతనానికి దారితీసింది. ఇందిరా గాంధీని ఓడించే ఏకైక లక్ష్యంతో, భిన్న భావజాలాలు కలిగిన పార్టీల కలయికతో ఏర్పడిన జనతా పార్టీ కిచిడీలాంటిదేనని ఆయన నొక్కి చెప్పారు. ఇందిర ఓడి పోవడంతో జనతా పార్టీ చీలిపోవడం ప్రారంభమయింది. వాస్తవానికి లోక్‌సభలో మొరార్జీ దేశాయి ప్రభుత్వానికి మద్దతు నివ్వమని జార్జి ఫెర్నాండెజ్‌కు సలహా ఇచ్చింది మధు లిమాయే. అయితే ఇది జరిగిన కొద్ది గంటలకే సోషలిస్టు నాయకులు మొరార్జీ ప్రభుత్వానికి తమ మద్దతును ఉపసంహరించు కున్నారు. మధు లిమాయే రాజకీయ సిద్ధాంతం, లౌకిక జాతీయవాదం, భారత దేశం యొక్క లౌకిక ఆధారాలపై ఆయనది రాజీలేని వైఖరి. ఆయన రాజ్యాంగంలోని లౌకిక పునాదుల పరిరక్షణకు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. కుల వ్యవస్థకు తన లాంటి సోషలిస్టు ప్రధాన శత్రువని ప్రకటించారు. కుల వ్యవస్థ, దాని ఆధారంగా ఉన్న అసమానతలను కూల్చివేసే వరకు భారత దేశంలో ఆర్థిక మరియు సామాజిక సమానత్వం ఉండదని దృఢమైన అభిప్రాయమని నొక్కి చెప్పారు. మధు లిమాయే తన జీవితమంతా పౌర స్వేచ్ఛ కోసం పోరాడేవారు. పౌరుల స్వేచ్ఛ కోసం దిగువ కోర్టుల నుండి హై కోర్టులలో, సుప్రీం కోర్టులో తన కేసులను వాదించారు. విజయం సాధించారు. మధు లిమాయే విదేశీ విధానంలో... అలీన దేశాల సూత్రములపై ఆధారం, వలసవాద వ్యతిరేకత, ప్రజలందరికీ స్వేచ్ఛ, నిరాయుధీకరణ, అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక ప్రయోజనాల రక్షణ, ప్రపంచ శాంతి మున్నగు వాటిలో గట్టి నమ్మకం ఉ ండేది. రాజకీయ - ఆర్థిక సామ్రా జ్య వాదానికి వ్యతిరేకంగా వలస రాజ్యాల ప్రజల పోరాటం యొక్క పొడిగింపు అయినందున, భారత దేశం తమ విదేశాంగ విధానములో దృఢ వైఖరిని తీసుకోవాలి అని ఆయన పేర్కొనే వారు. మధులిమాయె రాజకీయ నాయకు నిగా కాక రచయితగా ఆంగ్లము, హిందీ, మరాఠి భాషలలో పుస్తకా లను రచించారు. 1997లో భారత ప్రభుత్వం లిమాయే జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంపు విడుదల చేసింది. మధు లిమాయే 1995 జనవరి 8 న్యూఢిల్లీలో మరణించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటి?: నారా లోకేశ్



విశాఖపట్నం: అమరావతికి చట్టబద్ధత ఉంది కాబట్టే గత ప్రభుత్వం రాజధానిని తరలించలేకపోయిందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. విశాఖపట్నంలో మీడియాతో లోకేశ్ మాట్లాడారు. ఇచ్ఛాపురం నుంచి కుప్పం వరకూ పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. పెట్టుబడుల విషయంలో దేశంలోనే టాప్‌లో ఉన్నామని గుర్తు చేశారు. "అమరావతికి మంచి విమానాశ్రయం కావాలి.. అందుకే భూసేకరణ చేస్తున్నాం. ప్రాజెక్టుల పూర్తికి సమయం పడుతుంది. శ్రీకాకుళం నుంచి అనకాపల్లి వరకు వేగంగా అభివృద్ధి జరుగుతోంది. ఎకరం 99 పైసలకే ఇస్తున్నారంటూ కొందరు ఆరోపణలు చేస్తున్నారు. పెద్ద పెద్ద కంపెనీలకు తక్కువ ధరకు భూములు ఇస్తే తప్పేంటి. రాష్ట్రంలో పెట్టుబడులు పెరగాలి.. మన యువతకు ఉద్యోగాలు రావాలి. ఆర్థిక రాజధాని విశాఖే. అందుకే ఇక్కడకి పెట్టబడులు వస్తున్నాయి. విశాఖకు ఐటీ, ఫార్మా, డేటా సెంటర్, స్టీల్ సిటీలు వస్తున్నాయి. అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలనేదే కూటమి ప్రభుత్వ విధానం. సామాజిక మాధ్యమాల్లో వేధింపులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవు. చట్టాన్ని ఉల్లంఘించిన ఎవరినీ వదిలిపెట్టం" అని లోకేశ్ స్పష్టం చేశారు.

**నీటి వివాదంపై..** "సముద్రంలో కలిసే వేల టీఎంసీలు కాపాడి రాయలసీమకు తీసుకెళ్తే తప్పేంటి? తెలంగాణ ప్రాజెక్టులకు మేం ఎక్కడా చిల్లు పెట్టలేదు. మిగిలిన నీళ్లను తెలంగాణ వాడుకోవచ్చు.. చెన్నైకు ఇవ్వొచ్చు. గతంలో పట్టిసీమ దండగని జగన్ అన్నారు. దాన్నే ఐదేళ్లు వాడుకున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత మాపై ఉంది" అని మంత్రి లోకేశ్ అన్నారు.

# ఉత్తరాంధ్రకు మరో శుభవార్త.. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటుకు కీలక ముందడుగు




విశాఖ: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ట్రయల్ రన్ విజయవంతమైన తర్వాత ఉత్తరాంధ్రకు మరో శుభవార్త అందింది. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటుకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రైల్వే జోన్ కార్యాలయాల నిర్వహణ కోసం అవసరమైన ఉద్యోగుల కేటాయింపుపై రైల్వే అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

ఈ క్రమంలో సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌లో పని చేసేందుకు 959 మంది ఉద్యోగులను బదిలీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, సౌత్ కోస్టల్ రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జోన్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయడమే లక్ష్యంగా ఈ బదిలీలను చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా, విశాఖలో సౌత్ కోస్టల్ రైల్వే జోన్‌కు సంబంధించిన కార్యాలయ భవనాల నిర్మాణ పనులు ఇప్పటికే వేగంగా కొనసాగుతున్నాయి. జోన్ కార్యాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర మరింత అభివృద్ధి అవుతుందని అధికారులు భావిస్తున్నారు. సౌత్ కోస్టల్ రైల్వే జోన్ ఏర్పాటు వల్ల ఉ ద్యోగావకాశాలు పెరగడమే కాకుండా, రైల్వే సేవలు మరింత మెరుగుపడతాయని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# నూటికి నూరు శాతం.. ఈ-క్రాప్ చేస్తున్నాం: మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి: గత ఏడాది మిర్చి సీజన్‌లో చాలా ఇబ్బందులు వచ్చాయని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించి, ముందస్తు చర్యలు తీసుకోవడానికి సమీక్ష సమావేశం పెట్టామని ఆయన తెలిపారు. 'మిర్చి ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాది విపరీతంగా మిర్చి పండించారు. ధర అధికంగా ఉ ండటంతో ఎక్కువ సాగు చేశారు. ఈ ఏడాది ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తే మంచి ధరలు ఉంటాయో ఆ స్థాయిలోనే మిర్చి సాగు చేసేలా అవగాహన కల్పించమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చెప్పారు. గత ఏడాది1,90,000 హెక్టార్లలో సాగు చేస్తే ఈ ఏడాది 1,06,000 హెక్టార్లలో సాగు చేశారు'.. '..రైతులు మొక్కజొన్న సాగుకు వెళ్లారు. గత ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లో మిర్చి పెట్టినా రుణాలు ఇవ్వలేదు. ఈ ఏడాది కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టుకున్న మిర్చికి రుణాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇతర రాష్ట్రాల నుండి మిర్చి గుంటూరు



యార్డుకు వస్తుంది. మిర్చి సాగు చేసిన రైతుల వివరాలు రికార్డు చేస్తున్నాం. నూటికి నూరు శాతం ఈ-క్రాప్ చేస్తున్నాం. ట్రాన్స్‌పోర్ట్ సమస్యను పరిష్కరించాం. నల్లి తామర వైరస్ వ్యాపించకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం' అని మంత్రి పేర్కొన్నారు.


చురకలు

## సంపాదకీయం

### 200 ఏళ్ల నాటి మన్రో సిద్ధాంతాన్ని ట్రంప్ తెర మీదకు ఎందుకు తెచ్చినట్లు?

ప్రపంచం ఏమైనా ఫర్లేదు. తన ప్రయోజనాలు మాత్రమే ముఖ్యమన్నట్లుగా వ్యవహరించే అమెరికాకు.. ట్రంప్ లాంటి నేత అధినేతగా మారితే అగ్రరాజ్య మైండ్ సెట్ ఎలా ఉంటుందన్న దానికి నిదర్శనంగా ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు చెప్పేస్తాయి. వాటికి మించినట్లుగా వెనెజువెలా వ్యవహారం ప్రపంచ వ్యాప్తంగా పెద్ద చర్చకు తెర తీసింది. ఏ దేశ పంచాయితీ ఆ దేశానిది. సార్వభౌమత్వానికి సామ్రాజ్యవాదంతో చెక్ పెట్టి.. అదేమంటే.. సదరు దేశాన్ని ఉద్ధరించటమే తమ లక్ష్యంగా చెప్పే అగ్రరాజ్యం ఇప్పుడు సరికొత్త సంస్కృతికి తెర తీసింది. వెనెజువెలా అధ్యక్షుడ్ని అదుపులోకి తీసుకొని.. బంధించి తమ దేశానికి తీసుకెళ్లిన అమెరికా..జరిగిన మొత్తాన్ని ఎప్పటిలానే సమర్థించుకోవటం తెలిసిందే. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన్రో సిద్ధాంతాన్ని ప్రస్తావించారు. ఇంతకూ సదరు సిద్ధాంతమేంటి? దీన్ని సాకుగా చూపించి అమెరికా ఇప్పుడేం చేయాలనుకుంటుంది? ఈ తీరు ప్రపంచాన్ని ఎలా ప్రభావితం చేయనుంది? మన్రో సిద్ధాంతం ప్రపంచానికి సరికొత్త ముప్పు? వాదనలో నిజమెంత? లాంటి అంశాల్లోకి వెళితే.. దాదాపు 200 ఏళ్ల క్రితం అప్పటి అమెరికా అధ్యక్షుడు జేమ్స్ మన్రో (అమెరికా ఐదో అధ్యక్షుడు) 1823లో అమెరికా కాంగ్రెస్ ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో అమెరికాను మరింత ముందుకు తీస్కుళ్లేందుకు వీలుగా కొత్త తరహా వాదనను వినిపించారు. తర్వాతి రోజుల్లో దాన్ని మన్రో సిద్ధాంతంగా సూత్రీకరించారు. దీని ప్రధాన ఉద్దేశం ఏమంటే.. అప్పట్లో బలంగా ఉన్న ఐరోపా దేశాల జోక్యాన్ని నివారించాలన్నదే ఆయన ఉద్దేశం. స్వతంత్ర దేశాల్లో ఐరోపా దేశాల జోక్యాన్ని నివారించేందుకు లాటిన్ అమెరికా దేశాలు సమిష్టిగా ఉండాలన్న వాదనను వినిపించారు. నిజానికి అప్పుడప్పుడే పలు లాటిన్ దేశాలు ఐరోపా దేశాల నుంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకున్నాయి. ఆ దేశాలపై ఐరోపా తిరిగి నియంత్రణ సాధించకుండా నిలువరించటమే లక్ష్యంగా ఆయనీ వాదనను వినిపించారు. అదే సమయంలో పశ్చిమార్థ గోళంలో అమెరికా ప్రాబల్యాన్ని చాటుకునేందుకు తన సిద్ధాంతం దోహదపడుతుందన్నది మన్రో భావన. నిజానికి ఆయన వాదన మొత్తం అమెరికా.. దాని చుట్టుపక్కల ఉండే లాటిన్ అమెరికా దేశాల్లో ఐరోపా జోక్యాన్ని నిలువరించటమే. అయితే.. ఈ వాదనను తర్వాత అమెరికా అధ్యక్షులుగా వ్యవహరించిన అధినేతలు తమకు అనుకూలంగా దాన్ని వాడుకున్నారని చెప్పాలి. మెక్సికో నుంచి ఫ్రాన్స్ ను.. కొలంబియా నుంచి పనామా విడిపోవటానికి.. క్యూబాలో సోవియెట్ యూనియన్ బలాన్ని తగ్గించేందుకు.. నికరాగువాలో తాము కోరుకున్న ప్రభుత్వం కొలువు తీరటానికి.. ఇలా అమెరికా తన ఆర్థిక ప్రయోజనాల కోసం ఎవరినైనా బలి తీసుకునేందుకు వెనుకాడని తీరు కనిపిస్తుంది. తాజాగా వెనెజువెలాలో తాము చేపట్టిన ఆపరేషన్ ను ట్రంప్ సమర్థించుకునే సందర్భంలో మున్రో సిద్ధాంతాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. మదురో పాలనతో ప్రాంతీయంగా అమెరికాకు విదేశీ విరోధ శక్తుల ముప్పు పెరుగుతుందని.. అమెరికా ప్రయోజనాలకు భంగం వాటిల్లే ప్రమాదకర ఆయుధాలు వాటి చేతుల్లోకి వెళుతున్నాయని ఆరోపించారు. ట్రంప్ చేసే వ్యాఖ్యలన్ని ఎవరిని ఉద్దేశించన్నది తెలిసిందే. వెనెజువెలాకు చైనాకు మధ్య బలపడుతున్న బంధాన్ని దెబ్బ తీయటమే అగ్రరాజ్య లక్ష్యమని చెప్పాలి. చూస్తుంటే.. రానున్న రోజుల్లో మరెన్ని దేశాలకు అగ్రరాజ్యం వెనెజువెలా మాదిరి షాకిస్తుందన్నది ప్రశ్న.

## సమస్యల వలయంలో వివాహ బంధం - అవగాహన లోపం...వైవాహిక జీవితానికి శాపం



వైవాహిక జీవితం అనేది ఇరువురు స్త్రీ పురుషుల మధ్య ప్రేమ, నమ్మకం, బాధ్యతలతో నడిచే లోకోత్తర, మహత్తరమైన బంధం. ఇది వ్యక్తిగత జీవితాన్ని మాత్రమే కాకుండా, కుటుంబ నిర్మాణాన్ని కూడా ప్రభావితం చేసే సంబంధం. అయితే, అన్ని సంబంధాల మాదిరిగానే, వివాహ బంధం కూడా సమస్యలను ఎదుర్కొంటుంది. ఈ సమస్యలను ఎదుర్కోవడంలో తటస్థత లేకపోతే, వివాహ బంధం విఫలమయ్యే ప్రమాదం ఉంది.

**వైవాహిక వైఫల్యాలకు ప్రధాన కారణాలు...**

**అవాంచనీయ అంచనాలు, అపోహలు:** ప్రేమ వివాహం అయినా లేదా కుదిరిన వివాహం అయినా, వివాహాన్ని ఎప్పుడూ సంతోషంగా ఉండే బంధంగా ఆలోచించడం మాని, చాలా మందిలో తప్పుడు అంచనాలు కల్పిస్తుంది.

అసమంజసమైన అంచనాలు, ఉదాహరణకు భాగస్వామి అన్ని అవసరాలను తీరుస్తారని భావించడం, విభేదాలకు దారితీస్తాయి.

**కమ్యూనికేషన్ లోపం:** సంబంధాలలో పరస్పర అర్థం చేసుకోవడంలో లోపం, భావోద్వేగాలను పంచుకోక పోవడం ప్రధాన సమస్య. మాట్లాడటం కాకుండా, మౌనం పాటించడం లేదా చిన్న విషయాలపై పెద్ద చర్చలు జరపడం సంబంధంలో దూరాన్ని పెంచుతుంది.

**ఆర్థిక ఒత్తిడులు:** డబ్బు సమస్యలు, అప్పులు, ఖర్చుల నిర్వహణకు సంబంధించి విభేదాలు. ఆర్థిక వివాదాలు సాధారణంగా దాంపత్యంలో ఒత్తిడికి కారణమవుతాయి.

**వ్యక్తిగత స్వభావ భేదాలు:** భాగస్వాముల అభిరుచులు, లక్ష్యాలు, జీవితానికి ఉన్న దృక్పథం భిన్నంగా ఉంటే సంబంధం పటిష్ఠంగా ఉండడం కష్టసాధ్యం.

సర్దుబాటు లేకపోవడం వల్ల విభేదాలు మరింత తీవ్రమవుతాయి.

**అవిశ్వాసం:** భాగస్వామిపై నమ్మకం కోల్పోవడం, అనుమానాలు పెరగడం, పారదర్శకత లేకపోవడం సంబంధాన్ని దెబ్బతీస్తాయి.

**సమాజ మరియు కుటుంబ ప్రభావం:** కుటుంబ సభ్యుల జోక్యం, పిల్లల విషయం, లేదా ఆస్తి విభజన వంటి సామాజిక అంశాలు వివాహ బంధంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. మానసిక మరియు శారీరక ఆరోగ్య సమస్యలు: శారీరక అనారోగ్యం, డిప్రెషన్ వంటి మానసిక సమస్యలు ఒత్తిడిని పెంచుతాయి. భాగస్వామిపై పెరిగే బాధ్యతల వల్ల విభేదాలు పెరుగుతాయి.

**వైఫల్యాల ప్రభావాలు...**

**వ్యక్తిగత ప్రభావం:** డిప్రెషన్, ఆత్మవిశ్వాసం లోపం, ఒంటరితనం వంటి సమస్యలు ఎదురవుతాయి. జీవితం పట్ల నిరాశ, పని సామర్థ్యం తగ్గిపోవడం సాధారణం.

**కుటుంబ, పిల్లలపై ప్రభావం:** పిల్లల మానసిక ఆరోగ్యం దెబ్బతింటుంది, వారు భయానికి లోనవుతారు. కుటుంబ సంబంధాలు దూరమవుతాయి.

**సామాజిక ప్రభావం:** విడాకులు, చట్టపరమైన సమస్యలు, మరియు ఇతర కుటుంబాలలో గందరగోళం ఏర్పడుతుంది. సమాజంలో కుటుంబ వ్యవస్థ పట్ల నమ్మకం తగ్గుతుంది.

**పరిష్కార మార్గాలు... కమ్యూనికేషన్ మెరుగుపరచడం:** సమస్యలను ఒకరి నొకరు చర్చించుకోవడం, వినడం, అర్థం చేసుకోవడం అవసరం. అభిప్రాయాలను పంచుకునే అవకాశం కల్పించడం సంబంధానికి మరింత బలం ఇస్తుంది.

సర్దుబాటు: సర్దుబాటు చేయడం ద్వారా సంబంధం పటిష్ఠమవుతుంది. చిన్నచిన్న సమస్యలను పెద్దవిగా మార్చకుండా పంచుకుని పరిష్కరించడం ముఖ్యం.

**సమయానుకూల సలహా:** సంబంధాలకు సంబంధించి సమస్యల పరిష్కారానికి కౌన్సిలింగ్ తీసుకోవడం. మంచి నిపుణులను సంప్రదించడం ద్వారా మార్గదర్శనం పొందవచ్చు.

**ఆర్థిక నిర్వహణ:** ఒకరి ఆర్థిక అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఖర్చులను ప్లాన్ చేసుకోవడం. పొదుపు చేసుకోవడం, ఆర్థిక విషయాల్లో పారదర్శకత కాపాడడం.

**ప్రేమ, గౌరవం:** పరస్పర గౌరవం, ప్రేమ, నమ్మకం ద్వారా సంబంధం బలపడుతుంది. చిన్న విషయాల్లోనూ భాగస్వామిని ప్రోత్సహించడం అవసరం.

**వ్యక్తిగత వృద్ధికి ప్రాధాన్యత:** ఇద్దరి వ్యక్తిగత అభిరుచులు, లక్ష్యాలను గుర్తించి, వాటిని కొనసాగించేందుకు ప్రోత్సహించడం. వైవాహిక జీవితం ఒక అందమైన ప్రయాణం. ఈ ప్రయాణంలో ప్రేమ, సహనంతో సమస్యలను అధిగమించగల సామర్థ్యం ప్రతి వ్యక్తిలో ఉంటుంది. సంబంధాన్ని బలంగా నిలుపుకోవడంలో నమ్మకం, కమ్యూనికేషన్, పరస్పర గౌరవం ముఖ్య పాత్ర పోషిస్తాయి. సంబంధం విషయంలో ఇరువురు సహకరించే స్థితిని కల్పించగలిగితే, సమస్యలు ఎన్ని వచ్చినా బంధం నిలబడగలదు. ప్రేమ, నమ్మకంతో సంబంధం సుస్థిరం చేయగలిగితే, వైఫల్యాలకు తావు ఉండదు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## అసమాన మేధావి స్టీఫెన్ హాకింగ్ - జనవరి 8... స్టీఫెన్ హాకింగ్ జయంతి



ఆయన ఒక విధి వంచితుడు. అయితే ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు విధి ఓడిపోయింది. విధి వక్రించినా ఆయన వెరవలేదు. శరీరం కదల్చడానికి వీలు లేని స్థితిలోనూ ఆయన చేసిన పరిశోధనా కృషి ప్రపంచ వ్యాప్తంగా ఆయనకు ప్రఖ్యాతిని తెచ్చిపెట్టింది. అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందుకు న్న ఘనుడు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం పొందిన మేధావి. కనీసం కదలడానికి సహకరించని శరీరం, చక్రాల కుర్చీకి అతుక్కుపోయిన మనిషి, కనీసం మాట్లాడటానికీ కంప్యూటర్ సహాయం... ఇవి ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ను గుర్తించడానికి ఆనవాళ్లు. మోటార్ న్యూరాన్ వ్యాధి శరీరాన్ని కబళిస్తున్నా... చేస్తున్న పనికి శరేరం సహకరించక పోయినా...ఆయన పరిశోధనలు ఖగోళ శాస్త్రంలో ఎన్నో ప్రశ్నలకు సమాధానాన్ని చూపాయి. శాస్త్రవేత్తగానే కాక ఆయనపై ఆయనకున్న నమ్మకం, కలసిరాని విధిని తనకు అనుకూలంగా మార్చుకునే తత్వం నేటి యువతకు ఆదర్శం. స్టీఫెన్ హాకింగ్ ఓ సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త. ఎమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ అనే నాడీమండలానికి సంబంధించిన జబ్బు వల్ల క్రమక్రమంగా దశాబ్దాల తరబడి అతని శరీరభాగాలు చచ్చుబడుతూ వచ్చినా, తన మెదడు పనిచేస్తూండడాన్ని దన్నుగా ఉపయోగించుకుని కృష్ణబిలాలకు సంబంధించిన అనేక అంశాలు మొదలుకొని సైద్ధాంతిక భౌతిక శాస్త్రంలో ఎన్నో పరిశోధనలు చేశాడు. హాకింగ్ రాయల్ సొసైటీ ఆఫ్ ఆర్ట్స్‌లో గౌరవ సభ్యుడిగా, పాంటిఫికల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో జీవిత కాల సభ్యునిగా ఉన్నాడు. ఆయన అమెరికా అత్యున్నత పౌర పురస్కారమైన ప్రెసిడెన్షియల్ మెడల్ ఆఫ్ ఫ్రీడమ్ అందు కున్నాడు. టైమ్స్ పత్రిక వారి 100 మంది అత్యంత గొప్పవారైన బ్రిటీషర్ల జాబితాలో 25వ స్థానం అతనిదే. ఆయన రాసిన ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అన్న పుస్తకం ద బ్రిటీష్ సండే టైమ్స్ బెస్ట్ సెల్లర్ల జాబితాలో 237 వారాల పాటు నిలిచి రికార్డులు బద్దలు కొట్టింది, ఈ పుస్తకపు అమ్మకాలు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం సంపాదించాయి. శరీరం చాలావరకూ చచ్చుబడి పోయినా ఆయన జీవితాంతం ఒకే ఒక్క దవడ ఎముక కదులుస్తూ, దానికి అమర్చిన సంభాషణలు-ఉత్పత్తి చేసే పరికరం ఉపయోగించి సంభాషించేవాడు. ప్రఖ్యాత ఖగోళ శాస్త్రవేత్త గెలిలియో మరణించి దాదాపు 300 సంవత్సరాల అనంతరం 1942 జనవరి 8వ తేదీన ఇంగ్లాండు లోని ఆక్స్ ఫర్డ్ లో స్టీఫెన్ హాకింగ్ జన్మించాడు. గణిత ఉపాధ్యాయుని ప్రేరణతో గణిత శాస్త్రంలో స్పెషలైజేషన్ చేద్దామను కున్నాడు స్టీఫెన్. కాని దానికి వ్యతిరేకంగా తండ్రి రసాయన శాస్త్రంలో చేర్పించాడు. తరువాత 1959లో నేచురల్ సైన్స్ విద్య కోసం స్కాలర్ షిప్ పరీక్ష రాశాడు. అందులో సఫలీకృతుడు కాగలిగినా... భౌతిక శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశాడు స్టీఫెన్. 1962లో కేవలం ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడు కాగలిగాడు. కాస్మాలజి, జనరల్ రిలెటివిటీ పరిశోధనల కోసం ఆక్స్‌ఫర్డ్ కి వెళ్ళాడు. అప్పటి నుంచి స్టీఫెన్ పరిస్థితి పూర్తిగా మారింది. తినాలన్నా... కనీసం బూట్ల లేసు కట్టుకుందా మన్నా... స్టీఫెన్ శరీరం సహకరించేది కాదు. క్రిస్‌మస్ సెలవులకు ఇంటికి వెళ్ళిన స్టీఫెన్ పరిస్థితి ఆయన తల్లిదండ్రులను కలవర పెట్టింది. భోజనం చేయడానికి ఆయన పడుతున్న ఇబ్బంది... తల్లిని మధనపెట్టింది. ఆ సమయంలోనే ఆసుపత్రిలో చేసిన పరీక్షల్లో ఆయనకు మోటార్ న్యూరాన్ వ్యాధి అనే భయంకర వ్యాధి ఉన్నట్టు తెలిసింది. దీనినే Amyotrophic Lateral Sclerosis (ALS) వ్యాధి అని కూడా అంటారు. నాడీ మండలం పై అంటే నరాలు, వెన్నుపూస పై ఇది ప్రభావం చూపుతుంది. భౌతిక శాస్త్రవేత్త వెర్నర్ ఇస్రయిల్ 'మోజట్ కంపోజింగ్ సింఫనీ' తెచ్చి స్టీఫెన్ తలకు అమర్చాడు. దాని వల్ల ఆయనకు తనను తాను వ్యక్తీకరించుకునే అవకాశం కలిగింది. దాన్ని అభ్యసించడానికి ఆయనకు కొంత సమయం పట్టినా, తర్వాత కాలంలో అది ఎంతో ఉపయోగపడుతూ వచ్చింది. 1970 నాటికి మాట పూర్తిగా పడిపోయింది. అతని హావభావాలు కుటుంబ సభ్యులకు, అతి సన్నిహితులకు మాత్రమే అర్థమయ్యేవి. 1985లో ఆయనకు నిమోనియా వచ్చింది , అప్పటి నుంచీ ఒక చక్రాల కుర్చీకి పరిమితమై తన చేతి చిటికెన వేలి కదలికల సాయంతో మాత్రమే దానికి అనుసంధానించి, రూపొందించిన 'వాయిస్ సింథసైజర్'తో తన ఆలోచనలను శాస్త్ర లోకానికి అందిస్తున్నారు. హాకింగ్ చిటికెన వేలు కదలికల్ని ఒక హ్యాండ్ కంట్రోలర్ యంత్రానికి అమర్చిన తెరపై అక్షరాలను స్కాన్ చేసే కర్సర్ నియంత్రిస్తుంది. ఆయన ఎంచుకున్న అక్షరాల్ని, యంత్రంలోని వ్యవస్థ తనంతట తానే పని చేసే 'అల్గారిదమ్' సాయంతో మాటలు వాక్యాల రూపంలో రూపొందించి తెరపై ప్రకటిస్తుంది. కంప్యూటర్ ఇంజనీర్ డేవిడ్, ఒక చిన్న కంప్యూటర్‌ని స్టీఫెన్ హాకింగ్ వీల్‌ఛైర్‌కు అమర్చాడు. అందులోని సింథసైజర్ విషయాన్ని మాటగా మార్చి ఎదుటి వారికి వినిపిస్తుంది. అందుకోసం తన గొంతునే వాడమన్నాడు స్టీఫెన్. మాట పడిపోక ముందున్న తన గొంతు ధ్వనిని అందులో ఉపయోగించమన్నాడు. దాని వల్ల స్టీఫెన్ హాకింగ్ సాంకేతిక సంభాషణ సహజ సంభాషణలా మారిపోయేది. డాక్టరేట్ సంపాదించేలోపే స్టీఫెన్ మరణిస్తాడని అనుకున్నారంతా... కానీ ఆయన పట్టుదల, ఆత్మస్థైర్యం ముందు మృత్యువు ఓడిపోయింది. మళ్లీ విశ్వవిద్యాలయానికి తిరిగివచ్చిన హాకింగ్ తన పరిశోధనల్లో నిమగ్నమయ్యాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి తెలిసి మిత్రులు సహకరించాలని చూసినా స్టీఫెన్ సున్నితంగా తిరస్కరించే వాడు. ఎన్నో విశ్వవిద్యాలయాల్లో పనిచేసిన స్టీఫెన్ కు, వ్యాధి అడ్డంకిగా మారలేదు. తన నాడీ మండలం పూర్తిగా పాడవుతున్నా, మెదడు సహకరించడాన్ని స్టీఫెన్ గమనించాడు. 1966లో ఆయన సమర్పించిన 'ప్రాపర్టీస్ ఆఫ్ ఎక్స్‌పాండింగ్ యూనివర్సెస్' థీసిస్‌ను ఆన్‌లైన్‌లో ఉంచగా ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది దానిని చదివేందుకు ఆసక్తి చూపారు. 1970 నుంచి కృష్ణబిలాలపై పరిశోధనలు ప్రారంభించాడు. తీరికలేని స్టీఫెన్ తనకు వ్యాధి వుందన్న విషయాన్ని కూడా మరచి పోయాడు. క్వాంటం థియరి, జనరల్ రిలెటివిటీ లను ఉపయోగించి... కృష్ణబిలాలు కూడా రేడియేషన్ ను వెలువరిస్తాయని కనుగొన్నాడు. 1971నుంచి బిగ్ బ్యాంగ్ పై పరిశోధనలు మొదలు పెట్టిన ఆయన కృష్ణబిలాలకు సంబంధించి ఎన్నో విషయాలను ఆవిష్కరించాడు. 1984లో ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ పుస్తకరచన ప్రారంభించాడు. ఆ సమయంలోనే వ్యాధి వల్ల 1985లో వైద్యుల దగ్గర ఉండాల్సి వచ్చింది. అప్పుడే కంప్యూటరు సాయంతో మాట్లాడ గలిగే పరికరాన్ని స్టీఫెన్ తయారు చేసుకున్నాడు. దాని సాయంతోనే 1988లో పుస్తకాన్ని వెలువ రించాడు. అది అమ్మకాల్లో సృష్టించిన రికార్డు అంతా ఇంతా కాదు. ప్రపంచ వ్యాప్తంగా 40 భాషల్లో ఆ పుస్తకం వెలువడింది. తెలుగులోనూ... కాలం కథ పేరుతో వెలువడింది. ప్రపంచ వ్యాప్తంగా ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ టైమ్ అమ్మకాల్లో సృష్టించిన రికార్డు వల్ల అది 1998 అంటే వెలువడిన 10 సంవత్సరాల తరువాత గిన్నిస్ బుక్ లో స్థానం సంపాదించింది. 2014లో హాకింగ్ జీవిత విశేషాలతో ది థియరీ ఆఫ్ ఎవ్వరిథింగ్ అనే సినిమా తీశారు. దీనికి ఆస్కార్ అవార్డు కూడా వచ్చింది. సోషల్ మీడియాలో చేరిన క్షణాల్లోనే ఆయన మిలియన్ ఫాలోవర్స్‌ను పొందాడు. ఇక స్టీఫెన్ హాకింగ్ చేసిన తొలి పోస్ట్‌కు క్షణాల్లో ఏకంగా ఐదులక్షల లైక్లు వచ్చాయి. 1975 ఎడిటంగ్ మెడల్; 1976 రాయల్ సొసైటి హ్యూగ్స్ మెడల్; 1979 అల్బర్ట్ ఐన్ స్టీన్ మెడల్; 1982 ఆర్డర్ ఆఫ్ బ్రీటీష్ ఎఒపైర్ (కమాండర్); 1985 రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ బంగారు పతకం; 1986 పొంటిఫిషియల్ అకాడమి ఆఫ్ సైన్స్ లో సభ్యత్వం; 1988 భౌతిక శాస్త్రంలో అంతర్జాతీయ బహుమతి; 1989 కన్ కర్డ్ లో ఆస్ట్రియా ప్రిన్స్ అవార్డ్; 1989 కంపానియన్ ఆఫ్ ఆనర్; 1999 అమెరికా భౌతిక శాస్త్ర సమితి వారి జూలియస్ ఎడ్గర్ లిలెన్ ఫెల్డ్ ప్రైజ్; 2003 కేస్ వెస్ట్రెన్ రిజర్వ్ విశ్వ విద్యాలయం వారి మైల్ సన్ మోర్లీ అవార్డ్; 2006 రాయల్ సొసైటీ కాప్లి మెడల్ తదితర ఎన్నో అవార్డులను ఆయన సొంతం చేసుకున్నాడు. 2018 మార్చి 14 న బుధవారం ఆయన కేంబ్రిడ్జ్‌లోని తన నివాసంలో మరణించాడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

## భావి తరాలకు మార్గదర్శకాలు... మామిడిపూడి బహుముఖ సేవలు - జనవరి 8...మామిడిపూడి వేంకట రంగయ్య జయంతి

మామిడిపూడి వేంకట రంగయ్య (1889ఉ1981) 20వ శతాబ్దపు ప్రముఖ భారతీయ చరిత్రకారుడు, విద్యావేత్త, ఆర్థికవేత్త, రాజనీతి శాస్త్రవేత్త, విశిష్ట రచయిత.

ఆయన చరిత్ర రచన, సాహిత్యానికి చేసిన కృషి ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అపురూపమైన పేజీగా నిలిచింది. ఆయన రచనలు నేటికీ చారిత్రక, విద్యా ప్రపంచానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

**ప్రారంభ జీవితం, విద్యాభ్యాసం..** మామిడిపూడి వేంకట రంగయ్య నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా పురిణి గ్రామంలో 1889 జనవరి 8న జన్మించారు. ఆయన తల్లిదండ్రులు వెంకటేశం, నరసమ్మ. బాల్యంలోనే ఆయనకు తెలుగు, సంస్కృత భాషలపై మక్కువ పెరిగింది. అనంతరం మద్రాసు పచ్చయప్ప కళాశాలలో చేరి చరిత్ర, ఆర్థిక శాస్త్రాల్లో మంచి ప్రతిభ చూపారు.

1907లో బి.ఎ. పరీక్షలో మొదటి తరగతిలో ఉత్తీర్ణులై తన విద్యా విషయంలో స్ఫూర్తిదాయకమైన శిక్షణ అందుకున్నారు. ఆ తర్వాత మద్రాసు విశ్వవిద్యాలయం నుంచి చరిత్ర, ఆర్థిక శాస్త్రాలలో ఎం.ఏ. పూర్తిచేసి ఆంధ్రా యువతకు రోల్ మోడల్‌గా నిలిచారు.

**ఉద్యోగ జీవితం...**

**కాకినాడలో ప్రారంభం:** వేంకట రంగయ్య తన విద్యా సేవా జీవితాన్ని కాకినాడలోని పిఠాపురం రాజావారి కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా 1910లో ప్రారంభించారు. ఆయనకు విద్యార్థుల చరిత్రపై ఆసక్తి కలిగించడంలో అద్భుత నైపుణ్యం ఉండేది. 1914లో విజయనగరం మహారాజా కళాశాలలో ఆర్థిక మరియు రాజనీతి శాస్త్ర విభాగానికి ప్రొఫెసర్‌గా చేరారు. ఆయన విద్యా బోధనలో కొత్త మార్గాలను అందిస్తూ, అప్పటి విద్యార్థులను జాతీయ చైతన్యంతో ప్రభావితం చేశారు. ఆంధ్రా విశ్వవిద్యాలయంలో చరిత్ర, రాజనీతి శాస్త్ర శాఖలో రీడర్, ప్రొఫెసర్‌గా పనిచేసి ఆ శాఖకు ప్రగతి దిశలో దారి చూపారు. అనంతరం బొంబాయి విశ్వవిద్యాలయంలో రాజనీతి శాస్త్ర విభాగం అధిపతిగా పనిచేశారు.

**చరిత్రకారునిగా కృషి:** వేంకట రంగయ్య చరిత్ర రచనకు శాస్త్రీయ దృక్పథన్ని అవలంబించారు. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని, ఆంధ్రప్రదేశ్ చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో అధ్యయనం చేసి, వివరణాత్మక గ్రంథలను రాశారు.

**ప్రధాన రచనలు:** ఆంధ్రలో స్వాతంత్ర్యోద్యమం ఉ ఈ నాలుగు సంపుటాల గ్రంథం ఆంధ్ర ప్రాంతంలో స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రకు ప్రధాన మైలురాయిగా నిలిచింది. భారత స్వాతంత్ర్య సమరగాథ ఉ మూడు సంపుటాలలో భారత స్వాతంత్ర్య సమరాన్ని వివరిస్తూ గొప్ప చారిత్రక సమాచారం అందించారు.

ది వెల్ఫేర్ స్టేట్ అండ్ సోషలిస్ట్ స్టేట్ ఉ ఆంగ్లంలో వ్రాసిన ఈ గ్రంథం ఆర్థిక విధానాలపై ప్రగతిశీల ఆలోచనలను ప్రతిబింబిస్తుంది.

సంఘ సంస్కరణలు ఉ ఆంధ్రజాతి చైతన్యం, సమాజంలోని మార్పులపై వెలుగు పడే గ్రంథం.

**విద్యావేత్తగా విశేషాలు:** వేంకట రంగయ్య పాఠశాలల స్థాపనకు, పాఠ్య ప్రణాళికల అభివృద్ధికి కృషి చేశారు. విద్యార్థుల చరిత్ర జ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా, ఆర్థిక శాస్త్రం, రాజనీతి శాస్త్రాల్లో వారిలో చైతన్యం కలిగించారు.

**సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం:** వేంకట రంగయ్య "సంగ్రహ ఆంధ్ర విజ్ఞాన కోశం"కు సంపాదకవర్గ అధ్యక్షులుగా వ్యవహరించి, 1958లో తొలి సంపుటాన్ని వెలువరించారు. ఇది తెలుగు భాషలో విజ్ఞాన కోశానికి ప్రధానంగా ఉపయోగ పడింది.

**రాజకీయ అవగాహన:** వేంకట రంగయ్య భారత రాజకీయ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి, తన రచనల ద్వారా ప్రభుత్వ విధానాలను విమర్శించారు. ప్రత్యేకంగా "ప్రెస్ బిల్లు"పై ఆయన చేసిన విమర్శలు



ప్రభుత్వ విధానాలపై ప్రజలకు అవగాహన కలిగించాయి.


**గౌరవాలు:** 1968లో భారత ప్రభుత్వం వేంకట రంగయ్యను పద్మభూషణ్ అవార్డుతో సత్కరించింది. ఇది ఆయన చేసిన సేవలకు గల గుర్తింపుగా నిలిచింది.

**మరణం:** మామిడిపూడి వేంకట రంగయ్య 1981 జనవరి 13న హైదరాబాదులో 93వ యేట మరణించారు. మామిడిపూడి వేంకటరంగయ్య జీవితం స్ఫూర్తిదాయకం.

చరిత్ర, విద్య, రాజకీయాలు, సాహిత్య రంగాలలో ఆయన చేసిన కృషి చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది. ఆయన రచనలు భావితరాలకు మార్గదర్శకంగా ఉంటాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్, ఇండిపెండెంట్, జర్నలిస్ట్, కాలమిస్ట్... 9440595494**

# పర్యాటక సోయగం.. ఆధ్యాత్మిక సంగమం



ధర్మపురి : పరవశించే ప్రకృతి సోయగం.. మలుపులు తిరుగుతూ పరవళ్లు తొక్కే గోదావరి అందాలు.. యాత్రికులను ఇట్టే ఆకట్టుకునే పుణ్యక్షత్రాల సంగమం.. శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన చారిత్రక ప్రదేశం.. జిల్లాల అనుసంధానానికి వీలుగా జలమార్గం.. మరోవైపు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు, చరిత్రకారులకు ఆహ్లాదంతోపాటు ఆనందాన్ని పంచుతుంది ఎల్లంపల్లి జలాశయం. జగిత్యాల–మంచిర్యాల జిల్లాలను విడదీస్తూ హద్దులను గీసినట్టుగా ఏర్పడిన గోదావరి నది మూడు కాలాలు నీటితో నిండి పర్యాటకానికి ఆలవాలంగా నిలుస్తోంది. 30 కిలోమీటర్ల మేర విస్తరించిన జలాశయం బ్యాక్ వాటర్‌లో విహారానికి అనువుగా బోటింగ్ ఏర్పాటు చేసి పర్యాటక సర్క్యూట్‌గాతీర్చిదిద్దితే సరిహద్దులను చెరిపివేస్తూ రెండు జిల్లాల్లోని చారిత్రక, ఆధ్యాత్మిక పట్టణాలకు వారధిగా, విహారాని కి మణిహారంగా మారి తీర గ్రామాల్లో పర్యాటక శోభ సంతరించుకో నుంది.

**తొలి రాజధాని కోటిలింగాల**

చారిత్రక ప్రాధాన్యత కలిగిన శాతవాహనుల రాజధానిగా వెలుగొందిన కోటిలింగాల, అక్కడ వెలిసిన కోటి లింగేశ్వరస్వామి ఆలయం పేరుగాంచింది. చరిత్రలో ఎక్కడా లభ్యంకాని శాతవాహనకాలం నాటి నాణేలు ఇక్కడ లభ్యమయ్యాయి. ఇప్పటికే కోట, ఆలయం, పురాతన చరిత్రాత్మక ఆధారాలతోపాటు బోటింగు పర్యాటకులను ఆకట్టుకుంటుంది. **మునుల గుట్టలు**


వెల్గటూర్, ధర్మపురి మండలాల్లో మునుగు గుట్టలు అత్యంత చారిత్రక ప్రాధాన్యం కలవి. నేరెళ్ల పసులపాపని, బీర్‌పూర్ గుట్టలు ప్రకృతి సహజ సంపదకు ఆలవాలంగా ఉన్నాయి. రోళ్లవాగు, బీర్‌పూర్ గుట్టలను అభివృద్ధి పరిస్తే మరింతగా పర్యాటకులను ఆకట్టుకుంటాయి. **నవనారసింహ క్షత్రాల్లో ధర్మపురి**ధర్మపురి శ్రీ లక్ష్మనరసింహస్వామి దేవస్థానం అత్యంత ప్రాధాన్యం కలది. దక్షణాభిముఖంగా ప్రవహించే గోదావరిలో స్నానాలు ఆచరించి నరసింహుడి దర్శనానికి బారులు తీరుతారు. విశాలమైన బ్రహ్మపుష్కరిణీ, శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, ఇసుకస్తంభం, అక్కపల్లి శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయం, కాలభైరవాలయం ప్రసిద్ధి గాంచినవి.

# పుర పీఠంపై గురి!

నల్గొండ : పురపాలిక ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఓటరు జాబితా రూపకల్పనకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. 10న తుది జాబితాను ప్రచురించనున్నారు. జనవరి 11 లేదా సంక్రాంతి పర్వదిన సెలవుల అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీల ముఖ్యనేతలు రిజర్వేషన్లకు అనుగుణంగా క్షత్రస్థాయిలో బలమైన అభ్యర్థులను బరిలో నిలిపేందుకు సర్వేలు షురూ చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లావ్యాప్తంగా మొత్తం 19 పురపాలికలుండగా నకిరేకల్ మినహా మిగిలినవాటికి ఎన్నికలు జరగనున్నాయి.

**'హస్త'గతం కోసం మంత్రుల దిశానిర్దేశం**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ మరోసారి అదే జోరు కొనసాగించేందుకు పావులు కదుపుతోంది. మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు నాయకులను, శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ పార్టీ బాధ్యులను సమన్వయం చేసుకుని అవసరమైన కార్యాచరణ చేపట్టాలని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ డీసీసీలకు ఆదేశాలు జారీ చేశారు. నల్గొండ, సూర్యాపేటలో వ్యక్తిగత, అంతర్గత కుమ్ములాట



లు కొంత కలవరపెడుతున్నాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో విప్, ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షునిగా ఒకరే ఉన్నా.. సీనియర్ నాయకుల మధ్య ఆధిపత్య పోరుతో పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో కొంత ప్రతికూల ఫలితాలు వచ్చాయి. పురపాలికల వారీగా సీఎం రేవంత్‌రెడ్డి బహిరంగ సభలు నిర్వహించనుండటం సానుకూలాంశం. రెబల్‌గా బరిలో దిగితే పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని పీసీసీ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్, ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. దీంతో ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకులు తమ 'భవితవ్యం'పై కలవరపడుతున్నారు.

**పంచాయతీ స్ఫూర్తిగా.. 'కారు' పయనం**

'పంచాయతీ' ఫలితాల జోష్‌తో గులాబీ పార్టీ పుర ఎన్నికలకు సిద్ధమవుతోంది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో పాటు మాజీ ప్రజాప్రతినిధులు అందరూ కలిసి అధికార పార్టీ అభ్యర్థులను ఎదుర్కొనే నాయకులతో, కార్యకర్తలతో అంతర్గత సమావేశాలు నిర్వహిస్తున్నారు. పురపాలికల్లో ప్రచారం చేసేందుకు మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు వచ్చేందుకు సభలు ఎక్కడెక్కడ పెట్టాలనేది గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నారు. **సత్తా చాటాలని 'కమలం'.. వామపక్షల వ్యూహం**

బహిర్గతమైన కుమ్ములాటలను మర్చిపోయి సంస్థాగతంగా ముందుకువెళ్లేందుకు భాజపా ఏర్పాట్లు చేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో యువ ఓటర్లను ఆకర్షించేందుకు సభ్యత్వాల జోరును పెంచింది. గతంలో సత్తా చాటిన మాజీ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులతో కలిసి పార్టీ అధ్యక్షలు ప్రత్యేక వ్యూహరచనలు చేస్తున్నారు. వామపక్షలు తమ సత్తా చాటేందుకు అగ్రనాయకులతో సమావేశాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించాయి.

# తనిఖీలు 'మామూలే'



వీణవంక : మానేరు వాగు ఇసుక అక్రమ రవాణా దారులకు అడ్డాగా మారింది. ప్రతిరోజు వాగులోంచి వందల ట్రాక్టర్ల ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తున్నారు. అధికారుల తనిఖీలు మామూళ్లకే పరిమితమయ్యాయి. మానేరులో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలతో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వాగులో పెద్దపెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. స్థానిక అవసరాలకే కాకుండా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు.

**రోజు 300 ట్రాక్టర్లతో దందా**

వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి, కొండపాక, కోర్కల్, మల్లారెడ్డిపల్లి, చల్లూరు, మామిడాలపల్లిలలోని మానేరు నుంచి ఆయా గ్రామాల్లోని సుమారు 300 ట్రాక్టర్ల ద్వారా రోజుకు రెండు ట్రిప్పుల చొప్పున ఇసుక రవాణా జరుగుతున్నట్లు సమాచారం. ఈ లెక్కన ఒక్కరోజులోనే రూ. 10 లక్షల ప్రభుత్వ ఖజానా పోతోంది. ఇక్కడి నుంచి శంకరపట్నం, హుజూరాబాద్, సైదాపూర్, భీమదేవరపల్లి, కమలాపూర్, హనుమకొండ మండలాలలకు రవాణా అవుతున్నట్లు తెలిసింది. ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 3000 నుంచి 8000 వేల వరకు తీసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. కింది స్థాయి ఉద్యోగులు ఆపితే ట్రాక్టర్‌కు రూ. 500 ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రవాణాదారులు గ్రూపులుగా ఏర్పడి బ్లూకోల్ట్ సిబ్బంది కళ్లు గప్పుతున్నారు. ఫోన్‌ల ద్వారా సమాచారం చేరవేస్తూ.. ఇసుకను పక్కదారి పట్టిస్తున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

ఇసుక అక్రమ రవాణా ఆపాల్సిన బాధ్యత పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్ శాఖల అధికారులది. పోలీసులు అప్పుడప్పుడు ట్రాక్టర్లు పట్టుకుంటున్నా.. చర్యలు మాత్రమే నామమాత్రంగానే ఉంటున్నాయి. మిగతా శాఖలు పట్టన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ప్రజల అవసరాలకు ఇసుక తరలించేందుకు ప్రభుత్వం మల్లారెడ్డిపల్లి మానేరు నుంచి బుకింగ్ ద్వారా అందించేందుకు అవకాశం కల్పించింది. కాని అక్రమ రవాణాతో బుకింగ్‌లు కాక ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**చర్యలకు సిబ్బందికి ఆదేశాలు..**

వీణవంక మండలంలో మానేరు వాగు నుంచి ఇసుక అక్రమ రవాణా అవుతున్నట్లు తమ దృష్టికి వచ్చింది. భూగర్భ జలాల పరిరక్షణకు పాటుపడతాం. పూర్తి స్థాయిలో అక్రమ రవాణా నిరోధించేలా గ్రామాల్లోని కిందిస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తాం. అనుపమరావు, తహసీల్దార్, వీణవంక మండలం

# అందని యంత్రం.. సాగు భారం



జగిత్యాల : ఏడేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పథకం అమలు నిలిచిపోవడంతో రైతులకు ఆర్థిక భారం తప్పడం లేదు. తాము అధికారంలోకి వస్తే పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వగా రెండేళ్లు దాటినా ఆచరణకు నోచుకోవడం లేదు. నిరుడు యాసంగిలో కేవలం మహిళా రైతులకు అరకొరగా పంపిణీ చేయగా ఈ ఏడాది వానాకాలం సీజన్ ముగిసి యాసంగి సాగు ప్రారంభమైనా అతీగతీ లేదు.


**పునరుద్ధరిస్తే మేలు**

ఉమ్మడి జిల్లాలో ప్రతి సీజన్‌లో 12.45 లక్షల ఎకరాల్లో ఆహార, వాణిజ్య పంటలు, 1.92 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. వ్యవసాయంలో పశువుల వాడకం తగ్గడంతో దాదాపు అన్ని పనులకూ యంత్రాలనే వాడుతున్నారు. గతంలో గడ్డి కట్టలు కట్టే యంత్రాలు, ఫ్లవ్‌లు, కల్టివేటర్లు, రొటోవేటర్లు, టార్పాలిన్ షీట్లు, పంపుసెట్లు, పిచికారీ యంత్రాలు, సీడ్ డ్రిల్, నీటి పైపులు, బిందు, తుంపర సేద్య పరికరాలు, సోలార్ ఫెన్సింగ్, డ్రోన్లు, పత్తి తీత యంత్రాలు, తదితర పరికరాలను రాయితీపై అందజేశారు. పథకాన్ని పునరుద్ధరిస్తే రైతులకు ఎంతో సాయంగా ఉంటుంది.

**అరకొర నిధులతో జాప్యం**

గతంలో నాలుగు జిల్లాలకు కలిపి ఏడాదికి కనీసం రూ. 150 కోట్లకు పైగా విలువైన యంత్రాలు రాయితీపై ఇచ్చేవారు. ఈ ఏడాది కేవలం రూ. 9.53 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో 13,140 యూనిట్లను రాయితీపై ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 240 యూనిట్లకు రూ. 69.92 లక్షల రాయితీని మాత్రమే విడుదల చేశారు. ప్రభుత్వం రాయితీ నిధులు సకాలంలో ఇవ్వకపోవడం, మండల, జిల్లా కమిటీలు లబ్ధిదారులను సకాలంలో ఎంపిక చేయకపోవడంతో దరఖాస్తు చేసిన వేల మంది రైతులు నిరీక్షంచాల్సి వస్తోంది. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీ ఉంది. రూ. లక్షలోపు వాటికి మండల కమిటీ, అంతకు మించితే జిల్లా కమిటీ ఎంపిక చేయాలి. మరోవైపు రాయితీ పరికరాల ధర బయటి మార్కెట్తో పోలిస్తే చాలా ఎక్కువగా ఉన్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ నెలలో రాయితీ యంత్రాలను పంపిణీ చేస్తామని ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించిన నేపథ్యంలో యూనిట్ల ధర తగ్గించి సకాలంలో అందజేయాలని రైతులు కోరుతున్నారు.

# ఎత్తి పోస్తేనే నీరు



జగిత్యాల : నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం గాండ్లపేటవద్ద శ్రీరామసాగర్ ప్రాజెక్టు వరదకాలువకు గడిచిన వానాకాలంలో భారీ గండిపడింది. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు పలుమార్లు గండిపడిన ప్రదేశాన్ని పరిశీలించి నివేదించిన మేరకు ప్రభుత్వం గండి పూడ్చివేతకు రూ. 8.52 కోట్లను ఇటీవలే విడుదల చేసింది. ప్రస్తుతం టెండర్లు పిలిచి గుత్తేదారుకు పనులను అప్పగించి గండిని పూడ్చివేసి నీటిపారుదలను పునరుద్ధరించడానికి దాదాపు 3 నెలలు పట్టనుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**మూడు జిల్లాల పంటలపై..**

వరదకాలువకు అమర్చిన వేలాది పంపుసెట్లద్వారా జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల రైతులు వానాకాలంలో పెద్దఎత్తున పంటలను సాగుచేశారు. ప్రస్తుత యాసంగిలోనూ వరదకాలువ పరిసర గ్రామాల ప్రజలు కాలువనీటిని పంపుసెట్లద్వారా తోడి వరి, మక్క తదితర పంటలను విత్తుకున్నారు. పత్తి, మామిడి తదితర తోటలకూ కాలువ నీటిని వాడుతున్నారు. సాధారణంగా యాసంగిలో శ్రీరామసాగర్ ప్రాజెక్టునుంచి రెండుమూడుసార్లు వరద కాలువలోకి నీటిని వదిలి నిల్వచేస్తే రైతులు పంపుసెట్లద్వారా తమ పంటలకు పారించుకునేవారు. కాగా ప్రస్తుతం శ్రీరామసాగర్‌నుంచి ఈ యాసంగికి వరదకాలువలోకి నీటిని వదిలే అవకాశంలేదు.

**సాగుపై ప్రభావం**

గత వానాకాలంలో ఎస్సారెస్పీకి భారీగా వరదరాగా.. 51 టీఎంసీల నీటిని వరదకాలువ ద్వారా సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు, కరీంనగర్ వద్దగల దిగువమానేరు జలాశయాలకు తరలించారు. వరద కాలువ గరిష్ఠ సామర్థ్యం మేరకు 22 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తదుపరి మధ్యమానేరు నుంచి అనంతగిరి, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్ తదితర ప్రాజెక్టుల్లోకి ఎత్తిపోశారు. వరదకాలువకు అమర్చిన తూములద్వారా ఉమ్మడి జిల్లాలోని పలు గొలుసుకట్టు చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేశారు.

**నెల రోజులవరకు సరిపడా..**ప్రస్తుతం కాలువలో నిలువున్న నీరు దాదాపుగా నెల రోజులవరకు సరిపోతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అనంతరం పంటలకు నీరందదు. భూగర్భ జలమట్టం కూడా పడిపోయి పరిసర ప్రాంతాల్లో నీటిఎద్దడి తలెత్తుతుంది. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌కుగాను రెండు మూడు దఫాలుగా ఎల్లంపల్లి ప్రాజెక్టునుంచి నందిమేడారం, గాయత్రి పంపుహౌజులద్వారా నీటిని వరదకాలువలోకి ఎత్తిపోయాలి. తదుపరి రాంపూర్, రాజేశ్వర్‌రావుపేట పంపుహౌజులద్వారా ఎగువకు ఎత్తిపోసి నిలువ చేస్తేనే వరదకాలువ ప్రాంతంలో సాగులోని పంటలు పూర్తవుతాయి. ఇందుకుగాను ప్రభుత్వం అనుమతించేలా ప్రజాప్రతినిధులు తీసుకోవాల్సిఉంది.

# అత్యాశకు పోతే.. ఖాతా ఖాళీ

సూర్యాపేట: ఒకప్పుడు బ్యాంకు ఖాతా కేవైసీ చేయించుకోండి.. ఓటీపీ చెప్పాలంటూ ఖాతా ఖాళీ చేసిన సైబర్ నేరగాళ్లు కొత్త పన్నాగాలతో దూకుడు పెంచారు. పండగలొస్తే ఆన్‌లైన్ షాపింగ్ పేరుతో తక్కువ ధరలకే సరకులు అందిస్తామంటూ, ప్రభుత్వ సంక్షమ పథకాల పేరుతో నమ్మకం కలిగిస్తూ నూతన పంథను అనుసరిస్తూ ప్రజల డబ్బును కొల్లగొడుతున్నారు. పోలీస్‌శాఖ విడుదల చేసిన వార్షిక నివేదిక ప్రకారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో సైబర్ నేరాలు గణనీయంగా పెరిగాయి. 2024లో 545 కేసులు నమోదు కాగా 2025లో ఈ సంఖ్య 590కు చేరింది. 2026లోకి అడుగిడిన నేపథ్యంలో జనం తొందరపడకుండా అప్రమత్తంగా ఉంటూ సైబర్ నేరగాళ్ల మోసాలను తిప్పికొట్టాలని పోలీసులు, నిపుణులు సూచిస్తున్నారు.

**అవగాహన కల్పిస్తున్నా..**

సైబర్ నేరగాళ్లు ఏవిధంగా మోసానికి గురిచేస్తున్నారో వివరిస్తూ, అందుకు ప్రజలు ఎలా అప్రమత్తం కావాలో పోలీసులు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినా కేటుగాళ్లు బురిడీ కొట్టించడంతో రూ. లక్షలు పోగొట్టుకుంటున్నారు.

**ఆలస్యంతోనే అనర్థం**మోసానికి గురైన వారిలో చాలామంది పరువు పోతుందని ఆలస్యంగా ఫిర్యాదు చేస్తుండటంతో కేసుల్లో రికవరీ ఉ ండటం లేదని పోలీసులు చెబుతున్నారు. మోసపోయిన వారు నిమిషాల వ్యవధిలోనే 1930కు ఫిర్యాదు చేయాలి. పోలీసులు ఆ కేసును



ఛేదించడానికి కొంత వీలుగా ఉంటుంది. గడిచిన రెండేళ్లలో నమోదైన కేసుల్లో పోలీసులు రికవరీ చేసింది చాలా తక్కువే. సైబర్ నేరగాళ్లు కాజేసిన సొత్తును నిమిషాల్లో రికవరీకి అవకాశం లేకుండా మార్చేస్తున్నారని పోలీసులు చెబుతున్నారు.

**12 నెలల్లో రూ. 14.77 కోట్లు**

గతేడాది నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో 462 కేసుల్లో రూ. 14.77 కోట్లు కాజేశారు. దీన్ని సవాల్‌గా తీసుకున్న పోలీసులు రికవరీ ఆశించినంత చేయకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అందులో రికవరీ అయింది రూ. 2.55 కోట్లు మాత్రమే. అయితే యాదాద్రి జిల్లాలో సైబర్ కేసుల వివరాలను పోలీసులు ప్రకటించినప్పటికీ, చోరీ మొత్తం, రికవరీ వివరాలు మాత్రం వెల్లడించలేదు.

**అప్రమత్తంగా ఉండాలి**

లక్ష్మనారాయణ, సీఐ, సైబర్ సెల్, సూర్యాపేట

ఏపీకే ఫైల్స్‌ను ఓపెన్ చేయొద్దు. ఆన్‌లైన్‌లో తక్కువ ధరలకు వస్తువులు ఇస్తామంటూ వచ్చే సంక్షప్త సమాచారాలను, ఫోన్లకు స్పందించవద్దు. ఆన్‌లైన్ ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లు పెట్టుకోవాలి.

# పల్లెల్లో.. ఇక పాలపొంగులే..!

రాజపేట : మహిళా సాధికారత, ఆదాయం పెంపు, పాడి అభివృద్ధే లక్ష్యంగా ఇందిరా డెయిరీ ప్రాజెక్టును చేపట్టాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు రెండు గేదెలు, లేదంటే ఆవులు పంపిణీ చేయనున్నారు. ఈ పథకంతో అతివలకు జీవనోపాధి లభించడమే కాకుండా ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి అవకాశం ఏర్పడుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఒక్కో యూనిట్‌కు రూ. 2లక్షలు..**

ప్రతి మండలాన్ని మూడు జోన్లుగా విభజిస్తారు. పది గ్రామాలను యూనిట్‌గా ఏర్పాటు చేస్తారు. పథకంలో ఒక్కో యూనిట్ ధర రూ. 2లక్షలు. ఇందులో ప్రభుత్వం రూ. 1.40 లక్షలు రాయితీ ఇస్తుంది. మిగిలిన రూ. 60 వేలు బ్యాంకులు రుణంగా అందిస్తాయి. ఈ డబ్బుతో రెండు గేదెలు లేదంటే రెండు ఆవులు కొనిస్తారు. పశువులకు గడ్డి, దాణా సరఫరాను స్థానిక యువతకు అప్పగించి వారికి ఉపాధి కల్పించే యోచనలో ప్రభుత్వ వర్గాలున్నాయి. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు వెలువడలేదని, రాగానే మార్గదర్శకాల ప్రకారం పథకం అమలుకు కృషి చేస్తామని సంబంధిత అధికారులు అంటున్నారు.

**పెరగనున్న పశుసంతతి, పాల ఉత్పత్తి..**

గ్రామాల్లో పశువుల సంఖ్య బాగా తగ్గిందనే విషయమై ఇటీవల పశు సంవర్ధక శాఖ వెల్లడించిన గణాంకాల్లో తేలింది. 2018లో పశుగణన చేపట్టగా 69,173 తెల్లజాతి పశువులు, 1,22,620 నల్లజాతి పశువులున్నట్లుగా తెలిసింది. ప్రస్తుతం వాటి సంఖ్య 15 శాతంపైగా తగ్గిందని తెలుస్తోంది. గతంలో అత్యధికంగా పాల దిగుబడిని సాధించిన జిల్లా ప్రస్తుతం కొంతమేర తగ్గిందనే చెప్పవచ్చు. ప్రధానంగా వ్యవసాయ పనులు యంత్రాలతో చేయడం, గ్రామాల్లో ఖాళీ ప్రదేశాలు తగ్గి మేతకు కొరత ఏర్పడటంతో పశువుల సంతతి తగ్గడానికి కారణంగా చెప్పవచ్చు. పాల ఉత్పత్తి బాగా పడిపోయింది.

**జిల్లా సమాచారం..** గ్రామ పంచాయతీలు : 427 మండల మహిళా సమాఖ్యలు : 17 మొత్తం స్వయం సహాయక సంఘాలు : 14,986 సంఘాల్లోని సభ్యుల సంఖ్య : 1,91,811

# ఎప్పుడిస్తారో.. రూ.19 కోట్లు

సూర్యాపేట : అన్నదాతలకు అందుబాటులో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పిస్తోంది. జిల్లాలో వానాకాలం కొనుగోళ్లు పూర్తయ్యాయి. కానీ ఆరేళ్లుగా హమాలీ ఛార్జీలు విడుదల చేయక రైతులపైనే ఆ భారం పడుతోంది. ఈసారైనా అందిస్తారని ఆశిస్తున్నారు. కేంద్రాల్లో ధాన్యాన్ని హమాలీలు సంచుల్లో నింపి లారీల ద్వారా మిల్లులకు తరలిస్తారు. ఇందుకు క్వింటాకు రూ. 45 చొప్పున హమాలీలకు చెల్లించాల్సి ఉంటుంది. వారికి చెల్లించిన అనంతరం ధాన్యం విక్రయించిన నగదుతోపాటు రైతుల ఖాతాల్లో జమ కావాల్సి ఉంటుంది. కానీ ఆరేళ్లుగా హమాలీ ఖర్చు జమ చేయడం లేదు. జిల్లాలో 2025–26 వానాకాలం సీజన్‌లో 348 కేంద్రాల ద్వారా 3.27 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో పది విడతల్లో, ప్రస్తుత కాంగ్రెస్ సర్కారులో మూడు విడతల్లో కొనుగోళ్లు చేపట్టగా మొత్తం ఆరేళ్లుగా రైతులకు హమాలీ ఛార్జీలు చెల్లించలేదు. సన్నరకం ధాన్యానికి బోనస్ ప్రకటించడంతో 90 శాతం రైతులు ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయిస్తున్నారు.

హమాలీ ఛార్జీల రూపంలో జిల్లా వ్యాప్తంగా రెండు సీజన్లకు కలిపి రూ. 2.62 కోట్లు వరకు రైతులపై భారం పడింది. ఈ లెక్కన పన్నెండు విడతల్లో బకాయిలు రూ. 19.18 కోట్ల వరకు రావాల్సి ఉంది. బకాయిలు, హమాలీ ఛార్జీలు చెల్లింపులపై ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు లేవని పౌరసరఫరాల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

## అల్లరి మూకలపై కేసులు ‘పెట్టీ’..

హైదరాబాద్: మిత్రుడితో కలసి బైకుపై వెళ్తున్న ప్రబుద్ధుడు ట్రాఫిక్ కూడలిలో ఒక అమ్మాయితో అనుచితంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు బైక్ నంబరు ఆధారంగా అతడిని పట్టుకుని కోర్టులో హాజరుపరచగా 2 రోజుల జైలుశిక్ష పడింది. బైక్‌కు సైలెన్సర్ తొలగించి రాత్రి వేళల్లో చక్కర్లు కొట్టే ఓ యువకుడు తనిఖీల్లో పట్టుబడ్డాడు. కేసు నమోదు చేస్తే తేలికగా తీసుకున్నాడు. బడా నాయకుడి ఫోన్‌కాల్‌తో బయటపడొచ్చని ధీమాగా ఉన్నాడు. 5 రోజులు జైల్లో ఉండి వచ్చాక తప్పు తెలుసుకున్నాడు.

పెట్టీ కేసు.. ఓస్ ఇంతేగా! ఇలా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లటం.. క్షణాల్లో బయటకు రావటమేనని చాలామందిలో అభిప్రాయం ఉంది. కేసు చిన్నదే.. కానీ ప్రభావం చాలా పెద్దదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నగరంలో ఏటా లక్షకుపైగా పెట్టీ కేసులు నమోదవుతున్నాయి. అధికశాతం మందికి జైలుశిక్షలు, జరిమానాలు పడుతుంటాయి. బహిరంగ ప్రదేశాల్లో హల్‌చల్ చేస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిని సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని కోర్టు



ఆదేశించింది. సుమారు 200 మందికిపైగా చీపుర్లు చేతపట్టి ఉద్యానవనాలను శుభ్రం చేశారు. మరికొందరు మొక్కలు నాటడం, ట్రాఫిక్ కూడళ్లలో విధులు నిర్వర్తించడం లాంటివి చేశారు. మెహిదీపట్నం సమీపంలో ఒక యువకుడు రోడ్డుపై మద్యం తాగుతూ చుట్టుపక్కల వారికి ఇబ్బంది కలిగించాడు. పోలీసులు పెట్టీ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఫలితంగా అతని ఉద్యోగం ఊడింది.

**ఎక్కువగా ఎవరంటే...** బస్తీలో మద్యం మత్తులో వీరంగం చేసే మందుబాబులు, దారెంట వెళ్లేవారిని అటకాయించే పోకిరీలు, ట్రాఫిక్‌లో నిబంధనలు పట్టించుకోని ఉల్లంఘనులు, చిన్న విషయానికే గొడవపడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై ఎక్కువగా పెట్టీ కేసులు నమోదవుతున్నాయి. చాంద్రాయణగుట్ట పరిధిలో కత్తితో సంచరిస్తున్న వ్యక్తికి 15 రోజుల జైలుశిక్ష పడింది. మరికొందరు మద్యం తాగి రోడ్లపై న్యూసెన్స్ చేస్తుంటారు. ఇలాంటి వారిపై పోలీసులు ఈ–పెట్టీ కేసులు నమోదు చేసి వెంటనే కోర్టుల్లో చార్జిషీట్ దాఖలు చేస్తున్నారు. కొత్త ఏడాదిలో పెట్టీ కేసుల నమోదుపై దృష్టి సారించారు.

## వేటాడేదెవరు..? ఆటాడించేదెవరు?

కొత్తగూడెం : ఖమ్మం, భద్రాద్రి జిల్లాలోని కొన్ని మారుమూల ప్రాంతాల్లో విద్యుత్తు తీగలతో వన్యప్రాణులను వేటాడుతున్నా.. క్షత్రస్థాయి అటవీ సిబ్బంది కళ్లు మూసుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. శని, ఆదివారాలు వస్తే పట్టణాలకు సైతం వన్యప్రాణుల మాంసం విచ్చలవిడిగా సరఫరా అవుతున్నా.. అటవీ అధికారులకు సమాచారం అందితే కానీ నిందితులను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది. కంచె.. చేనును మేసిన చందంగా మారింది తల్లాడ ఫారెస్ట్ రేంజ్ పరిస్థితి. ఒకవైపు అరుదైన చిరుతపులి మృతిచెందితే దాని మరణానికి గల కారణాలను అన్వేషించాల్సిన అటవీశాఖ అధికారులు.. ఆధారాలను కాల్చి బూడిద చేయటం సర్వత్రా చర్చనీయాంశమైంది. అడవిలో ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించటం.. వన్యప్రాణుల పాలిట శాపంగా మారుతోందని



చెప్పటానికి ఈ ఘటనే నిదర్శనంగా నిలుస్తోంది.

**నిబంధనలకు విరుద్ధంగా..**

వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం చిరుతపులి మరణిస్తే అనుసరించాల్సిన నిబంధనలేవి అధికారులు పాటించకపోవటం అనేక అనుమానాలకు తావిస్తోంది. చిరుత చనిపోయిన సమాచారం అందిన వెంటనే పోస్టుమార్టం నిర్వహించకుండా, పంచనామా చేయకుండా గుట్టుచప్పుడు కాకుండా కళేబరాన్ని కాల్చేయటం అంటే.. నేరాన్ని కప్పిపుచ్చే కుట్రే. పైగా ఏడాది పాటు ఈ నిజాన్ని దాచిపెట్టడం వెనుక ఉన్న ‘అదృశ్య హస్తాలు’ ఎవరివనేది తెలియాలి. వేటగాళ్లతో అధికారులు కుమ్మక్కై ఈ పనికి పూనుకున్నారా..? లేదా చిరుత కళేబరం దొరికితే తమ ఉద్యోగాలకు ఏమైనా ఇబ్బందులు వస్తాయని దహనం చేశారా..? అనేది ఉన్నతాధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

**ఇకనైనా మేల్కొంటారా..?**

కల్లూరు ఘటనపై ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్ ఆదేశించిన విచారణ కేవలం కంటితుడుపు చర్యగా మిగలకూడదు. ఇప్పటికే కల్లూరు డిప్యూటీ రేంజ్ అధికారి, కల్లూరు, లక్ష్మీపురం బీట్ అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం వల్లే క్షత్రస్థాయి సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఉభయ జిల్లాల అటవీశాఖ అధికారులు ఇప్పటికైనా మేల్కొని వన్యమృగాల సంరక్షణకు చొరవ చూపాలని కోరుతున్నారు.

**అరుదైన మృగాలకు రక్షణేది?**

కనకగిరి అభయారణ్యంలో చిరుత పులులు సంచరిస్తున్నాయని ఓవైపు అటవీశాఖ అధికారులు చెబుతుండగా.. ఇలాంటి ఘటనలు జరగటం వన్యమృగాల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. అడ్డుకోవాల్సిన అధికారులే ఆధారాలను మాయం చేయాలని చూస్తే.. భవిష్యత్తులో వేటగాళ్లకు అడ్డులేకుండా పోతుందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. క్షత్రస్థాయిలో బీట్, సెక్షన్ అధికారులు ఏం చేస్తున్నారో పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉన్నతాధికారులదే. ఒక చిరుత మరణిస్తే ఏడాది దాకా జిల్లా అధికారులకు తెలియకపోవటం వారి వైఫల్యానికి అద్దం పడుతోంది.

## ‘అపరాధ రుసుం’తో సరిపెడతారా?



హైదరాబాద్: జీహెచ్ఎంసీలో విలీనమైన శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో అనుమతులు లేకుండా వందల్లో బహుళ అంతస్తుల భవనాలను నిర్మించారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 111 జీవో వర్తిస్తుందని తెలిసినా.. కొందరు అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలు, ఆసుపత్రులు, రెస్టారెంట్లు కట్టారు. నిబంధనల ప్రకారం వాటిని కూల్చేందుకు మున్సిపాలిటీకి అధికారం ఉన్నా, రాజకీయ ఒత్తిళ్లతో వదిలేశారు. ఇప్పటికైనా కఠిన చర్యలు తీసుకుంటారా? మున్సిపాలిటీలుగా ఉన్నప్పుడు వసూలు చేసిన రెట్టింపు అపరాధ రుసుంతో సరిపెడతారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**జీహెచ్ఎంసీలో కూల్చివేత..**

జీహెచ్ఎంసీ కోర్ సిటీలో నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించినా, సెట్ బ్యాక్‌లు లేకపోయినా.. తాఖీదులు ఇచ్చి వాటిని కూల్చేస్తున్నారు. శంషాబాద్, నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో అక్రమ భవనాలను పురపాలక శాఖ అధికారులు గతంలో కూల్చేశారు. తాజాగా ఏం చేస్తారనే విషయంలో ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వడం లేదు.

**అధికారుల ఉదాసీనత వల్లే..**

శంషాబాద్ మున్సిపాలిటీలో నిబంధనల ప్రకారం బహుళ అంతస్తుల భవనాలు నిర్మించకూడదు. కానీ ఖాళీగా ఉన్న ప్రైవేటు స్థలాలు, పాత నివాసాలను కూల్చి స్థిరాస్తి వ్యాపారులు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారు.

మున్సిపాలిటీ అధికారులు క్షత్రస్థాయికి వెళ్లడం లేదు. అనుమతి లేకుండా ఎలా నిర్మిస్తున్నారంటూ ప్రశ్నించడం లేదు. నిర్మాణాలు పూర్తయ్యాక.. కింది స్థాయి మున్సిపల్ సిబ్బందిలో కొందరికి మామూళ్లు ఇచ్చి ఇంటి నంబర్లు తీసుకుంటున్నారు. ఈ నంబర్ల సాయంతో విద్యుత్తు, నల్లా కనెక్షన్లు తెచ్చుకుంటున్నారు.

## మెట్రో స్వాధీనానికి నిధుల సమీకరణపై దృష్టి



హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోరైలు మొదటి దశ ప్రాజెక్ట్ ప్రభుత్వం స్వాధీనానికి అవసరమైన నిధుల సమీకరణపై దృష్టి పెట్టింది. యాజమాన్యం బదిలీ జరగాలంటే ఒప్పందం ప్రకారం రూ. 2వేల కోట్ల ఈక్విటీని ఎల్ అండ్‌టీకి చెల్లించడంతో పాటు రూ. 13వేల కోట్ల రుణాలను సర్కారుపైకి బదలాయించుకుంటామని తెలిపింది. ఈ నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేర్వేరు మార్గాలను అన్వేషిస్తోంది. రైల్వే ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు రుణాలను ఇచ్చే ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్‌ను(ఐఆర్ఎఫ్‌సీ)ని ప్రభుత్వం సంప్రదించినట్లు ఒక ఉన్నతాధికారి ‘న్యూస్‌టుడే’కు తెలిపారు. మెట్రోరైలు ప్రాజెక్టులకు సైతం ఐఆర్ఎఫ్‌సీ ఇటీవల కాలంలో నిధులను అందజేస్తోంది. సూరత్‌లోని మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ హబ్ కోసం, మెట్రోరైలు కోచ్‌ల కొనుగోలుకు రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలను ఇచ్చింది. ఎక్కడి నుంచి రుణాలు తీసుకోవాలన్నా.. ఎఫ్ఆర్‌బీఎం పరిమితి మేరకే అవకాశం ఉంటుందని ఆర్థిక రంగ నిపుణులు అంటున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో నిధుల సమీకరణ క్లిష్టమే అని చెబుతున్నారు. తొలుత స్వాధీన ప్రక్రియ పూర్తి చేసి.. ఆ తర్వాత భూములు, మాల్స్ విక్రయించి వాటికి చెల్లింపులు చేయాలనేది సర్కారు ఆలోచన. ఇందుకు సమయం పట్టే అవకాశం ఉంది కాబట్టి రుణ సమీకరణపై సర్కారు దృష్టి పెట్టింది. ముంబయిలో మెట్రోని సర్కారు స్వాధీనం చేసుకున్న మాదిరి ఈ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉందంటున్నారు.

**ఒప్పందాలు బదిలీ అయ్యేలా..**

ప్రస్తుతం మెట్రోరైలును నిర్వహిస్తున్న ఎల్ అండ్ టీ సంస్థ... రుణాలు, ఆపరేషన్స్, రవాణా ఆధారిత అభివృద్ధి(టీవోడీ)లో భాగంగా పలు థర్డ్‌పార్టీ సంస్థలతో ఒప్పందం చేసుకుంది. దీని ప్రకారం గత ఒప్పందాలన్నీ యథవిధిగా కొనసాగుతాయని అధికారులు అంటున్నారు. టీవోడీలో భాగంగా 12.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో మాల్స్ నిర్మించారు. వీటిలోని మల్టీప్లెక్స్‌లను, రిటైల్ స్పేస్‌ను పలు సంస్థలకు లీజుకు ఇచ్చారు. ఎల్ అండ్ టీకి ప్రభుత్వం 237 ఎకరాలను కేటాయించింది. ఇందులో రాయదుర్గంలోని 15 ఎకరాల స్థలాన్ని ఎల్ అండ్ టీ సంస్థ మానిటైజ్ చేసి రూ. 1100 కోట్ల వరకు సమకూర్చుకుంది. సర్కారు స్వాధీనం చేసుకున్న తర్వాత సమీక్ష నిర్వహించి తదుపరి కొనసాగింపు ఉంటుందని అంటున్నారు. స్వాధీనానికి సంబంధించి ఐడీబీఐ క్యాపిటల్, కొత్త సాంకేతికత కమిటీలు ఇచ్చిన నివేదిక ఆధారంగా నిర్ణయాలు ఉంటాయని చెబుతున్నారు.

## నిఘా కన్ను.. భద్రతకు దన్ను



హైదరాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో అత్యాధునిక భద్రతా ప్రమాణాలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తున్నాయి. ఏఐతో కూడిన సీసీ కెమెరాలను కీలక ప్రాంతాల్లో ఏర్పాటు చేసి విమానాశ్రయంలోని కమాండ్ కంట్రోల్‌రూంకు అనుసంధానించారు. శంషాబాద్ విమానాశ్రయం ప్రారంభంలో తొలి రోటరీ నుంచి నోవాటెల్‌కు సమీపంలోని చెక్‌పోస్ట్ వరకూ ఏఐ కెమెరాలను అమర్చారు. వీటితోపాటు బస్సులు, ఇతర వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, క్యాబ్ బుకింగ్ స్టేషన్ల వద్ద వీటిని ప్రత్యేక కోణాల్లో ఏర్పాటు చేశారు. కెమెరాలు మనుషుల కదలికలను (మోషన్ క్యాప్చర్) భిన్నమైన కోణాల్లో చిత్రీకరించనున్నాయి. వాటి ఆధారంగా పోలీసులు, సీఐఎస్ఎఫ్ దళాలు వేగంగా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయి.

క్యాబ్‌ల మోసాలపై.. విమానాశ్రయానికి చేరుకుంటున్న ప్రయాణికులు.. ఇళ్లకు, గమ్యస్థానాలను చేరుకునేందుకు ఓలా, ఉబర్ క్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు. రద్దీ వేళల్లో క్యాబ్‌లు లభించడం లేదు. కొందరు బుకింగ్ రద్దు చేసుకోవాలని, క్యాబ్‌కు ఎంత ఇస్తారో అంతే ఇవ్వాలని అడుగుతున్నారు. కొందరు తమకు ఫోన్‌పే లేదా గూగుల్‌పే చేస్తే 2 నిమిషాల్లో క్యాబ్‌లను తీసుకువస్తామంటూ డబ్బు తీసుకుని వెళ్లిపోతున్నారు. వీటిపై పోలీసులకు ఫిర్యాదులు చాలా వస్తున్నాయి. ఈ నిఘా కెమెరాల ద్వారా ప్రయాణికులను మోసం చేసిన వారిని గుర్తిస్తున్నారు. అరెస్ట్ చేస్తున్నారు.

**నిరంతరం..** విమానాశ్రయ రహదారుల మధ్యలో ఎవరైనా వాహనాలను నిలిపితే వెంటనే కమాండ్ కంట్రోల్‌రూంకు సమాచారం చేరవేస్తాయి. ఒక వ్యక్తి ఐదారు నిమిషాలకంటే ఎక్కువగా ఉన్నా.. ప్రయాణికులు లగేజీ మర్చిపోయినా అధికారులను అప్రమత్తం చేస్తుంది. నిఘా కెమెరాలకు సమీపంలో బ్యాగులు, సంచులను ఉంచితే స్కాన్ చేస్తుంది. బ్యాగ్‌లు, సంచులు, ఉద్దేశపూర్వకంగా వదిలేసినట్టు గమనిస్తే బాంబ్ స్క్వాడ్‌లకు సమాచారం అందిస్తాయి. కౌంటర్లలో రద్దీ పెరిగితే చర్యలు తీసుకునేలా ఉపకరిస్తాయి.

## నిధులు బుగ్గిపాలు!

సత్తుపల్లి : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో భారీ ఆశయాలతో నిర్మించిన మెగా ఫుడ్‌పార్కు నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తెస్తుందన్న ఉద్దేశంతో రూ. కోట్ల ప్రజాధనం వెచ్చించినా ఆశించిన స్థాయికి చేరుకోలేకపోతోంది. పాలకులు, అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

**పరిశ్రమలు రాలేదు.. నిర్మాణాలు శిథిలం**

ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేలా 2008లో నాటి సమైక్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖర్‌రెడ్డి దీనికి శంకుస్థాపన చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2017లో నిర్మాణ పనులను కేటీఆర్ ప్రారంభించారు. ఆ తర్వాత ఐదేళ్లకు పనులు పూర్తయ్యాయి. ఎట్టకేలకు శీతల గిడ్డంగులు, వేర్‌హౌస్‌లు, గోదాములు, ప్యాకింగ్ హౌస్, ఓవర్‌హెడ్ ట్యాంకు, సబ్‌స్టేషన్, అగ్నిమాపక కేంద్ర భవనం మొదలైన వాటితోపాటు.. రోడ్లు, అంతర్గత రహదారులు, తాగునీటి సదుపాయం వంటివి కల్పించారు. ఇటీవలి కాలంలో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు దీనిని ప్రారంభించినా పరిశ్రమలు పెద్దఎత్తున వచ్చిన దాఖలాలు లేవు. ఫుడ్‌పార్కుకు ఆదరణ కరవైంది.

**కొరవడిన పర్యవేక్షణ...**

ఫుడ్‌పార్కు నిర్వహణపై ఇక్కడి టీజీఐఐసీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీని స్థితిగతులపై సమీక్షలు, పునరుద్ధరణ చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు తావిస్తోంది. దీనిపై ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీజీఐఐసీ ఎండీ శశాంక్ ఆదేశాలతో చీఫ్ ఇంజినీర్ నరేంద్రరెడ్డి బృందం శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేసింది. నివేదికను ఉన్నతాధికారులకు పంపించింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు బుగ్గపాడు మెగా ఫుడ్ పార్కుపై



ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్థానికులు కోరుతున్నారు. నాసిరకం నిర్మాణాలకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రధానంగా అడ్మినిస్ట్రేషన్ భవనం పై అంతస్తు గదుల్లో సీలింగ్‌లు నాసిరకంతో ఊడి పడిపోయాయి. ఫ్యాన్లు, కరెంట్ వైరింగ్ పూర్తిగా దెబ్బతింది. దాదాపు 200ఎకరాల్లో రూ. 100కోట్లకు పైగా నిధులతో చేసిన అభివృద్ధి పనులు బుగ్గిపాలు చందంగా మారాయి. రూ. లక్షలతో కొనుగోలు చేసిన భారీ యంత్ర పరికరాలు తుప్పుపట్టిపోతున్నాయి. రోడ్లనూ నాసిరకంగా నిర్మించటంతో దెబ్బతింటున్నాయి.

**గుత్తేదారులకే లాభం...**

గుత్తేదారుల కోసమే మెగా ఫుడ్ పార్కును నిర్మించారా? అనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. నిర్మాణాల పేరిట రూ. కోట్లు వెచ్చించినా ఫలితం శూన్యంగా మిగిలిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల నాణ్యతపై ఆరోపణలు వచ్చినా అధికారులు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు.

## కాలు దువ్వుతున్నాయ్..

దమ్మపేట : సంక్రాంతి అంటే రంగవల్లులు, గొబ్బెమ్మలు, గంగిరెద్దుల ఆటలు, పిండి వంటల ఘుమఘుమలు.. కానీ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కొన్ని ప్రాంతాలు, ఆంధ్రా సరిహద్దు గ్రామాలు పూర్తిగా భిన్నం. ఆయా ప్రాంతాల్లో నెల రోజుల ముందు నుంచే కోడిపందేలు, జూదం జోరుగా సాగుతుంటాయి.

**రూ. లక్షల్లో ఆదాయం...** దమ్మపేట, అశ్వారావుపేట, సత్తుపల్లి, మండలాల్లో కొంతమంది కోడిపందేలు, జూదం నిర్వహణే వృత్తిగా రూ. లక్షల్లో సంపాదిస్తున్నారు. పుంజులను పెంచటం, నెలవారీ పందేల నిర్వహణ వీరికి పరిపాటి. కొన్ని గ్రామాల్లో చిన్న వేడుక జరిగినా, సందర్భం ఏదైనా పందేలు ఆడిస్తుంటారు. స్థావరాలపై ఏటా పోలీసు దాడులు జరుగుతున్నా.. వీటిని అరికట్టలేకపోతున్నారు.

**ఇక్కడ వద్దంటే పక్క రాష్ట్రానికి..**

తెలంగాణలో ఎలా ఉన్నా ఏపీలో పండుగ మూడు రోజులు కోడిపందేలు నిరాటంకంగా సాగుతున్నాయి. కోర్టులు వద్దని చెప్పినా, పోలీసులు దాడులు చేస్తామన్నా ఆగుతున్న జాడ కనిపించడం లేదు. తెలంగాణలో వద్దంటే జిల్లా దాటగానే కనీసం 100 మీటర్ల లోపే ఏపీలో పందేలు వేస్తుంటారు.

**జరిగే ప్రాంతాలు ఇవే..**

అశ్వారావుపేట, తిరుమలకుంట, వినాయకపురం, జమ్మిగూడెం, నారంవారిగూడెం.. దమ్మపేట మండలంలోని నాగుపల్లి, పట్వారీగూడెం, పెద్దగొల్లగూడెం, వడ్లగూడెం.. సత్తుపల్లి మండలం మేడిశెట్టివారి పాలెం.. పెనుబల్లి సరిహద్దులోని తిరువూరు.. చంద్రుగొండ, ములకలపల్లి



మండల్లాలోని గిరిజన గ్రామాలు.. భద్రాచలం ప్రాంతంలోని కుంట, చట్టి, మాదారం.. ఖమ్మం జిల్లాలోని ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో కోడిపందేలు జోరుగా సాగుతాయి. దమ్మపేటకు కూత వేటు దూరంలోని ఏపీ పరిధి సీతానగరం, రాఘవాపురం, పట్టాయి గూడెం, చింతంపల్లి, టి. నర్సాపురం మండలాల్లో, అశ్వారావుపేట మండల సరిహద్దులోని వేలేరుపాడు, కుక్కునూరు, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం మండలాల్లో పందేలు జోరుగా నిర్వహిస్తున్నారు.

**ఎన్నో రకాలు** కత్తులు కట్టి, కత్తులు లేకుండా నిర్వహిస్తున్నారు. ముసుగు పందెం, కత్తిపందెం, జోడి, విడికాళ్ల పందెం, చూపుడు పందెం ఇలా పలు విధాలుగా కోళ్లను రంగంలోకి దింపుతారు. పందెం రకాన్ని బట్టి డబ్బులు కాస్తారు. రూ. వెయ్యి నుండి రూ. లక్షల్లో జూదం సాగుతుంది. బరిలో కాసేవారు కొందరైతే, బయట ఉండి పై పందేలు కాసేవారు అధికంగా ఉంటారు. బలవర్ధక ఆహారం, శిక్షణ ఇచ్చిన కోళ్లు ఒక్కోటి రూ. 10 వేల నుంచి రూ. లక్ష వరకు పలుకుతున్నాయి. పేకాట(కోసు)లో ఇల్లు గుల్ల చేసుకొన్నవారు ఎందరో.

నిర్వాహకులపై కఠిన చర్యలు నాగరాజు సీఐ, అశ్వారావుపేటకోడి పందేలు, జూదం నిర్వాహకులపై ప్రత్యేక దృష్టి సారించాం. ఎక్కడైనా ఆడితే దాడులు చేస్తున్నాం. నిర్వాహకులు ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదు. ఈ దఫా ఆంధ్రా సరిహద్దు గ్రామాల వద్ద గట్టి నిఘా పెట్టాం.

చురకలు
గురువారం 8 జనవరి 2026

## 'అంటు'కుంది.. ఉపాధి!

కూసుమంచి : కూసుమంచి మండలం లోక్యాతండాకు చెందిన పలువురు యువకులు గతంలో ఉపాధి కోసం వలస వెళ్లేవారు. రాజమహేంద్రవరం,కడియంలో మామిడి మొక్కలను అంటుకట్టే కూలీ పనులు చేసేవారు. స్వగ్రామంలో మామిడి అంటు మొక్కల నర్సరీలు ఏర్పాటుచేస్తే లాభసాటిగా ఉంటుందతో పాటు పదులాది మందికి ఉ పాధి కల్పించవచ్చునని భావించారు. సుమారు 15ఏళ్ల క్రితం పది మంది యువకులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో మొక్కల పెంపకాన్ని ప్రారంభించారు. వీరిని చూసి ఇంకొందరు ముందుకొచ్చారు. ఇప్పుడు లోక్యాతండాలో సుమారు 60 నర్సరీలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచి నాణ్యమైన అంటు మొక్కలు ఎగుమతి అవుతున్నాయి.

**ఏప్రిల్ నుంచి పనులు**

నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ తదితర జిల్లాల్లో మామిడి టెంకలను ఏప్రిల్‌లో సేకరిస్తారు. ఆయా జిల్లాల్లో ఆంచార్ కోసం మామిడి వినియోగం ఎక్కువ. అందుకే అక్కడ టెంకలు విరివిగా లభిస్తాయి. లక్ష మొక్కలు పెంచాలనుకునే నర్సరీ నిర్వాహకులు రెండు లక్షల టెంకలు సేకరిస్తారు. నర్సరీలకు చేరిన నాణ్యమైన మట్టిని ప్లాస్టిక్ సంచుల్లో నింపుతారు. ప్రతి పాకెట్‌కు 70 పైసల చొప్పున కూలీలకు



చెల్లిస్తారు. లక్ష మొక్కల నర్సరీ ద్వారా కూలీలకు రూ.70వేలు సమకూరుతాయి. పాకెట్లు నింపుతున్న కూలీలకు ఎరువు కలిపిన మట్టిని చేరవేసేందుకు పురుషులను నియమిస్తారు. ఒక్కొక్కరికి రూ.800 చొప్పున రూ.20వేలు వెచ్చిస్తారు.

అంటుకట్టేందుకు (గ్రాఫ్టింగ్) నిపుణులకు ప్రతి మొక్కకు రూ.2 చొప్పున నిర్వాహకులు చెల్లిస్తారు. ఈలెక్కన రూ.2లక్షలు ఖర్చవుతాయి. కలుపు తీసేందుకు పది మంది చొప్పున కనీసం పది రోజుల పాటు కూలీలు అవసరం. వీరికి రూ.50వేలు చెల్లిస్తారు.

టెంకల శుద్ధి, మట్టి నింపిన సంచుల్లో టెంకలు నాటేందుకు 50 పైసల చొప్పున ఖర్చవుతుంది. తద్వారా రూ.50వేలు కూలీలకు చేరుతాయి. నాణ్యమైన మొక్కలు ఎంపిక (గ్రేడింగ్) చేసి అంటుకడతారు. డిసెంబర్ చివరి నాటికి అంటు మొక్కలను లారీల్లో ఎగుమతి చేస్తారు. 60 పైసల చొప్పున లక్ష మొక్కల ఎగుమతికి రూ.60వేలు చెల్లిస్తారు. టెంకల సేకరణ నుంచి మొక్కల ఎగుమతి వరకు లక్ష మొక్కల నర్సరీకి సుమారు రూ.16–18లక్షలు పెట్టుబడి పెడతారు.

ఖర్చులు పోను తొమ్మిది నెలలకు సుమారు రూ.6లక్షలకు పైగా ఆదాయం సమపార్జిస్తారు. ఈసారి అధిక వర్షాలతో ఆదాయం రూ.4లక్షల వరకు పరిమితమవుతోందని సమాచారం. ప్రతి సీజన్‌లో సుమారు 2వేల మందికి లోక్యాతండాలో ఉపాధి లభిస్తుండటం గమనార్హం. సుమారు లక్ష మొక్కలు పెంచే నిర్వాహకులు రూ.5.50 లక్షల వరకు కూలీలకు చెల్లిస్తున్నారు. లోక్యాతండా, సమీప గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది కూలీలు వస్తుంటారు.

వడ్డియా ధర్మా, నర్సరీ నిర్వాహకుడు

## టెండర్లకు అనూహ్య స్పందన

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వ రంగసంస్థ ఖమ్మం విజయడెయిరీ నూతన దుకాణాల సముదాయానికి అనూహ్య స్పందన లభించింది. మొత్తం పది దుకాణాలకు సంబంధించి టెండరు ప్రక్రియ మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పూర్తి చేశారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ సభ్యులు, టెండరు దరఖాస్తుదారులు పాల్గొన్నారు. మొత్తం పది దుకాణాలకు గాను 39 దరఖాస్తులు విక్రయించగా.. 33 మంది పాల్గొన్నారు. ఆరుగురు పాల్గొనలేదు. గత అక్టోబరు 30న అధికారులు టెండరు ప్రకటన విడుదల చేశారు. టెండరు ప్రారంభ ధర రూ.1,000గా నిర్ణయించారు. ఈనెల 25 టెండరు గడువు పూర్తి కాగా ఒక రోజు ముందు వరకు కేవలం 8 మంది దాఖలు చేయగా.. చివరి రోజు 25 మంది పాల్గొన్నారు.

**ఊహించని రీతిలో..**

ఒక్కో దుకాణానికి నెలకు రూ.15వేల అద్దెతో పాటు ఈఎండీ రూ.20వేలు, సెక్యూరిటీ డిపాజిట్లు రూ.2లక్షల చొప్పున నిర్ణయించారు. అధికారులే ఆశ్చర్యపోయే విధంగా ఊహించని రీతిలో ఒక్కో దుకాణానికి గరిష్ఠంగా రూ.29,100, కనిష్ఠంగా రూ.17,800 చొప్పున దరఖాస్తుదారులు కోట్ చేయటం విశేషం. ఒకటో నంబరు దుకాణానికి అత్యధిక అద్దె కోట్ చేశారు. ప్రధాన రోడ్డు పక్కనే ఉ



ండటంతో ఇక్కడ ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని టెండరుదారులు పోటీపడి మొత్తం పది దుకాణాలకు కూడా నిర్ణయించిన దానికంటే ఎక్కువ అద్దెను కోట్ చేశారు. ఈ లెక్కన ఏడాదికి దుకాణాల సముదాయం ద్వారా రూ.2లక్షల వరకు డెయిరీకి ఆదాయం సమకూరనుంది. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20లక్షల వరకు సంస్థలో నిల్వ ఉంటోంది.

**మంత్రి తుమ్మల ఆదేశాలతో..**

వాస్తవానికి దుకాణాలు నిర్మించి మూడు సంవత్సరాలు గడిచింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఖాళీగా ఉంటున్నాయి. ఇటీవల వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు డెయిరీని సందర్శించిన సమయంలో దుకాణాలు ప్రారంభించని విషయం ఆయన దృష్టికి వచ్చింది. వెంటనే సంబంధిత అధికారులను పిలిపించి టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించడంతో పూర్తి చేశారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేశాం. పది దుకాణాల ద్వారా ప్రతి నెలా డెయిరీకి ఆదాయం వస్తుంది. జిల్లాలో పాల సేకరణ, పాల అమ్మకాలను పెంచటంతో పాటు రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు కృషి చేస్తాం.

కె.రవికుమార్, డెయిరీ ఉపసంచాలకుడు, ఉమ్మడి ఖమ్మం జిల్లా

# ఇసుక రవాణా.. రక్షణ చర్యలు సున్నా




సుల్తానాబాద్ : మానేరు వాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల యజమానులు ఎలాంటి జాగ్రత్తలు పాటించడం లేదు. వాగులో ఇసుక లోడింగ్ చేసిన తర్వాత ట్రాక్టర్‌పై పరదాలు కప్పాలనే నిబంధన ఉంది. దీని ద్వారా ఇసుక రవాణా చేసే క్రమంలో ట్రాక్టర్ వెనుక వస్తున్న ద్విచక్రవాహనదారుడి కళ్లకు ఎలాంటి హాని కలగదని అధికారులు భావించి గతంలో గట్టి నిబంధన విధించారు. కానీ ట్రాక్టర్ల యజమానులు అలాంటి రక్షణ చర్యలేవీ పాటించడం లేదు.

ఇసుక తరలింపులో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఇసుకపై పరదాలు కప్పడం లేదు. దీనికితోడు వాగులోంచి నీటితో కూడిన ఇసుకను లోడింగ్ చేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పొడి ఇసుకను తరలించే క్రమంలో పరదాలు కప్పకపోవడంతో ట్రాక్టర్ వెనుక వస్తున్న వాహనదారుల కళ్లలో ఇసుక పడుతోందని పేర్కొంటున్నారు. తడి ఇసుకను తరలించే సమయంలో అందులోంచి నీరు కారుతుండగా ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.

**అంతటా ఇదే నిర్లక్ష్యం..**

సుల్తానాబాద్ మండలం నీరుకుళ్ల, గట్టెపల్లి, కదాంబాపూర్, గర్రెపల్లి, గొల్లపల్లి, మంచరామి, తొగర్రాయి మానేరు పరీవాహక ప్రాంతాల నుంచి నిత్యం వందలాది ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తుంటారు. ప్రస్తుతం ఉచిత ఇసుక రవాణా పాలసీ అమలవుతున్న నేపథ్యంలో సంబంధిత అధికారులు ఇసుక రవాణాపై పెద్దగా దృష్టిసారించడం లేదు. దీన్ని అదునుగా భావించిన ట్రాక్టర్ల యాజమాన్యం ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇసుక తరలింపులో ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక తరలించే క్రమంలో ట్రాక్టర్ల అధిక వేగంతోనూ భయాందోళనకు గురవుతున్నామని పేర్కొంటున్నారు.

వాగుకు సమీపంలోని గ్రామాల్లో ఒక్కసారిగా ట్రాక్టర్లు రోడ్డుపైకిరాగా ఇసుకలోని నీరంతా గ్రామ రహదారులపై వరదగా పారుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.అధిక ధరలనూ నియంత్రించాల్సిందే..

వినియోగదారులకు ఇసుక అందించాలనే సంకల్పంతో ఏడాదిన్నర కిందట ఉచిత ఇసుక అమల్లోకి తెచ్చారు. మానేరు నుంచి సుల్తానాబాద్‌కు రూ.వెయ్యిలోపే ఇసుక అమ్ముకోవాల్సి ఉండగా రూ.1,500 నుంచి రూ.1,800 వరకు అమ్ముతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. పెద్దపల్లికి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు విక్రయిస్తున్నారు.

# ముక్క లేనిదే.. ముద్ద దిగట్లే!



సిరిసిల్ల : స్థానిక సంస్థల ఎన్నికలు చికెన్, మటన్ విక్రయాలపై ప్రభావం చూపాయి. ధరలతోపాటు మాంసం విక్రయాలు విపరీతంగా పెరిగాయి. ప్రాంతాన్ని బట్టి వ్యాపారులు సైతం ధరలను పెంచేశారు. చిన్న చిన్న గ్రామాల్లో సాయంత్రానికే దుకాణాలు కట్టేస్తుండటం ప్రలోభాలకు అద్దం పడుతోంది.

**ఖర్చుకు తగ్గేదేలే!**

జిల్లాలో ప్రస్తుతం రెండు విడతల్లో ఎన్నికలు పూర్తికాగా మలి దశ మిగిలి ఉంది. గ్రామాల్లో సర్పంచి, వార్డు సభ్యుల స్థానాలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎక్కడా ఖర్చుకు వెనకాడటంలేదు. ఎక్కడా పది మంది కనిపించినా విందు ఇస్తానని హామీ ఇస్తున్నారు. కోడి కూరతో భోజనం, ఆల్కహాల్ సర్దుతున్నారు. ఫలితంగా చికెన్‌కు డిమాండ్ పెరగడంతోపాటు ధరలు సైతం అదే స్థాయిలో పెరిగాయి. సుమారు రోజు 50 టన్నులకు పైగా విక్రయాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

**కిలో రూ.320**

ముఖ్యంగా చికెన్ విక్రయదారులు అభ్యర్థుల అవసరాలను పసిగట్టి గతంలో కంటే ఎక్కువగా కోళ్లను దిగుమతి చేసుకుంటున్నారు. తీరిక లేకుండా మాంసం విక్రయిస్తూ సాయంత్రం వరకు అన్నింటిని విక్రయించి కొట్టు కట్టేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చికెన్ రూ.320 వరకు ధర పలుకుతోంది. గిరాకీతో అలసిపోతున్నామని వ్యాపారులు బహిరంగంగానే చెబుతున్నారు. చికెన్ వండి ఇచ్చేవారికి సైతం ఎన్నికలతో ఆదాయం సమకూరుతుంది.

# అక్రమ బొగ్గు.. నిగ్గు తేల్చాల్సిందే

భైంసా : ఇక్కడి ఇటుక బట్టీలకు మహారాష్ట్రలోని వణి, చంద్రపూర్, బల్లార్ష, ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్పూర్ ప్రాంతాల నుంచి భారీగా బొగ్గు సరఫరా అవుతోంది. జీరో బిల్లులతో వస్తున్న బొగ్గుతో ప్రభుత్వానికి రూ.కోట్లాది జీఎస్టీ నష్టం వాటిల్లుతోంది. అక్రమ బొగ్గు వ్యాపార వ్యవస్థ రోజు రోజుకూ విస్తరిస్తోంది.

జిల్లాలో 70కిపైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. వీటిలో ఏడాదికి 12 కోట్లకుపైనే ఇటుకలు తయారీ చేసి కాలుస్తున్నారు. వీటిని కాల్చేందుకు 15వేల నుంచి 20వేల టన్నుల బొగ్గు అవసరం అవుతుంది. సింగరేణి బొగ్గు టన్ను నాణ్యతను బట్టి రూ.7,000 నుంచి రూ.8,000 కాగా మహారాష్ట్ర నుంచి జీరోలో వచ్చే టన్ను బొగ్గు సగటు ధర రూ.6,500 వరకు లభిస్తున్నట్లు సమాచారం. టన్నుకు రూ.1,500 ఆదా కావడంతో ఇటుక బట్టీల నిర్వాహకులు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ బొగ్గు కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన జిల్లాకు ఇతర ప్రాంతం నుంచి సరఫరా అవుతున్న 20 వేల టన్నుల బొగ్గుకు రూ.150 కోట్లు అవుతోంది. దీనిపై రావాల్సిన కనీసం 1 శాతం జీఎస్టీ రూ.1.5 కోట్లు ప్రభుత్వ ఖజానాకు చేరడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఖజానాకు గండి**

బొగ్గుపై ప్రభుత్వానికి 18 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది. జీరో బిల్లులతో రవాణా చేయడంతో ఖజానాకు గండి పడుతోంది. కొన్ని సార్లు జీఎస్టీ బిల్లులతో బొగ్గు సరఫరా చేయగా లారీలు ఖాళీ చేసిన వెంటనే జీఎస్టీ బిల్లును రద్దు చేస్తున్నట్లు సమాచారం. కొందరు జీఎస్టీ బిల్లు లేకుండానే లారీ ట్రాన్స్‌పోర్టు బిల్లు మాత్రమే ఇచ్చి పన్ను ఎగవేస్తున్నట్లు తెలుస్తోంది.

ఇటుక వ్యాపారులు సైతం ప్రభుత్వానికి పన్ను చెల్లించడం లేదు. రూ.50 లక్షల వరకు లావాదేవీలు జరిపితే ఒక శాతం, ఆపై మించితే 12 శాతం జీఎస్టీ చెల్లించాల్సి ఉంటుంది.

# ఐదేళ్లలో 9 లక్షలు.. పౌరసత్వం వదులుకున్న భారతీయులు

14 ఏళ్లలో 20 లక్షలు.. ఇదీ భారత పౌరసత్వం వదులుకున్న వారి సంఖ్య. వీరిలో గత ఐదేళ్లలోనే 9 లక్షల మంది ఉన్నారు. అంటే, 2011 నుంచి 2020 వరకు 9 సంవత్సరాలలో 11 లక్షల మంది భారతీయులు తమకు ఈ దేశ పౌరసత్వం వద్దు అని అంటే... గత ఐదేళ్లలోనే అందులో 80 శాతం మంది పౌరసత్వం త్యజించారు. ఈ గణాంకాలను తాజాగా విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ పార్లమెంటుకు వెల్లడించారు. దేశ పౌరసత్వం విషయంలో పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. భారత పౌరసత్వం వదులుకుంటున్న వారి రికార్డులను ఏటా భద్రపరుస్తున్నట్లు చెప్పారు. ఈ లెక్కన 2011–19 మధ్య 11.89 లక్షల మంది పైగా పౌరసత్వం వద్దని చెప్పినట్లు పేర్కొన్నారు.

**విదేశీ పౌరసత్వం ఎంచుకుని..** పద్నాలుగేళ్లలో 20 లక్షలమంది పౌరసత్వం త్యజించారంటే.. వీరంతా విదేశీ పౌరసత్వాన్ని ఎంచుకున్నట్లే. ఇక 5 ఏళ్లలో 9 లక్షల మంది భారత పౌరసత్వ కాదని విదేశీ పౌరసత్వం ఎంచుకున్నట్లు స్పష్టమవుతోంది. వీరంతా ఏ దేశంలో స్థిరపడింది? అనేది వివరాలు తెలియాల్సి ఉంది. మరోవైపు ప్రపంచవ్యాప్తంగా 3.5 కోట్ల మంది భారతీయులు వివిధ దేశాల్లో ఉన్నారు.

**అత్యధికం పశ్చిమాసియాలోనే...** భారతీయులు సహజంగా ఎంచుకునేది అమెరికానే. ఈ లెక్కనే ఆ దేశంలోనే మనవారు అధికంగా ఉంటారని భావిస్తే అది సరికాదు. భారతీయులు ఎక్కువగా పశ్చిమాసియాలో కావడం గమనార్హం. అదికూడా యూఏఈ, సౌదీ అరేబియాల్లోనే అత్యధికంగా ఉన్నారు. ఆ తర్వాత స్థానాల్లో అమెరికా, కెనడాలో స్థిరపడ్డారు. ఆగ్నేయాసియా దేశాలు మలేసియా, సింగపూర్, యూకే దేశాలు భారతీయులకు గమ్యస్థానంగా ఉన్నాయి. గల్ఫ్ దేశాల్లో ఉద్యోగాలు చేయాలనే భారత యువత ఆశలను ఆసరాగా చేసుకుని నకిలీ ఆఫర్లతో మోసాలు చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం పేర్కొంటోంది. చాలావరకు సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను చూసి మోసపోయినవారేనని కేంద్ర మంత్రి కీర్తివర్ధన్ తెలిపారు.

**ఆర్థికంగా స్థిరపడాలని...** విదేశాల్లో స్థిరపడాలని భావిస్తున్న భారతీయులు తమ పౌరసత్వాలను వదులుకుంటున్న వైనం గత కొన్నేళ్లుగా పెరుగుతున్నట్లు స్పష్టం అవుతోంది. ఆర్థిక అవకాశాలు, విద్యా సౌకర్యాలు, మెరుగైన జీవనం కోరుకుంటున్నవారు విదేశాలకు వెళ్లిపోయి అక్కడే స్థిరపడుతున్నట్లు స్పష్టం అవుతోంది.

# అక్రమ నిర్మాణాలు.. అడ్డగోలు వ్యాపారాలు

రాంనగర్ : పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వం నుంచి కోట్లాది రూపాయల విలువ చేసే స్థలాలను లీజుకు తీసుకున్న బడాబాబులు..అందులో అక్రమంగా షెడ్‌లను వేసి అద్దెకు ఇచ్చి రూ.లక్షలు సంపాదిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. లీజు నిబంధనలు తుంగలో తొక్కుతూ కాలుష్య నియంత్రణ చర్యలు పాటించకుండా, జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్, ఆస్తి పన్ను, నిర్మాణ అనుమతులు, ఫైర్, ఫుడ్ లైసెన్స్ వంటి అనుమతులు లేకుండానే చాలా వ్యాపారాలు కొనసాగుతున్నాయి.

**అనుమతులు లేకుండానే...** ఆజామాబాద్ పరిశ్రమల వాడలోని రూ. కోట్ల విలువైన ప్రభుత్వ భూములు అక్రమ నిర్మాణాలు, అడ్డగోలు వ్యాపార కార్యకలాపాలకు నెలవుగా మారుతున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన పరిశ్రమలు కాలక్రమేణా మూతపడగా వాటి స్థానంలో అనుమతి లేని పరిశ్రమలు పుట్టుకొస్తున్నాయి. పరిశ్రమలకు బదులు, లీజు, సబ్ లీజుల పేరిట కొత్త సంస్థలు వెలుస్తున్నాయి. పరిశ్రమల శాఖ, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ నిబంధనలకు విరుద్ధంగా అనుమతి లేని వ్యాపారాలు, భవనాలు, గోదాములు, షెడ్‌ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. పరిశ్రమల శాఖ అధికారులు నోటీసులతో సరిపెడుతు ంటే, టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశ్రమల శాఖ వారు తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామంటూ కాలయాపన చేస్తున్నారు.

**నోటీసులు ఇస్తున్నాం పవన్‌కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం**

నిజాం కాలంలో 99 ఏళ్లకు లీజు ఇచ్చిన స్థలాలకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. సర్కారుధర ప్రకారం క్రమబద్ధీక రిస్తామనడంతోకొంతమంది ముందుకొచ్చారు. అగ్రిమెంట్ ప్రకారం పరిశ్రమలు నడిపించకుండా లీజుకు, గోదాములకు ఇచ్చిన వారికి నోటీసులిస్తున్నాం. వారంతా ప్రభుత్వధరకంటే రెండింతలు కట్టి రిజిస్ట్రేషన్స్ చేసుకోవాలి.

## విత్తన పంట.. కన్నీరే రైతు ఇంట!

మెదక్ :విత్తనోత్పత్తి పంటలు సాగుచేసిన రైతులు ఆర్థికంగా నష్టపోయిన ఘటనలు ఇటీవల ఉమ్మడి జిల్లాలో చాలా ప్రాంతాల్లో చోటు చేసుకున్నాయి. యాసంగి సీజన్ ప్రారంభం అవుతుండడంతో ఏజెంట్లు మండలాల్లో పర్యటిస్తూ వివిధ కంపెనీల పేర్లు చెప్పి మొక్కజొన్న, వరి విత్తనాలు అంటగట్టి సాగు చేయించేలా రైతులతో అనధికార ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. అయితే ఉత్పత్తులు చేతికి వచ్చాక, పలు కంపెనీలు వాటిని తీసుకునే సమయంలో ధర తగ్గించి రైతులను ముంచుతున్నాయి.

**నిబంధనలు ఇలా**

కంపెనీల మోసాలను అరికట్టేందుకు ప్రభుత్వం 2017లో ప్రత్యేక జీవో జారీచేసింది. ఆ ప్రకారం ప్రభుత్వ మద్దతు ధరకన్నా కంపెనీలు తక్కువకు కొనకూడదు. ఉత్పత్తులు తరలించిన మరుసటి రోజే రైతుల ఖాతాలో డబ్బులు జమచేయాలి.

విత్తనోత్పత్తి సాగుచేసే రైతులు వ్యవసాయాధికారుల సమక్షంలో కంపెనీలతో నిబంధనలకు అనుగుణంగా బాండ్‌పేపర్‌పై ఒప్పందం రాసుకోవాలని మెదక్ జిల్లా వ్యవసాయాధికారి దేవ్‌కుమార్ 'ఈనాడు'తో



చెప్పారు. **కొన్ని ఘటనలు**మెదక్ జిల్లా చేగుంట మండలం పొలంపల్లిలో ఏటా 500 ఎకరాల నుంచి 800 ఎకరాల మేర వివిధ కంపెనీలకు చెందిన విత్తనోత్పత్తి వరి సాగు చేస్తున్నారు. గత యాసంగిలో సాగుచేసిన రైతులకు విత్తన కంపెనీలు డబ్బులు చెల్లించకపోవడంతో అన్నదాతలు ఆర్థికంగా కుదేలయ్యారు.ప్రస్తుత వానాకాలంలో రుక్మాపూర్‌లో పేరొందిన కంపెనీకి చెందిన బ్రీడర్ మగ విత్తనాలను ఆర్గనైజర్ సాగు చేయించారు. దిగుబడులు రాకపోవడంతో, ఎకరాకు రూ.40 వేల పరిహారం చెల్లిస్తానని రైతులతో ఒప్పందం చేసుకున్నా, దిగుబడి తగ్గడంతో ఆర్గనైజర్ చేతులెత్తేశారు.కొల్చారం మండలం చిన్నఘనపూ ర్‌లో 300 ఎకరాల్లో ఓ కంపెనీ విత్తనోత్పత్తి వరి సాగు చేయించింది. ఎకరాకు 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని నమ్మించారు. ఎనిమిదికి మించి రాలేదు.జిల్లాలో పదివేలకు పైగా ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు.

## గాలి నాణ్యత..మనందరి బాధ్యత!

సిద్దిపేట: వాయు కాలుష్యం.. అనారోగ్యానికి కారణమవుతోంది. రోజురోజుకు పడిపోతున్న గాలి నాణ్యత.. అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకతను సూచిస్తోంది. సూక్ష్మ ధూళికణాలు పెరుగుతున్న తీరు మనల్ని హెచ్చరిస్తోంది. తాజా గణాంకాల ప్రకారం.. ఉమ్మడి మెదక్ జిల్లాలో సూక్ష్మధూళి కణాల తీవ్రత పటాన్‌చెరులో 84, సంగారెడ్డిలో 79 (ఘనపు మీటరు గాలిలో మైక్రోగ్రాములు) నమోదవడం గమనార్హం. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు ప్రభుత్వం, పర్యావరణ హితులు, సామాజిక సేవకులు నడుం బిగించాల్సిన అవసరం ఉంది. నేడు కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో పరిస్థితి, మార్పు వైపు అడుగేయాల్సిన తీరుపై కథనం.ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లోని పట్టణాల్లో ఒకప్పటితో పోలిస్తే జనాభా పెరిగింది. వివిధ రకాల ప్రగతి పనులు కొనసాగుతున్నాయి. పరిశ్రమల సంఖ్య పెరుగుతోంది. వివిధ రాష్ట్రాల ప్రజలు ఇక్కడ నివాసం ఉంటున్నారు. ఇదే క్రమంలో వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. సంగారెడ్డి జిల్లాలో 19, సిద్దిపేటలో 7, మెదక్‌లో 4 పారిశ్రామిక వాడలు ఉన్నాయి. కాలుష్యానికి ఇదో ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు.

**దుమ్ము లేస్తోంది..**

ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో అధ్వాన రహదారులు గాలి కాలుష్యానికి మరో కారణం. ప్రధాన కూడళ్లలో పరిస్థితి తీవ్రంగా ఉంటోంది. మట్టి, అసంపూర్తి దారులు.. దుమ్ము లేపుతున్నాయి. పట్టణాల్లో వాహనాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోవమూ ప్రమాదకరంగా పరిణమిస్తోంది. తీవ్రతను వివరిస్తూ అప్రమత్తం చేసే వ్యవస్థ కరవవుతోంది. ః వ్యర్థాల నిర్వహణ విస్మరించి, ఇష్టానుసారంగా కాల్చేస్తున్నారు. ః పెరుగుతున్న వాహనాలు, కాలం చెల్లినవి అధికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. వాహన ఉద్గారాల్లో నైట్రోజన్ ఆక్సైడ్లు, కార్బన్ మోనాక్సైడ్ వంటివి కాలుష్య కారకాలు.

**ర్యావరణాన్ని సంరక్షిస్తేనే..**

పర్యావరణ సమతుల్యం, జీవుల మనుగడలో పచ్చదనం ముఖ్యం. కార్బన్‌డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్ అందిస్తాయి. ఆరోగ్య పరిరక్షణకు, గాలిని శుద్ధి చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. జిల్లాల్లో ఏటా భారీగా నాటుతున్నా పరిరక్షణ ఆశించిన మేర కొరవడుతోంది. సిద్దిపేటలో జరిమానా విధిస్తున్నా.. తిరిగి నాటించాల్సిన అంశాన్ని విస్మరిస్తున్నారు.

ఒక్క రోజయినా ఇలా చేద్దాం..
వారంలో ఒక్కరోజైనా వాహనాలు ఇంటికే పరిమితం చేద్దాం
సైకిల్, ఇతర ప్రత్యామ్నాయాలు వాడదాం.
పర్యావరణహిత ఈ–వాహనాల వినియోగానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

## ఎన్నాళ్లీ అండర్‌పాస్ వెతలు..!

తూప్రాన్: దేశంలోనే అతిపెద్దదైన 44వ జాతీయ రహదారిలో నిత్యం లక్షలాది వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. ఈ మార్గం జిల్లాలో 55 కి.మీ. మేర విస్తరించి ఉంది. మనోహరాబాద్ మండలం రామాయపల్లి వద్ద 44వ జాతీయ రహదారి అండర్‌పాస్‌లో ఏర్పడిన గుంతలతో వాహనదారులు అవస్థల మధ్య ప్రయాణం సాగిస్తుండటం గమనార్హం. ఐదేళ్ల కిందట..రామాయపల్లి మీదుగా మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వే మార్గం వెళ్తుంది. రైలు వెళ్లినప్పుడల్లా ఇక్కడ వాహనాలు భారీగా నిలిచిపోతుండటంతో పై వంతెన నిర్మించాలని తలపెట్టారు. ఐదేళ్ల కిందట రూ.100 కోట్లకు పైగా నిధులతో దీని నిర్మాణ పనులను షురూ చేశారు. అంతకుముందే రెండు అండర్‌పాస్‌లు ఉన్నాయి.

ఒక వైపే పూర్తవగా..వంతెన నిర్మాణంలో హైదరాబాద్ నుంచి నిజామాబాద్ వైపు పనులు పూర్తవడంతో వాహనదారులను ఆ మార్గంలో అనుమతించారు. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ మార్గంలో పూర్తికాలేదు. దీంతో అండర్‌పాస్‌లోనే వెళ్లాల్సిన పరిస్థితి. కి.మీ.కు పైగా ఉండే ఈ అండర్‌పాస్‌లో అడుగడుగునా గుంతలు ఏర్పడటంతో చోదకులు నానాపాట్లు పడుతున్నారు. రాత్రివేళ గుంతలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

చురకలు



# మద్దతు దక్కదు.. మార్పు తప్పదు!

త్రిపురాంతకం : సాధారణ మొక్కజొన్నకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర లభించడం లేదు. వ్యయ ప్రయాసలకోర్చి పండించాక ప్రకృతి వైపరీత్యాలతో పాటు కొనుగోళ్లు పూర్తిగా వ్యాపారుల దయాదాక్షణ్యాలపై ఆధారపడటంతో సాగుపై కర్షకుల్లో నిరుత్సాహం ఏర్పడుతోంది. దీంతో లాభాల మాట దేవుడెరుగు పెట్టుబడులకు ఇబ్బందులు ఉండవని రైతులు విత్తన మొక్కజొన్న సాగుకు మొగ్గు చూపుతున్నారు.

**ఐదేళ్లుగా ఆయకట్టు, బోరుబావుల కింద..**

జిల్లాలో ఐదేళ్లుగా సాగర్ ఆయకట్టుతో పాటు బోరు బావుల కింద సాధారణ మొక్కజొన్న సాగు చేపడుతున్నారు. జిల్లాలో ఖరీఫ్‌లో 22,000, రబీలో 11,435 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. క్వింటా రూ.2,400 మద్దతు ధర ఉండగా రూ.1,800లకు మించి రేటు లభించడం లేదు. ఈ నేపథ్యంలో పెట్టుబడులకే సరిపోతుండటంతో గత ఐదేళ్ల నుంచి అన్నదాత విత్తన మొక్కజొన్నపై దృష్టి సారించారు. విత్తనాల సరఫరా రసాయన ఎరువుల పంపిణీ ఆయా కంపెనీలే బాధ్యత తీసుకోవడంతో పాటు విత్తన దశలోనే ఒప్పందం కుదుర్చుకుం



టున్నాయి. విత్తన రకాన్ని బట్టి ఎకరానికి కనీసం 4 టన్నుల చొప్పున దిగుబడులు లభిస్తాయి. టన్నుకు రూ.20,00 నుంచి రూ.35,000 వరకు చెల్లిస్తారు. ఈక్రమంలో త్రిపురాంతకంలో 4 వేల ఎకరాల్లోను, జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేపట్టారు.

**నేరుగా కంపెనీలతో ఒప్పందాలు**

వాస్తవానికి అధికారులు, ప్రభుత్వంతో ఎటువంటి సంబంధం లేకుండా రైతులతో విత్తన కంపెనీలు నేరుగా పంట ఒప్పందాలు చేసుకుంటున్నాయి. అంతా సవ్యంగా సాగితే ఎకరానికి రూ.90 వేల నుంచి రూ.లక్ష వరకు రైతులకు చెల్లిస్తున్నారు. అయితే కంపెనీలకు, రైతులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న దళారులు కంపెనీ నుంచి వచ్చే సొమ్ములను నొక్కేసి కర్షకులను వేధిస్తున్నారు. గతేడాది పంట కోశాక ఎగుమతుల సమయంలో డబ్బులు చెల్లింకపోవడంతో పలు గ్రామాల్లో గొడవలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రైతులు దళారుల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అధికారులు వివరిస్తున్నారు.

# స్వాముల భూములు స్వాహా!

కనిగిరి : కనిగిరి ప్రాంతంలో దేవుడి భూములకే రక్షణ లేకుండాపోయింది. ఆలయాల స్థలాలు అన్యాక్రాంతమయ్యాయి. కొంతమంది అక్రమార్కులు బరితెగించి ఆక్రమించేస్తున్నారు. కొంతమంది నేతల అండదండలతో రూ.కోట్ల విలువైన భూములను కబ్జా చేయడమే కాకుండా వాటిని విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఆలయ భూములను పరిరక్షించాల్సిన దేవాదాయశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఇవి అక్రమార్కుల చెరలో ఉన్న పామూరు పట్టణ సమీపంలోని నెల్లూరు రోడ్డులో మదన వేణుగోపాలస్వామి దేవస్థానం భూములు. ఆలయానికి రూ.25 కోట్ల విలువైన సుమారు 17 ఎకరాల భూములున్నాయి. వీటిని నేతల అండతో అక్రమార్కులు ఆక్రమించేశారు. ఇటీవల అధికారులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసినప్పటికీ వాటిని సైతం తొలగించేశారు. తాజాగా వారం రోజుల కిందట ఆలయ భూముల్లో బోర్లు తవ్వుతుండగా ఆలయ అధికారులు అడ్డుకున్నారు. ఆక్రమిత భూముల్లో వెంచర్లు వేసి ప్లాట్లుగా మార్చి విక్రయిస్తూ జేబులు నింపుకొంటున్నారు. ఇది కనిగిరిలోని విజయమార్తాండేశ్వరస్వామి దేవస్థానం. దక్షణ కాశిగా పేరొందిన ఈ ఆలయానికి సుమారు రూ.100 కోట్ల విలువైన 188 ఎకరాలకుపైగా భూములున్నాయి. ప్రస్తుతం కేవలం 8 ఎకరాలు మాత్రమే దేవాదాయశాఖ ఆధీనంలో



ఉండడం గమనార్హం. ఆలయానికి ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భూములున్నట్లు సర్వే నంబర్లతో సహా అధికారులు గుర్తించినప్పటికీ ఇంతవరకు స్వాధీనం చేసుకోలేదు. రూ.కోట్ల విలువైన భూములను అక్రమార్కులు నేతల అండతో నకిలీ పత్రాలతో కబ్జా చేసి స్థిరాస్తి వ్యాపారాలు సాగిస్తున్నారు.

చిత్రంలో కనిపిస్తున్న ఆక్రమణకు గురైన సీఎస్‌పురం మండలం అయ్యలూరివారిపల్లెలోని తిరుమలనాథుని దేవస్థానం భూములు. ఈ ఆలయానికి రూ.30 కోట్లకుపైగా విలువైన 101.9 ఎకరాల భూములున్నాయి. పలుమార్లు దేవాదాయ, రెవెన్యూశాఖల అధికారులు ఆక్రమిత భూములను పరిశీలించినా ఇంతవరకు ఒక్క సెంటు కూడా స్వాధీనం చేసుకోలేదు. కనీసం ఆక్రమణదారులను ప్రశ్నించిన దాఖలాలు గానీ, నోటీసులిచ్చిన సందర్భాలు గానీ లేవు. కొంతమంది నేతల అండదండలతో అక్రమార్కుల చేతుల్లోనే నేటికీ ఆలయ భూములున్నాయి. వీటిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# నల్లమలపై స్పందిస్తే స్వర్గధామమే

పెద్దదోర్నాల: ప్రకృతి రమణీయతకు నిలయం నల్లమల. ఎత్తయిన కొండలు, లోతైన లోయలు, పచ్చని గడ్డి మైదానాలు, గలగల పారే సెలయేర్లు, అరుదైన వన్య ప్రాణులు, ఔషద మొక్కలతో పర్యావరణ సమతుల్యతకు నిలయమైన ఈ ప్రాంతం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మార్కాపురం కేంద్రంగా నూతన జిల్లా ఏర్పడడంతో పర్యాటక కేంద్రాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారిస్తుందని జిల్లావాసులు ఆశాభావంతో ఉన్నారు. పెద్దదోర్నాలలోని శ్రీశైలం రహదారిలో అటవీశాఖ చెక్‌పోస్టు సమీపంలో రూ.కోటితో ఏర్పాటు చేసిన అడ్వెంచర్ పార్కును ప్రారంభిచకపోవడంతో పరికరాలు శిథిలావస్థకు చేరుతున్నాయి. ఆత్మకూరు రహదారిలోని రోళ్లపెంట సమీపంలో పర్యావరణ విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు ఏడేళ్ల కిందట భవనాన్ని సిద్ధం చేసినా ప్రారంభించలేదు. శ్రీశైలం వెళ్లే రహదారిలో వీర్లకొండపైకి పర్యాటకులు కాలినడకన చేరేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాలేదు. ఇప్పటికైనా పాలకులు, స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకురావాలి.

# రైతులకేది శ'నగ'?



నాగులుప్పలపాడు: ఒక వైపు ప్రతికూల వాతావరణ పరిస్థితులు.. మరోవైపు దిగజారిన శనగ ధరలు రైతన్నలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొని రూ.లక్షలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధరల్లేక రైతులు నానా అవస్థలు పడుతున్నారు. జిల్లాలో శనగ పంటను రైతులు విస్తారంగా సాగు చేశారు. 2023లో పంట వేసే సమయంలో ఉన్న ధరలు ప్రస్తుతం పతనం కావడంతో రైతన్నల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో శీతల గిడ్డంగుల్లోనే శనగల బస్తాలు రెండేళ్లుగా మూలుగుతున్నాయి.

**దిగజారిన ధరలు...**

2023, నవంబరులో కాక్-2 రకం క్వింటా రూ. 12 వేలు, జేజే-11 రూ.7 వేలు పలికింది. తీరా పంట చెతికొచ్చే సమయానికి కాక్-2 రకం రూ.7 వేలు, జేజే-11 రూ.5 వేలే పలికింది. దీంతో రైతులు చేసేదేమీ లేక శీతల గిడ్డంగుల్లో నిల్వ చేశారు. అప్పటి నుంచి ధరలు పతనమవుతు వచ్చాయి. ప్రస్తుతం కాక్-2, జేజే-11 రకాల శనగలు మార్కెట్‌లో క్వింటాలుకు రూ.5 వేలు మాత్రమే పలుకుతున్నాయి. వీటిని కూడా కొనుగోలు చేసే నాథుడే కరవయ్యారు. ఒక వైపు పెట్టుబడులకు తీసుకొచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయి. శీతల గోదాముల్లో శనగలు నిల్వ చేయడానికి సంవత్సరానికి క్వింటాకు అద్దె రూ.140 చెల్లించాల్సి వస్తోంది. ఏళ్లతరబడి నిల్వ చేయడంతో రైతులకు అద్దెలు భారంగా మారాయి. దీంతో పాటు ఈ ఏడాది బర్లీ పొగాకు సాగు లేకపోవడంతో శనగ పంటను తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో కేంద్ర ప్రభుత్వం విధించే 30 శాతం దిగుమతి సుంకం ఎత్తి వేయడంతో ఇతర దేశాల నుంచి శనగలు తక్కువ ధరకే వస్తున్నాయని కొందరు రైతు సంఘం నాయకులు విశ్లేషకులు చెబుతున్నారు. దీంతో శనగలను దిగుమతి చేసుకోవడంతో ఇక్కడి ధరలు పతనానికి కారణమంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శీతల గిడ్డంగుల్లోని శనగల నిల్వలను మద్దతు ధరకు కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మొత్తం శనగ రైతుల సంఖ్య: 25,963

నిల్వలు (మెట్రిక్ టన్నుల్లో): 89,007

# ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సౌర విద్యుత్తు



మార్కాపురం : పేద, మధ్యతరగతి కుటుంబాలకు విద్యుత్తు బిల్లుల నుంచి ఉపశమనం కల్పించే క్రమంలో సౌర విద్యుత్తు వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయి. 'ప్రధాన మంత్రి సూర్యఘర్' పథకంలో భాగంగా ఇంటి పైకప్పు నుంచే విద్యుత్తు ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. దీని ద్వారా కలిగే ప్రయోజనాలపై సంబంధిత అధికారులు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. కుటుంబ ఆదాయంతో సంబంధం లేకుండా దరఖాస్తు చేసుకున్న ప్రతి ఇంటికి సౌరవిద్యుత్తు కనెక్షన్ అమర్చనున్నారు. మూడు కిలో వాట్లకు గరిష్ఠంగా రూ.78 వేల వరకు ఆర్థికసాయం అందిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు సోలార్ ఫలకలను నూరు శాతం రాయితీపై ఉచితంగానే అమలు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆయా సామాజికవర్గాల వారీగా ఉన్న విద్యుత్తు కనెక్షన్ల వివరాలను జిల్లా అధికారులు సేకరించారు. తద్వారా ఇప్పటికే లబ్ధి పొందనున్న కుటుంబాల సర్వే వివరాలు పూర్తి చేశారు. ఈ ఏడాది తొలి విడతగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు సంబంధించి 33,022 కనెక్షన్లు ఏర్పాటు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది.

**ఇరువురికి లాభమే..**

సౌర విద్యుత్తు కనెక్షన్లతో లబ్ధిదారులతోపాటు ప్రభుత్వానికి ప్రయోజనమే. సౌర ఫలకలపై పెట్టుబడితో ప్రభుత్వంపై మొదట కొంత ఆర్థిక భారం పడినా దీర్ఘ కాలంలో విద్యుత్తు కొనుగోలు, పంపిణీ ఖర్చు భారీగా తగ్గనుంది. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు నెలకు 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించే వారికి ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు సరాసరిన సుమారు రూ.6 వరకు ప్రభుత్వమే ఖర్చు చేస్తోంది. అదే సోలార్ ద్వారా అందించగలిగితే సొమ్ము ఆదా అయినట్లే. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఎక్కువ మంది 100 నుంచి 150 యూనిట్ల మధ్యనే వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో అందరికీ 2 కిలోవాట్ సామర్థ్యం కలిగిన సోలార్ అమర్చనున్నారు. తద్వారా నెలకు సరాసరిన 200 యూనిట్ల వరకు సౌర విద్యుత్తు ఉత్పత్తి కానుంది. దీంతో సదరు వినియోగదారులకు బిల్లురాదు. మరోపక్క ప్రభుత్వానికి భారం ఉండదు. ఒకసారి ఫలకలు ఏర్పాటు చేస్తే 25 ఏళ్లపాటు నిరంతరాయంగా వినియోగించవచ్చు.

**టెండర్ల పూర్తి**

కందుకూరు, కనిగిరి, మార్కాపురం విద్యుత్తుశాఖ డివిజన్లల్లో టెండర్లు పూర్తయ్యాయి. ఒంగోలు, దర్శి డివిజన్లకు ఒకరు చొప్పునే టెండరు వేయడంతో వాటిని రద్దు చేసి మరోసారి పిలిచారు. ఇప్పటికే మూడు డివిజన్లలో పనులు దక్కించుకున్న గుత్తేదారులు సర్వే చేసి, ఆ తర్వాత ఆసక్తి ఉన్న వినియోగదారులకు సోలార్ అమర్చనున్నారు. సౌర ఫలకల ఏర్పాటుకు ఇంటి పైకప్పుపై కనీసం 100 చదరపు అడుగుల స్థలం అవసరం. మిగిలిన టెండర్లు కూడా పూర్తి కానున్నాయి, ఈ మేరకు త్వరలోనే పనులు ప్రారంభించనున్నట్లు విద్యుత్తుశాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు తెలిపారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని విద్యుత్తు కనెక్షన్లు

గృహ విద్యుత్తు కనెక్షన్లు: 9,09,990

ఎస్సీ కుటుంబాలవి: 1,60,983

ఎస్టీ కుటుంబాలవి : 22,604

# జల సంరక్షణ... మౌలిక వసతుల కల్పన



ఒంగోలు : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్' (వీబీజీ రామ్ జీ) పేరిట అమలు చేసేందుకు శ్రీకారం చుట్టింది. మార్పులు, చేర్పులతో పథకాన్ని ఏప్రిల్ నుంచి అమల్లోకి తీసుకురానుంది. రాష్ట్ర పంచాయరాజ్‌శాఖ ఆదేశాల మేరకు ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నారు. పథకంలో చేసిన మార్పులకు అనుగుణంగా కేంద్రం 'వీబీజీ రామ్ జీ' పేరిట పథకాన్ని కొనసాగించనున్నారు. అందులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పనులపై వివరించనున్నారు. రెండు జిల్లాల్లోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవోల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మార్కాపురం మండలం తిప్పాయపాలెంలో నిర్వహించనున్న గ్రామసభలో కలెక్టర్ రాజాబాబు, జిల్లా అధికారులు హాజరు కానున్నారు.

**ఉపాధి నిధులతోనే పల్లె ప్రగతి**ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా గ్రామాల్లో శాశ్వత భవనాల నుంచి అన్ని రకాల రహదారుల నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద విడుదల చేయనున్న మెటీరియల్ కాంపొనెంట్ నిధులే ప్రధాన వనరు. 'వీబీ-జీ రామ్ జీ' అమల్లోకి వచ్చాక కూలీలకు పనిదినాలు పెరగనున్న నేపథ్యంలో కాంపొంనెంట్ నిధులు కూడా పెరగనున్నాయి. తద్వారా పల్లెల్లో సీసీ, మట్టి, బీటీ రహదారులు, మురుగు కాలువలు, పండ్లతోటలు, మొక్కల పెంపకంతోపాటు ఇంకుడు గుంతలు వంటి జల సంరక్షణ పనులకు నిధులు కేటాయిస్తారు. **ఉపయోగాలివి**

ప్రస్తుతం కూలీలకు 100 రోజులపాటు కల్పిస్తున్న పనిదినాలు 125 రోజులకు పెరగనున్నాయి. ఆర్థిక సంవత్సరానికి అయ్యే వ్యయంలో 90 శాతం కేంద్రం, మిగిలిన 10 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుండగాబీ ఇకపై 60:40 నిష్పత్తిలో ప్రభుత్వాలు నిధులు కేటాయించాల్సి ఉంటుంది. పథకం అమలులో భాగంగా వ్యవసాయ పనుల కాలంలో 60 రోజుల పాటు ఉపాధిహామీ పనులను నిలుపుదల చేసి రైతులకు వెసులుబాటు కల్పిస్తారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాల ప్రకారం గ్రామపంచాయతీ ప్లాన్ ఆధారంగా నిధులు కేటాయిస్తారు.

# వస్తోంది గ్రీన్ సిగ్నల్!

కొయ్యలగూడెం : జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై వాహనాల పరుగుకు సమయం ఆసన్నమైంది. సంక్రాంతికి ఈ రహదారిపై వాహనాల రాకపోకలకు 'గ్రీన్'సిగ్నల్ ఇవ్వనున్నారు. ఇందుకు సంబంధించి వైరా నుంచి జంగారెడ్డిగూడెం వరకు వదలాలని జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తెలంగాణలోని ఖమ్మం నుంచి తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి వరకు నిర్మితమైన యాక్సిస్ కంట్రోల్ గ్రీన్‌ఫీల్డ్ రహదారి పొడవు 162.10కి.మీటర్ల కాగా అందులో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 56.88 కి.మీ మేర ఉంది. చింతలపూడి మండలం రేచర్ల సమీపంలో ఈ రహదారి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించి దాదాపు 40



కి.మీ. మేర జిల్లాలోని కన్నాయగూడెం వరకు కొనసాగుతోంది. అయితే జిల్లాలోనే యర్రంపేట, కన్నాయగూడెం సమీపంలో కోర్టు కేసు నేపథ్యంలో పనులకు ఆటంకం కలిగినా ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. కేవలం రెండు కిలో మీటర్లు మేర మాత్రమే అప్పట్లో పెండింగ్ పడినా మిగిలిన రహదారి మొత్తం పూర్తయ్యింది. మరో రెండు నెలల్లో పూర్తి.. మరో రెండు నెలల్లో ఈ రహదారి పెండింగ్ పనులు పూర్తి కావచ్చని సంబంధిత అధికారులు అంచనా వేస్తున్నారు. రహదారి మొత్తం పూర్తయి త్వరలోనే వాహనాల రాకపోకలు సాగితే ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు దూరాభారం తగ్గనుంది.

# తెలుసుకుంటే మేలు.. లేకుంటే బిల్లు పేలు!

కలిదిండి : రొయ్యల సాగులో విద్యుత్తు వినియోగంపై అవగాహన లేని రైతులు పరోక్షంగా దోపిడీకి గురవుతున్నారు. వాతావరణంలోని మార్పులకు అనుగుణంగా రైతులు ఏరియేటర్లు తిప్పుతుంటారు. తరవాత వాటిని కట్టేస్తారు. అంతటితో పని అయిపోయిందనుకుంటారు. ఇక్కడే పెద్ద చిక్కొచ్చి పడుతోంది. ఏరియేటర్లతో పాటు ‿పాసిటర్‌ను ఆఫ్ చేయకపోవడంతో మీటరు రీడింగ్ తిరిగిపోతోంది. దీంతో వాడుకున్న విద్యుత్తుతో పాటు వాడని విద్యుత్తుకూ బిల్లు వచ్చేస్తుంది. ఈ విషయం తెలియని సాగుదారులు లబోదిబోమంటూ బిల్లు కట్టడం తప్ప. ఎందుకొస్తుందో తెలుసుకునే ప్రయత్నం చేయడం లేదు. దీనిపై అధికారులూ అవగాహన కల్పించడం లేదు. '5 ఎకరాల్లో రొయ్యల చెరువుకు నెలకు 8,000 యూనిట్లు ఖర్చవుతుంది. బిల్లు



మాత్రం 14,000 యూనిట్లకు వస్తోంది. రాయితీ లేనందున యూనిట్‌కు రూ.4 చొప్పున నెలకు రూ.24 వేలు వినియోగించని విద్యుత్తుకు బిల్లు కట్టాల్సి వచ్చింది. ఈ విధంగా కొన్ని నెలలుగా రూ.5 లక్షలు నష్టపోయా. దీనికి కారణం ‿పాసిటర్ ఆఫ్ చేయకపోవడమే అని తెలిసి అవాక్కయ్యా' అంటూ వాపోయారు కోరుకొల్లుకు చెందిన ఓ రొయ్యల రైతు.

**అవగాహన కల్పిస్తాం**

‿పాసిటర్ ఆన్‌లో ఉంటే మీటరు నడుస్తూనే ఉంటుంది. దీని ఆధారంగా బిల్లు వచ్చేస్తుంది. ఇది రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విధానం. చెరువు వద్ద విద్యుత్తు వినియోగం పూర్తయిన తరవాత‿పాసిటర్‌ను ఆపివేయాలి. దీనిపై సాగుదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పిస్తాం.జీబీ శ్రీనివాసరావు, విద్యుత్తు ఈఈ

# ఆ దారం వాడొద్దు.. అంధకారం కానీయొద్దు..!

శ్రీకాకుళం : సంక్రాంతి వస్తోందంటే చాలు ఉత్సాహం ఉరకలేస్తుంది. పిల్లలతో పాటు పెద్దలు సైతం ఆటపాటలతో సందడిగా గడుపుతారు. మిద్దెలు, డాబాలు, మైదాన ప్రదేశాల్లో పోటాపోటీగా గాలి పటాలు ఎగరేస్తారు. పతంగులకు కట్టే దారం తెగిపోకుండా ఉండేందుకు చైనా మాంజాలను వినియోగిస్తుంటారు. అది అత్యంత ప్రమాదకరం. వాటి వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి. విహంగాలకూ ముప్పు వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ మాంజాతో గాలిపటాలు ఎగరేయ్యొద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

**ప్రమాదాలు ఎందుకు జరుగుతాయంటే..**

చైనా మాంజాలను నైలాన్, సింథటిక్, ఫైబర్ దారాలతో వీటిని తయారు చేస్తారు. మాంజాను గాజుపొడి, అల్యూమినియం ఆక్సైడ్, లోహచూర్ణం, రంగులు, కృత్రిమ జిగురు మిశ్రమంలో ఉంచి ఎండబెడతారు. అలా చేయడంతో దారం తెగి పోకుండా పదునుగా ఉంటుంది. ఈ దారాన్ని గట్టిగా లాగితే చేతులు కూడా తెగిపోతుంటాయి. మెడ, గొంతు లాంటి సున్నిత ప్రదేశాల్లో చుట్టుకుంటే గాయాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఒక్కోసారి అధిక రక్తస్రావమై ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందని వైద్యులు చెబుతున్నారు.

**అప్రమత్తత అవసరం..**

ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు వీధుల్లో పరిసరాలను గమనిస్తూ వెళ్లాలి. గాలిపటం తెగితే ఎగరేసిన వ్యక్తే మాంజాను గుర్తించి తొలగించాలి.

గాలి పటాలను ఎగరేసేందుకు సంప్రదాయ పద్ధతిలో పత్తితో తయారైన దారాన్నే వాడాలి. అప్పుడే ప్రమాదాలను నివారించడానికి వీలుంది. రోడ్లు, విద్యుత్తు తీగలు, చెట్లు, పైవంతెనలు ఉన్న చోట పతంగులు ఎగరేయొద్దు. దారం తెగి చెట్టు కొమ్మలు, తీగల్లో ఇరుక్కుంటే వాటిని తొలగించే ప్రయత్నం చేయడం సరైంది కాదు. అలాంటి సమయాల్లోనే ప్రమాదాలు సంభవిస్తాయి. క్రీడా మైదానాల్లో మాత్రమే గాలి పటాలను ఎగరేయడం మేలు. ఇతర ప్రాంతాల్లో ఎగరేస్తే తగిన జాగ్రత్తలు పాటించాలి.

'ఎక్కడైనా చైనా మాంజా విక్రయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే పోలీసులకు సమాచారమివ్వండి. దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం' అని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు.

## పనులు నెమ్మదించాయి.. ఎందుకో..?

గుడుపల్లె : గుడుపల్లె ప్రాంతంలో రైల్వే ప్రయాణికులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏళ్లనాటి సమస్యలకు పరిష్కారం చూపడం లేదు. నిత్యం ఇక్కడి నుంచి బెంగళూరు, చెన్నై ప్రాంతాలకు సుమారు ఐదు వేల మంది రైళ్లలో ప్రయాణిస్తుంటారు. అయితే స్థానిక రైల్వేస్టేషన్‌లో కనీస మౌలిక వసతులు లేకపోవడం గమనార్హం.నాలుగు ఎక్స్‌ప్రెస్.. ఎనిమిది ప్యాసింజర్.. గుడుపల్లె రైల్వేస్టేషన్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు... నాలుగు ఎక్స్‌ప్రెస్, ఎనిమిది ప్యాసింజర్ రైళ్లు ఆగుతాయి. స్టేషన్లో తాగునీరు, షెల్టర్లు, కూర్చునేందుకు సరైన బెంచీలు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

అధ్వానంగా స్టేషన్ రోడ్లు .. రైలు ప్రయాణం కోసం సుమారు 60




గ్రామాల ప్రజలు వస్తుంటారు. స్టేషన్‌కు వచ్చే రోడ్లు గుంతలు పడి అధ్వానంగా ఉండటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రూ.25 కోట్లు మంజూరైనా.. గుడుపల్లె–కుప్పం రైలు మార్గం గుడుపల్లె వద్ద రైల్వే కింది వంతెన నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరయ్యాయి. పనులు చేపట్టేందుకు రెండు సార్లు సర్వే చేసినా నేటికీ పనులు ప్రారంభించకపోవడం గమనార్హం. దీంతో గేటు పడిన సమయంలో ప్రజలు ట్రాఫిక్ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

## పరి'శ్రమించి'న అభివృద్ధి..!

కుప్పం : త్రిరాష్ట్ర కూడలి సరిహద్దు ప్రాంతం.. ఒకప్పుడు ఉన్నత విద్య చదవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాలి.. ఇప్పుడు ఈ ప్రాంతంలో ఉన్నత విద్య లభిస్తుండటంతో ఇతర ప్రాంతాల వారు సైతం ఇక్కడే విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధి పొందాలంటే మాత్రం పక్క రాష్ట్రాలకు వెళ్లాల్సిందే. అయితే ఈ విధానానికి స్వస్తి పలికేందుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారు. కుప్పంలో ఈ దఫా పలు పరిశ్రమలు రూ.వేల కోట్లతో స్థాపన చేస్తుండటంతో.. ఇక్కడే ఉద్యోగాలు లభిస్తాయని యువకులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలోని కడా ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లో పరిశ్రమల స్థాపనకు ఆయా ప్రాంతాల్లో పనులు చకచకా జరుగుతున్నాయి. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వేర్వేరుగా వర్చువల్ విధానంలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన చేశారు. కుప్పం ప్రాంతంలో 22 పరిశ్రమలతో కడా ఇప్పటికే మౌఖిక ఒప్పందం చేసుకుంది. ఈ పరిశ్రమలన్నీ స్థాపిస్తే నిరుద్యోగ సమస్య తీరుతుందని యువత అభిప్రాయపడుతున్నారు.

**వివరాలిలా..**



పరిశ్రమలు: సుమారు 22
కేటాయించిన భూమి: 937.58 ఎకరాలు
పెట్టుబడులు: రూ.8,051.27కోట్లు
ఉపాధి ప్రత్యక్షంగా: 38,593 మంది
పరోక్షంగా: 51,565 మంది

**విద్య.. ఉపాధి.. ఇక్కడ**

కుప్పం ప్రాంతం విద్యా కేంద్రంగా మారింది.. ఇప్పుడు పరిశ్రమల రాకతో ఉపాధి కూడా లభించనుంది. పరిశ్రమలు వస్తే ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుంది. దీంతో వలసలు తగ్గుతాయి.
వాసువివేక్, కుప్పం

**మెరుగైన ఫలితాలు సాధిస్తాం**

కడా ఆధ్వర్యంలో 22 పరిశ్రమలతో ఇప్పటి వరకు మౌఖిక ఒప్పందం చేసుకున్నాం. ఎనిమిది పరిశ్రమల స్థాపనకు పనులు ప్రారంభించాం. మిగిలిన 9 పరిశ్రమల పనులు ప్రారంభించాల్సి ఉంది. మిగతా 5 పరిశ్రమలకు స్థలాన్వేషణ చేస్తున్నాం.వికాస్ మర్మత్, పీడీ, కడా

## 'ఆధార్' నవీకరణకు.. మరో అవకాశం..!

విశాఖపట్నం : అక్టోబరులో వారం రోజుల పాటు జిల్లాలోని పాఠశాలల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. కానీ ఎక్కువ మంది నవీకరించుకోలేదు. దీంతో మరోసారి అవకాశం కల్పించారు.అయిదు నుంచి 17 ఏళ్ల పిల్లలకు ఈ ఏడాది సెప్టెంబరు 30 వరకు ఉచితంగా సర్వీసు అందిస్తారు. గుర్తింపు, నివాస ధ్రువీకరణను ప్రతి పదేళ్లకోసారి అప్‌డేట్ చేసుకోవాలని ఉడాయ్ సూచిస్తోంది. విద్యా సంస్థల్లో ప్రవేశ పరీక్షలు, ఉపకార వేతనాలు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్ తప్పనిసరి అవుతోంది. ఫిబ్రవరిలో నీట్–2026 నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. వీటితోపాటు కొన్ని జాతీయ ప్రవేశ పరీక్షలకు తప్పనిసరిగా ఆధార్ అప్‌డేట్ చేసుకోవాల్సిన అవసరముంది. ఉడాయ్ సూచన ప్రకారం జిల్లాలో తప్పనిసరిగా చేయాల్సిన బయోమెట్రిక్ 1,09,000 పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో సోమవారం నుంచి ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.

17ఏళ్లలోపు పిల్లలకు ఉచితం: అప్పుడే పుట్టిన శిశువుల నుంచి అయిదేళ్ల లోపు పిల్లలకు ఫొటో, పేరు, పుట్టిన తేదీ ఆధారంగా 'బాల ఆధార్' జారీ చేస్తారు. ఆ వయసులో ఐరిస్, వేలి ముద్రలు తీసుకోరు. ప్రస్తుత నిబంధనల ప్రకారం వారికి అయిదేళ్లు రాగానే తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయాలి. బీ మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్‌డేట్ (ఎంబీయూ)గా పిలిచే ఈ ప్రక్రియను అయిదు నుంచి ఏడేళ్ల లోపు చేసుకుంటే సేవలు ఉచితం. ఈ ప్రక్రియ ద్వారా చిన్నారుల ఆధార్ నంబరులో ఎలాంటి మార్పు ఉండదు. ఏడేళ్లు వచ్చినా నవీకరణ జరగకపోతే ఆధార్ గుర్తింపు రద్దు చేసే అవకాశముంది.

మ్యాపింగ్ పూర్తి..– ఉషారాణి, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల పర్యవేక్షణాధికారి ఎంబీయూ ఎక్కువగా పెండింగ్ ఉన్న పాఠశాలలకు ముందుగా కిట్లు పంపించనున్నాం. ఈ మేరకు మ్యాపింగ్ పూర్తి చేశాం. పాఠశాల, కళాశాలల యాజమాన్యాలు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులకు ఎంబీయూ పూర్తి చేయాలి.

# చరిత్ర పదిలం.. ప్రాచీన వైభవం



తిరుపతి: కలియుగ వైకుంఠమైన తిరుమల క్షేత్రంలోని వెయ్యేళ్ల చరిత్ర కలిగిన ప్రాచీన కట్టడాలు, రాతి మండపాలు, మెట్ల మార్గాలను పదిలపర్చుకునేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) కీలక నిర్ణయం తీసుకుంది. ఆర్కియాలజి సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) తరహాలో శాస్త్రీయ పద్ధతిలో వీటిని మరమ్మతు చేసి, పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఇంజినీరింగ్ శాఖ పరిధిలో ప్రత్యేకంగా 'కన్జర్వేషన్ అండ్ ప్రిజర్వేషన్ సెల్'ను ఏర్పాటు చేయనుంది. డిసెంబరు 16న జరిగిన తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో ఛైర్మన్ బి.ఆర్. నాయుడు నేతృత్వంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది.

**1500 ఏళ్ల నాటి చరిత్రను కాపాడేలా..** తిరుమలలోని అనేక చారిత్రక కట్టడాలు, తిరుమల–తిరుపతి మధ్య ఉన్న కాలిబాటలు వెయ్యి నుంచి 1500 ఏళ్ల క్రితం నాటివి. వీటిని పరిరక్షించి, భవిష్యత్తు తరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఉందని తితిదే గుర్తించింది. ఏఎస్ఐ ప్రమాణాలకు అనుగుణంగా వీటి మరమ్మ తులు చేపట్టేందుకు, ప్రత్యేకంగా ఒక వినియోగదారుల మాన్యువల్‌ను కూడా రూపొందించనున్నారు. **కీలక అంశాలు ఇవే..**

ఈ విభాగాన్ని పర్యవేక్షించేందుకు డిప్యూటీ ఈవో హోదాలో 'కన్జర్వేషన్ అండ్ ప్రిజర్వేషన్ ఆఫీసర్ (ఇంజినీరింగ్)' అనే కొత్త పోస్టును సృష్టించనున్నారు.పురావస్తు శాఖలో పనిచేసిన అనుభవం ఉన్న విశ్రాంత అధికారిని లేదా ఏఎస్ఐ నుంచి డెప్యూటేషన్‌పై వచ్చిన అధికారిని ఈ పోస్టులో నియమిస్తారు.ఈ అధికారికి ఏటా సుమారు రూ.13 లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా. టీవీఎస్ మోటార్స్, లార్డ్ వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ (పుణె) వంటి స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఈ పురాతన కట్టడాల పరిరక్షణ పనులు చేపట్టనున్నారు. కట్టడాల పటిష్ఠత, చారిత్రక ప్రాధాన్యాన్ని కాపాడేందుకు ఎప్పటికప్పుడు ఆడిట్ నిర్వహిస్తారు. ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలపడంతో పాటు, ప్రత్యేక సెల్ ఏర్పాటు కోసం అనుమతి కోరుతూ ఏపీ ప్రభుత్వానికి లేఖ రాయాలని బోర్డు నిర్ణయించింది.

# అ'ధనం' వసూలు




కర్నూలు : గోధుమ పిండి పంపిణీలో కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కర్నూలు నగరపాలక సంస్థతోపాటు [illegible] రేషన్ కార్డుదారులకు [illegible] జనవరి నుంచి [illegible] 172 చౌక దుకాణాలుండగా.. 1,1[illegible] మంది కార్డుదారులున్నారు. జిల్లాకు 70 టన్నుల గోధుమ పిండి కేటాయించారు. ఒక్కో చౌక దుకాణం పరిధిలో మొత్తం కార్డుదారుల్లో 70 శాతం మందికి గోధుమ పిండి ప్యాకెట్లను పౌరసరఫరాల సంస్థ అధికారులు సరఫరా చేశారు. కిలో పిండి రూ.20కు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. వాస్తవంగా డీలర్లకు ప్రభుత్వం రూ.19కే అందిస్తోంది. కార్డుదారులకు విక్రయించినందుకు కిలో ప్యాకెట్‌పై రూపాయి కమీషన్ ఇస్తోంది. కానీ కొందరు డీలర్లు కిలో గోధుమ పిండిని రూ.25కు అమ్ముతున్నారు.

**కార్డుదారులపై భారం మోపి..**

పౌరసరఫరాల సంస్థ గోదాము నుంచి చౌకదుకాణాలకు సరఫరా చేసిన బ్యాగుల్లో తమకు రావాల్సిన కోటా కంటే తక్కువ ప్యాకెట్లు వచ్చాయని.. ఒక్కో బ్యాగులో 5 నుంచి 10 ప్యాకెట్లు తక్కువగా రావడంతో ఆ కొరతను అధిగమించేందుకు ఒక్కో ప్యాకెట్‌పై రూ.5 అదనంగా వసూలు చేస్తున్నట్లు కొందరు డీలర్లు చెబుతున్నారని కార్డుదారులు వాపోతున్నారు. కర్నూలు బాబా బృందావన్ నగర్‌లో కిలో గోధుమ పిండి ప్యాకెట్‌ను ఓ డీలరు కార్డుదారులకు రూ.25కు ఇచ్చారు. జనం ప్రశ్నిస్తే.. తానొక్కడినే ఇలా చేయడం లేదని.. చాలామందికి గోధుమ పిండి ప్యాకెట్లు తక్కువగా రావడంతో రూ.5 అదనంగా వసూలు చేస్తున్నట్లు చెప్పారని పలువురు కార్డుదారులు పేర్కొన్నారు. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

# 'హద్దు'ల్లేని ఆక్రమణలు



ఎమ్మిగనూరు :విలువైన ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. తాఖీదులిచ్చి తమ పనైపోయిందంటూ చేతులు దులిపేసుకొంటున్నారు. ఎమ్మిగనూరు మండల పరిధిలో బనవాసిఫారం వద్ద 2,180 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో నవోదయ విద్యాలయం, పశుసంవర్ధకశాఖ పాలిటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, గురుకుల బాలిక పాఠశాల, జూనియర్ కళాశాల, ఇతర ప్రభుత్వ సంస్థలకు 600 ఎకరాలు కేటాయించారు. మిగిలిన భూమిలో ఆబోతుల పోషణకు పచ్చిమేత, ఇతర గ్రాసాలు పండిస్తున్నారు. బనవాసిఫారం భూముల సరిహద్దులు అసమగ్రంగా ఉండటంతో నాయకుల అండదండలతో పలువురు సుమారు 200 ఎకరాలను ఆక్రమించుకున్నారు. సారవంతమైన ఎర్ర నేలలు కావడం, ఫారం భూముల మధ్యలో ఎల్లెల్సీ ప్రవహిస్తుండటంతో హస్తగతం చేసుకుని పంటలు పండించుకుంటున్నారు.

**సర్వే పూర్తికాక..** ఫారం భూముల అన్యాక్రాంతంపై 'ఈనాడు'లో వరుస కథనాలు రావడంతో సమగ్రంగా సర్వే చేసి సరిహద్దుల్లో రాళ్లు పాతాలని గతంలో పనిచేసిన సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. కొంతవరకు సర్వే చేసి వదిలేశారు. సబ్ కలెక్టర్ పదోన్నతిపై వెళ్లడంతో సర్వే ఆగిపోయింది. దీంతో ఫారం భూముల సరిహద్దు సమస్య మళ్లీ మొదటికొచ్చింది.గత ఖరీఫ్ కంటే ముందే ఆక్రమణదారులకు అధికారులు తాఖీదులు ఇచ్చారు. కొంతమేర స్వాధీనం చేసుకున్నారు. పంటలు వేశామని.. స్వాధీనం చేసుకుంటే తీవ్రంగా నష్టపోతామంటూ పలువురు హైకోర్టుకు వెళ్లారని ఆబోతు కేంద్రం అధికారులు చెబుతున్నారు. **కంచె ఏర్పాటుచేస్తే..** బనవాసిఫారం భూముల మధ్యలో ఎమ్మిగనూరు–ఆదోని జాతీయ రహదారి వెళుతోంది. దీనికితోడు దిగువ కాల్వ ప్రవహిస్తుండటంతో భూములకు మంచి డిమాండ్ ఉంది. ఎకరా రూ.అర కోటికి పైగా పలుకుతోంది. ఈ నేపథ్యంలో సమగ్ర సర్వే చేసి సరిహద్దు రాళ్లు పాతి కంచె ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట వేయొచ్చు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కానీ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా అధికారులు పట్టించుకోవడం లేదు. భూములకు సరిహద్దు ఏర్పాటుచేసి ఆబోతు కేంద్రానికి అవసరమైన భూమి పోగా.. మిగతా దానికి కౌలుకు వేలం వేస్తే ప్రభుత్వానికి ఆదాయం వస్తుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎకరా కౌలు రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పైగా తీసుకుంటున్నారు. ఈ లెక్కన ప్రభుత్వానికి కౌలు వేలం ద్వారా ఏటా రూ.కోటికిపైగా ఆదాయం వచ్చే అవకాశముంది.

## బూడిదే మిగిలింది!

అచ్యుతాపురం : అచ్యుతాపురం నాన్ సెజ్‌లోని ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమలో జరిగిన భారీ అగ్ని ప్రమాదం బూడిదనే మిగిల్చింది. మంటలు చెలరేగిన భవనం మొత్తం నల్లగా మారింది. గోడలు కూలిపోయాయి. ప్రాంగణంలో పొగలు వస్తున్నాయి. ఆవరణలో ఇనుప డ్రమ్ములు చెల్లాచెదురుగా పడ్డాయి. సాల్వెంట్ నిల్వ ట్యాంకులు నామరూపాల్లేకుండా పోయాయి. సిలెండర్లు దూరంగా ఎగిరిపడ్డాయి. ఎకరా విస్తీర్ణంలో పరిశ్రమ ఏర్పాటుకు ఏపీఐఐసీ, పరిశ్రమల శాఖ, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా అనుమతి ఇచ్చారనే విషయం ప్రశ్నార్థకంగా ఉందని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. పక్కపక్కనే రసాయన, ఫార్మా పరిశ్రమలను ఏర్పాటు చేయడం వల్ల ఏదైనా ప్రమాదం జరిగితే మిగిలిన వాటికీ మంటలు వ్యాపించే ఆస్కారముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్క కంపెనీ నిర్లక్ష్యంగా వ్యవహరించినా మిగిలిన కంపెనీలన్నీ భారీ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితన్నారు.ప్రమాదం జరిగిన కంపెనీ వద్ద మంటలు అదుపు చేయడానికి ఎటువంటి ప్రాథమిక జాగ్రత్తలు తీసుకోలేదని అధికారుల విచారణలో వెల్లడైంది. విద్యుత్తు షార్ట్‌సర్క్యూట్ వల్ల మంటలు



వ్యాపించిన సమయంలో నీటితో అదుపు చేయడానికి ప్రయత్నించడంతోనే మంటలు ఎగిసిపడ్డాయని ప్రాథమికంగా నిర్ధారించారు. అవగాహన లేకుండా నీటిని పిచికారీ చేసి మంటలు మరింత పెరగడానికి కారణమయ్యారని కంపెనీ ప్రతినిధులను హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే విజయకుమార్ నిలదీశారు. కార్మికుల ప్రాణాలకు రక్షణలేని పరిశ్రమలు ఇక్కడ ఉంచొద్దని ఎమ్మెల్యే కోరారు. నిబంధనలకు విరుద్ధంగా అవసరానికి మించి మండే స్వభావం ఉన్న రసాయనాలను నిల్వ చేయడం వల్లే ప్రమాదం జరిగిందని కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ పరమేశ్వరరావు చెప్పారు.

**ఎస్‌వీఎస్ పరిశ్రమపై కేసు నమోదు..**

నాన్ సెజ్‌లో అగ్నిప్రమాదం జరిగిన ఎస్‌వీఎస్ రసాయన పరిశ్రమపై కేసు నమోదు చేసినట్లు సీఐ నరసింగరావు చెప్పారు. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం, ముందస్తు జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ప్రమాదం జరిగినట్లు లాలంకోడూరు వీఆర్వో సూరిబాబు ఆదివారం ఫిర్యాదు చేశారు.

## నకిలీ సృష్టించి.. నచ్చినట్లు విక్రయించి!

అనకాపల్లి : 'వైకాపా హయాంలో ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు నేతలు కబ్జా చేశారు. రెవెన్యూ అధికారులు అండదండలతో మరింత రెచ్చిపోయారు. ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురికాకుండా పర్యవేక్షించాల్సిన అధికారులు చూస్తూ మిన్నకుండిపోయారు. అనకాపల్లి గ్రామీణ మండలం పిసినికాడ రెవెన్యూ పరిధిలో డీఫారం భూమి ఉంది. అప్పట్లో స్థానికంగా పనిచేసిన ఓ వీఆర్‌ఏ.. తప్పుడు పత్రాలతో కొంత స్థలాన్ని తన తల్లి పేరుతో మార్చుకున్నారు. మరికొంత స్థలాన్ని స్థానిక చోటా నాయకుడికి ధారాదత్తం చేశారు. అప్పట్లో ఈ వ్యవహారంపై వివాదం చెలరేగింది. తాజాగా ఈ స్థలాన్ని చిన్నచిన్న ప్లాట్లుగా వేసి విక్రయిస్తున్నా.. రెవెన్యూ అధికారులు నోరుమెదపడం లేదు.

పిసినికాడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 362–2, 3, 4, 5, 6, 7లో 6.09 ఎకరాల డీఫారం భూమి ఉంది. అప్పట్లో స్థానికంగా పనిచేసిన వీఆర్‌ఏ ఒకరు వైకాపా నేతతో చేతులు కలిపి నకిలీ పట్టాలు సృష్టించి ఆక్రమించుకున్నారు. ఈ వివాదంపై కోర్టులో కేసులున్నాయి. తాజాగా రెండు సెంట్ల స్థలాన్ని అనకాపల్లి మండలం బీఆర్‌టీ కాలనీకి చెందిన ఓ వ్యక్తికి రూ.నాలుగు లక్షలకు విక్రయించారు. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. మరికొంత స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి పశుగ్రాసం, మామిడి చెట్లు పెంచుతున్నారు.

నాటి వీఆర్‌ఏగా ప్రస్తుతం చోడవరం మండలానికి సమీపంలోని ఓ గ్రామానికి వీఆర్‌ఓగా వ్యవహరిస్తున్నారు. ఆయన పిసినికాడలో పనిచేస్తున్న సమయంలో సర్వే నంబరు 362–3, 4లో 3.17 ఎకరాలు తన తల్లి పేరుతో మార్చుకున్నారు. స్థానికులు ఎన్ని ఫిర్యాదులు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం...**

– ఆనందరావు, తహసీల్దారు

ప్రభుత్వ స్థలం కబ్జాకు సంబంధించి ఫిర్యాదులేవీ నా దృష్టికి రాలేదు. క్షేత్రస్థాయిలో సిబ్బందితో పరిశీలన చేయిస్తాం. సర్వే చేయించి ప్రభుత్వ స్థలం ఉంటే హద్దులు నిర్ణయించి బోర్డులు ఏర్పాటు చేస్తాం. బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

## విలువైన ఆస్తులు సమర్పయామి..!

అచ్యుతాపురం : మహా విశాఖ నగరపాలక సంస్థ అధికారులు పైరవీలకు తలొగ్గి రూ.కోట్ల ఆదాయం వదిలేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల తప్పిదాలతో జీవీఎంసీ ఆస్తులు ఏళ్ల తరబడి కొంత మంది చేతుల్లో ఉండిపోతున్నాయి. ఆయా ఆస్తుల్లో వ్యాపారాలు చేసుకుని రూ.కోట్లు సంపాదిస్తున్న గుత్తేదారులు జీవీఎంసీకి పైసా కూడా చెల్లించడంలేదు. ఏళ్ల తరబడి ఈ తంతు కొనసాగుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం.

**20ఏళ్లుగా గుత్తేదారు ఆధీనంలోనే..** శీఘ్ర బస్సు రవాణా వ్యవస్థ (బీఆర్‌టీఎస్) ప్రాజెక్టులో భాగంగా పెందుర్తి, సింహాచలం ట్రాన్సిస్ట్ కారిడార్ల పేరుతో జీవీఎంసీ రహదారులను విస్తరించింది. రూ.430 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టును దక్కించుకున్న గుత్తేదారు అభ్యర్థన మేరకు 2006–07లో ముడసర్లోవ రిజర్వాయర్‌కు ఎదురుగా ఉన్న 15 ఎకరాల స్థలాన్ని ఎలాంటి అద్దె, లీజు లేకుండానే అప్పటి అధికారులు కేటాయించారు. బీటీ లేయర్ కోసం పిక్క తయారుచేయడం, రహదారి నిర్మాణానికి ఉపయోగించే యంత్రాలను అక్కడ ఉంచేవారు. ఇరవై ఏళ్లుగా గుత్తేదారు ఆధీనంలోనే ఆ స్థలం ఉంది.

**కోల్పోయిన ఆదాయం ఎంతంటే..** ఆ స్థలాన్ని అద్దెకు ఇచ్చి ఉంటే ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం నెలకు రూ.20 లక్షలు, ఏడాదికి రూ.2.40 కోట్ల ఆదాయం సమకూరేది. గత ఇరవై ఏళ్ల మార్కెట్ల విలువలను బట్టి దాదాపు రూ.30 కోట్ల రాబడిని జీవీఎంసీ కోల్పోయింది.

**మరో 5 ఎకరాలను వదిలేశారు..** కేంద్ర కారాగారానికి ఆనుకుని జీవీఎంసీకి ఐదెకరాల స్థలం ఉంది. దాన్ని 2017లో ఇసుక యార్డుకు కేటాయించారు.

# దారి దోపిడీ

కర్నూలు: కర్నూలు నగర శివారులో గత నెల 16వ తేదీన నిర్వహించిన ప్రధాని సభకు వెచ్చించి నిధుల్లో భారీగా దోపిడీ జరిగినట్లు తెలుస్తోంది. 450 ఎకరాల్లో సభ నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు చేశారు. అవసరం లేకపోయినా రోడ్లు వేశారు. వాటిలో ఎక్కడా నాణ్యత పాటించలేదు. ఆర్అండ్బీ అధికారులే రూ.18.17 కోట్లు వెచ్చించారు.

**తరలిపోతున్న వెట్‌మిక్స్**

రహదారుల నిర్మాణానికి వినియోగించిన వెట్‌మిక్స్ తవ్వేస్తున్నారు. ప్రస్తుతం క్యూబిక్ మీటర్ పరిమాణం ధర రూ.3వేల వరకు పలుకుతున్నట్లు సమాచారం. నన్నూరు టోల్‌గేటు సమీపంలో ఉన్న కొన్ని వెట్‌మిక్స్ రహదారులను తవ్వేసి కంకర మొత్తాన్ని పక్కనే కుప్పలుగా పోశారు.



**మొక్కలు మాయం...**

ఏపుగా పెరిగిన మొక్కలను తీసుకొచ్చి వందలాది మంది సిబ్బందితో నాటించారు. ఆయా మొక్కల్లో ప్రస్తుతం పదిశాతం మొక్కలు కూడా అక్కడ లేవు.

**కుంగిన మార్గం**

జాతీయ రహదారి నుంచి సభా వేదిక సమీపం వరకు నిర్మించిన నాలుగు వరుసల రహదారి కుంగింది. రహదారుల నిర్మాణంతో 'మార్గం' సుగమం అవుతుందని భావించాం.. నెలరోజులకే చెదిరిపోయాయని" స్థానికులు పేర్కొంటున్నారు.కొన్నిచోట్ల చిప్స్ పోసి వదిలేశారు.. కింద వెట్‌మిక్స్ పోయకపోవడం, తారు పోసి రోడ్డు రోలర్‌తో తొక్కించక పోవడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. లేఅవుట్‌కు చెందిన కొందరితో కుమ్మక్కై కొన్నిచోట్ల మాత్రం మంచిగా రహదారులు నిర్మించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పదుల సంఖ్యలో విద్యుత్తు స్తంభాలను వదిలేశారు.

# సుంకేసులకు గండం

కర్నూలు : రాయలసీమ తాగు, సాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకమైన సుంకేసుల జలాశయం గేట్ల లీకేజీలు ఆందోళన కలిగిస్తున్నాయి. నిత్యం 300- 400 క్యూసెక్కుల మేర వృథా అవుతోంది. గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం జలాశయాల నిర్వహణకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. దెబ్బతిన్న గేట్ల ఇనుపతాళ్లు, రబ్బరు సీళ్లను మార్చలేకపోయారు. గ్రీజు పూసేందుకు కూడా కాసుల కొరత వేధించింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టిపెట్టింది. ఇందులో భాగంగా లీకేజీలను అరికట్టేందుకు ఇంజినీర్లు చర్యలు చేపట్టారు.

**ఆగమేఘాలపై పనులు**

గేట్ల లీకేజీలను అరికట్టకపోతే 3 నెలల్లో సుంకేసుల జలాశయం ఖాళీ అయ్యే ప్రమాదముందని నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించారు. ఆగమేఘాల మీద మరమ్మతులు ప్రారంభించారు. 9 గేట్ల నుంచి నిత్యం 400 క్యూసెక్కుల వరకు నీరు వృథాగా పోతున్నట్లు తేల్చారు. ప్రస్తుతం సుంకేసులకు 3,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండటంతో లీకేజీల ద్వారా నీరుపోతున్నా జలాశయంలో 1.230 టీఎంసీల నిల్వ కొనసాగుతోంది.

కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాలు తీర్చడంలో ఈ



జలాశయం కీలకపాత్ర పోషిస్తోంది. తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేపట్టారు.

**రూ.65 లక్షలతో..**సుంకేసుల ఆనకట్టకు 30 గేట్లు ఏర్పాటు చేశారు. దాదాపు అన్నింటినుంచి నీరు లీకవుతోంది. 1, 11, 13, 14, 16, 18, 19, 26, 28 గేట్ల నుంచి భారీగా వృథా అవుతోంది. అన్ని గేట్లకు పూర్తిస్థాయిలో రబ్బర్ సీళ్లు అమర్చి ఆధునికీకరించేందుకు రూ.65 లక్షల ఎస్డీఎంఎఫ్ నిధులు వెచ్చిస్తున్నారు. తుంగభద్ర నుంచి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టడంతో స్టాప్‌లాగ్‌లు ఏర్పాటు చేసుకుని, గేట్లకు మరమ్మతులు ప్రారంభించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తిచేసి లీకేజీలను అరికడతామని కేసీ కాలువ ఈఈ ప్రతాప్ తెలిపారు.

# పల్లె ప్రగతికి బాటలు

కర్నూలు : గ్రామీణ ప్రాంతాల్లో అధ్వానంగా మారిన రహదారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పలు రోడ్ల పునర్నిర్మాణానికి నాబార్డు నిధులు విడుదల చేసింది. 2025- 26కు గాను కర్నూలు జిల్లాలో రూ.17.13 కోట్ల వ్యయంతో 13 రహదారులను 43 కి.మీ మేర పునర్నిర్మించేందుకు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. ఇప్పటికే పలుచోట్ల పనులు వేగంగా కొనసాగుతున్నాయి.

**జనవరికి పూర్తి చేయాలని..**

నాబార్డు నిధులతో చేపట్టిన రహదారుల పనుల్లో ఇప్పటికే రెండు పూర్తయ్యాయి. ఓర్వకల్లు మండలం నన్నూరు ఎస్సీకాలనీలో రూ.40 లక్షల విలువతో కి.మీ మేర ఏర్పాటు చేశారు. కృష్ణగిరి మండల పరిధిలోని వెల్దుర్తి- కోడుమూరు రోడ్డును టి.గోకులపాడు వరకు 3 కి.మీ మేర రూ.150 లక్షల వ్యయంతో నిర్మించారు.మరో 11 రహదారుల పనులు కొనసాగుతున్నాయి. వచ్చే ఏడాది జనవరి నాటికి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించి నాణ్యత విభాగం తనిఖీలు నిర్వహిస్తోంది.ఎమ్మిగనూరు నుంచి సోగనూరు వరకు రూ.2 కోట్ల వ్యయంతో 4.80 కి.మీ రహదారిని సిద్ధం చేస్తున్నారు.

కోడుమూరు నియోజకవర్గం సి.బెళగల్ నుంచి పలుకుదొడ్డి వరకు రూ.180 లక్షల వ్యయంతో 2.80 కి.మీ రహదారి నిర్మిస్తున్నారు.

ఆదోని పట్టణం నుంచి బసాపురం వరకు రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

# ఆటలో అరటి 'పండేనా'!



అనంతపురం : జిల్లాలో సాగవుతున్న ఉద్యాన పంటల్లో ముఖ్యమైంది అరటి. రైతు కష్టపడి అధిక దిగుబడులు సాధిస్తున్నా.. నాణ్యత లేక ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం 'ఉద్యాన సమగ్ర అభివృద్ధి మిషన్' (ఎంఐడీహెచ్)లో భాగంగా జిల్లాలోని అరటి ఫల సంరక్షణకు 2025-26 ఆర్థిక ఏడాదికి రూ.3.80 కోట్ల నిధులు విడుదల చేసింది. ఈ మొత్తాన్ని నాణ్యత పెంచేందుకు జిల్లా ఉద్యానవన శాఖ వెచ్చించాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. వారి పరిస్థితి, సమస్యలు ఆటలో అరటిపండు చందంగా మారాయి. ఇప్పటివరకు ఒక్క పైసా ఖర్చు చేయలేదనంటే నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో అర్థం అవుతోంది.పంట నాణ్యత లేక వ్యాపారులు కొనడం లేదు. కర్షకులు పంటను తొలగించడం లేదా పశువులు, గొర్రెలకు మేతకు వదిలేసే పరిస్థితి నెలకొంది.

**పట్టించుకోని మార్కెటింగ్ శాఖ**

విపణిలో పంట ఉత్పత్తులు కిలో రూ.8లకు పడిపోతే మార్కెటింగ్ శాఖ జోక్యం చేసుకోవాలి. గతంలో దీనిపై ప్రభుత్వం జీవో జారీ చేసింది. అధికారులు రంగంలో దిగి రైతుల నుంచి గెలలు కొనాలి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసి విక్రయించాలి. ఇదేం జరగలేదు. ధరలు పతనమైన తర్వాత కలెక్టర్ ప్రశ్నిస్తే మార్కెటింగ్, ఉద్యానవన శాఖ అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకోవడం గమనార్హం.

**ఏం జరిగింది**

ఉద్యానవన శాఖ అధికారులు ఫ్రూట్‌కేర్ కార్యక్రమంపై రైతులకు అవగాహనతో సరిపెడుతున్నారు. కనీసం ఒక్క హెక్టారులోనూ ఫల సంరక్షణ చేయలేదు.

**చేయాల్సింది ఇలా..**

ఫల సంరక్షణ కార్యక్రమం కింద 1,500 హెక్టార్లలో అరటి నాణ్యత పెంచాలనేది లక్ష్యం. రూ.3.80 కోట్ల నిధులను మొక్క నాటిన నాటి నుంచి కోత వరకు వెచ్చించాలి. ఒక్కోరైతుకు హెక్టారుకు రూ.25,500 ఇవ్వాలి. మొగ్గ తొడిగిన తర్వాత బడ్ ఇంజక్షన్ వేయాలి. 45 రోజుల తర్వాత వివిధ రకాల మందులు పిచికారీ చేయాలి. గెలలకు కవర్లు కట్టాలి. ఇవన్నీ సకాలంలో పాటిస్తే అరటి దిగుబడి పెరగడంతో పాటు గెలలు నాణ్యతగా కాస్తాయి. వ్యాపారులు కొనేందుకు పోటీ పడతారు. రైతులకు మంచి ధర దక్కుతుంది.

**ఉమ్మడి అనంతపురం జిల్లాలో..**

సాగు విస్తీర్ణం: 30,000 హెక్టార్లు (అంచనా)

హెక్టారుకు పెట్టుబడి వ్యయం: రూ.2.72 లక్షలు

దిగుబడి అంచనా: హెక్టార్‌కు 160.55 టన్నులు

ఫ్రూట్‌కేర్ అమలు చేస్తున్నాం: ఉమాదేవి, ఉప సంచాలకురాలు, ఉద్యాన శాఖ జిల్లాలో అరటి నాణ్యత పెంచేందుకు ఫ్రూట్‌కేర్ కార్యక్రమం అమలు చేస్తున్నాం. రూ.3.80 కోట్ల నిధులతో ఈ ఆర్థిక ఏడాదిలో 1500 హెక్టార్లలో అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొంత అమలు చేశాం. పూర్తిస్థాయిలో నిధులు వినియోగించేలా చర్యలు తీసుకుంటాం.

# వందకే వారసత్వ హక్కులు




చిత్తూరు : వారసత్వ వ్యవసాయ భూములకు ప్రభుత్వం ఊరటనిచ్చింది. భాగ పరిష్కారం ఒప్పందాల రిజిస్ట్రేషన్ రుసుముల విషయంలో సమూల మార్పులు తెచ్చింది. రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షల లోపు ఉంటే స్టాంపు డ్యూటీగా రూ.100 చెల్లిస్తే సరిపోతుంది. రూ.10 లక్షల పైన ఉంటే రూ.వెయ్యి చెల్లించాలి. దీంతో గత ప్రభుత్వ బాదుడు నుంచి వేలమందికి విముక్తి ఉపశమనం లభించనుంది.

**గతంలో ఇలా..**

రూ.15 లక్షల విలువచేసే ఆస్తిలో పెద్ద కుమారుడి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.10 లక్షలు, రెండో కుమారుడికి రూ.3 లక్షలు, మూడో కుమారుడికి రూ.2 లక్షల చొప్పున ఉందనుకుందాం. మిగిలిన ఇద్దరితో పోలిస్తే పెద్ద కుమారుడి ఆస్తి విలువ రూ.5 లక్షలు అధికం. దీనిపై 3 శాతం చొప్పున రూ.15 వేల స్టాంపు రుసుం, రిజిస్ట్రేషన్ రుసుం 0.5 శాతం చొప్పున రూ.2,500 కట్టాలి. మిగిలిన ఇద్దరి ఆస్తి రిజిస్ట్రేషన్ విలువ రూ.5 లక్షలపై ఒక శాతం చొప్పున రూ.5 వేలు కట్టాలి. రిజిస్ట్రేషన్ రుసుముగా రూ.వెయ్యి చెల్లించాలి. గతంలో రెండింటికీ కలిపి రూ.23,500 వరకూ ఖర్చయ్యేది.

**ప్రభుత్వ చొరవతో..**

భూమి కలిగిన పట్టాదారుల్లో చాలామంది జీవించి లేరు. అయినా ఇప్పటికీ వారి పేర్లే వెబ్‌ల్యాండ్‌లో ఉన్నాయి. వారు కాలం చేసి ఏళ్లు గడచిపోతున్నా.. ఆ భూములు ఇప్పటికీ వారసుల పేర్లతో బదిలీ కాలేదు. దీంతో వారసులకు పాసుపుస్తకాలు, బ్యాంకు రుణాలు అందడం లేదు. వారసత్వ భూముల రిజిస్ట్రేషన్ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. స్పందించిన ప్రభుత్వం వాటి రిజిస్ట్రేషన్లకు మార్గం సుగమం చేసింది.

**మృతుల పేర్లతో పట్టాలు..**భాగ పరిష్కారం ఆస్తులకు రిజిస్ట్రేషన్ బాదుడుతో చిన్న, సన్నకారు రైతులపై అధిక భారం పడేది. దీంతో చాలామంది రిజిస్ట్రేషన్లకు ఆసక్తి చూపడం లేదు. దీంతో మ్యూటేషన్ కావడం లేదు. పట్టాదారు పాసు పుస్తకాలు రావడం లేదు. వివాదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తాజాగా రుసుముల తగ్గింపుపై ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులు రైతన్నకు ఊరటనివ్వనున్నాయి.

**ఇప్పటికే మరణించి ఉంటేనే..**

తమ ఆస్తులకు వీలునామా రాయకుండా (ఇంటస్టేట్) కుటుంబ పెద్ద మరణిస్తే.. ఆయన ఆస్తుల్ని భార్య, పిల్లలు భాగ పరిష్కారం చేసుకుంటారు. ఇలాంటి కేసులకే ప్రస్తుత ఉత్తర్వులు వర్తిస్తాయి. అదీ వ్యవసాయ భూములకు మాత్రమే. జిల్లాకు సంబంధించి వెబ్‌ల్యాండ్‌లో మృతుల పేరున ఉన్న రికార్డులు: 22,800

# బరి తెగించారు.. చిన్నా!



చిత్తూరు: రాష్ట్రంలో అధికారం మారినా వైకాపా నాయకుల ఆగడాలకు అడ్డే లేకుండాపోయింది.. ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు డేగల్లా వాలిపోతున్నారు.. దీనికి కొందరు కూటమి నాయకులు సహకారం అందిస్తుండటం గమనార్హం..

పుత్తూరు–చిత్తూరు రోడ్డుకు ఆనుకుని పుత్తూరు పురపాలిక పరిధిలోని చెర్లోపల్లి రెవెన్యూ లెక్క దాఖలా సర్వే నంబరు 126/7, 126/10లో కుంట పోరంబోకు భూమి 82 సెంట్లు ఉంది. పక్కనే చిన్నరాజుకుప్పం ముస్లిం, ఎస్టీ కాలనీలు ఉన్నాయి. ఈ స్థలం వెనక చిన్నరాజుకుప్పానికి చెందిన ఓ వైకాపా నాయకుడి కుటుంబ భూములు ఉన్నాయి. రూ.కోట్ల విలువజేసే సదరు భూములను తిరుపతి, పుత్తూరు చెందిన ఇద్దరు రియల్టర్లకు ఇటీవల రిజిస్ట్రేషన్ చేశారు.

**అడ్డం తిరిగిన కథ..**

భూమిలోకి వెళ్లేందుకు దారి లేకపోవడంపై సదరు రియల్టర్లు ప్రశ్నించడంతో వైకాపా నేత ముందున్న కుంట పోరంబోకు మీదుగా దారి వేసేందుకు యత్నించగా అక్కడి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. పలుమార్లు అడ్డుకున్నారు. దీంతో రియల్టర్లు వైకాపా నాయకుడికి ఇవ్వాల్సిన భారీ నగదును నిలిపేశారు.

**సర్దుబాటు చేశారిలా..!**

భూమి కొనుగోలు చేసిన వ్యక్తులు నియోజకవర్గంలోని 'చిన్న' నేతను ఆశ్రయించగా ఆయన వైకాపా నేతలతో కలిసి ముస్లింకాలనీ వాసుల్లో కొందరిని పిలిచి మాట్లాడారు. వారిని నయానా భయానా ఒప్పించి వెంటనే కొంత మొత్తాన్ని వారికి, సమస్య పరిష్కరించినందుకు సదరు 'చిన్న' నేతకు పెద్ద మొత్తంలో ఆ రియల్టర్లు నగదు ముట్టజెప్పినట్లు సమాచారం. తదనంతరం పనులు చకచకా మొదలై కుంట భూమిలో రోడ్డు నిర్మాణం పూర్తయింది. కబ్జా చేసిన భూమి విలువ రూ.కోటి పైమాటే. పుత్తూరు–చిత్తూరు ప్రధాన రహదారిలో విలువైన కుంట పోరంబోకు స్థలాన్ని దర్జాగా ఆక్రమించి రోడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు మిన్నకుండిపోవడం పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. 'చిన్న' నేత హుకుం జారీచేయడంతోనే వారు 'మౌనం' దాల్చారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

# లెక్క తేలుతోంది..

అనకాపల్లి : ఉపాధి హామీ పథకంలో బినామీ మస్తర్లకు చెక్ పెట్టేలా ప్రభుత్వం చేపట్టిన ఈ కేవైసీ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఇందులో పనులకు వచ్చే వారి, రానివారి లెక్క తేలుతోంది. త్వరలోనే వీరికి ముఖ ఆధా రిత హాజరు అమలు చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపడుతోంది.ఉపాధి హామీలో ఎక్కువగా బినామీ మస్తర్ల ద్వారా తేడాలు జరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అందుకే వేతనదారులందరికీ ముఖ ఆధారిత హాజరు వేయడానికి వీలుగా నేషనల్ మస్తర్ మానిటరింగ్ సిస్టం (ఎన్.ఎం.ఎం.ఎస్.) యాప్ ద్వారా ఈ-కేవైసీ చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో అక్టోబరులో ప్రారంభించారు. 85 శాతం వరకు పూర్తి చేశారు. మరోవైపు కొత్త జాబ్ కార్డులు కావల్సినవారి నుంచి వేల సంఖ్యలోనే దరఖాస్తులు వచ్చాయి.

ఈ-కేవైసీ నమోదుతో జిల్లాలో దాదాపు 31,467 బోగస్ జాబ్ కార్డులు



వెలుగులోకి వచ్చాయి. వీటిని రద్దు చేశారు. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది.

**అనుసంధానమైన వారికే ఉపాధి**

ప్రస్తుతం జరుగుతున్న సర్వే త్వరితంగా పూర్తి చేసేలా చూస్తున్నాం. ఇప్పటికే 85 శాతం చేశారు. గ్రామసభల్లో వేతనదారుల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం ఈ-కేవైసీ అనుసంధానం జరిగిన వారే పనులకు వస్తున్నారు. దీంతోపాటు నూతన జాబ్ కార్డులను త్వరితగతిన మంజూరు చేయిస్తున్నాం.

# చలికాలం.. జాగ్రత్త చిన్నా

అనకాపల్లి : రావికమతం మండలం తోటకూరపాలెంకి చెందిన 11 ఏళ్ల చిన్నారికి చర్మంపై దద్దుర్లు వచ్చాయి. మందుల దుకాణాల్లో ఆయింట్‌మెంట్ కొని వాడారు. తగ్గకపోగా మరింత పెరిగాయి. అనకాపల్లి ఆసుపత్రికి తీసుకొస్తే చర్మం పొడిబారిన కారణంగా ఈ పరిస్థితి ఏర్పడిందని గుర్తించారు.అచ్యుతాపురానికి చెందిన తొమ్మిదేళ్ల బాలుడికి దగ్గు మొదలైంది. దీనిని నిర్లక్ష్యంగా చేయడంతో ఇది కాస్తా ఆయాసంగా మారి ఊపిరి పీల్చుకోవడం కష్టమైంది.

జిల్లావ్యాప్తంగా చలి పెరిగింది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ కాలంలో చర్మం పొడిబారడం ఎక్కువగా ఉంటుంది. చిన్నారుల్లో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని, నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని చిన్నపిల్లల వైద్యులు చెపుతున్నారు. కానీ గ్రామీణ ప్రాంత ప్రజలు చర్మ సంబంధిత వ్యాధులపై నిర్లక్ష్యం వహిస్తున్నారు. పరిస్థితి తీవ్రమయ్యాక కానీ ఆసుపత్రికి తీసుకురావడం లేదు. దీనివల్ల చిన్న వయస్సులోనే చర్మసంబంధిత వ్యాధులు వస్తున్నాయి. చలికితోడు పెరుగుతున్న కాలుష్యం వల్ల చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నాయి. దగ్గు, ఆయాసం, శ్వాస తీసుకోడానికి ఇబ్బంది పడుతూ చికిత్స కోసం ఆసుపత్రి వచ్చే చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఆదిలోనే తగిన చికిత్స చేయించుకుంటే ఎలాంటి సమస్యా ఉండదని వైద్యులు చెబుతున్నారు.

అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి రోజుకు 30 నుంచి 40 మంది వరకు చిన్నారులు చర్మసంబంధిత వ్యాధులతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. దగ్గు, శ్వాసకోశ సమస్యలతో వస్తున్న వారి సంఖ్య 15 నుంచి 20 వరకు ఉంటోంది.

**ఆధునిక సేవలు అందుబాటులో..**

చిన్నారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రిలో వసతులు కల్పించారు. నలుగురు చిన్నపిల్లల వైద్య నిపుణులతో ఇక్కడ చికిత్స అందిస్తున్నారు. అప్పుడే పుట్టిన చంటిబిడ్డల నుంచి టీనేజ్ వరకు బాలల వరకు చికిత్స నిమిత్తం అవసరమైన పరికరాలు సమకూర్చారు. చిన్నపిల్లలకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తున్నారు.

**నిర్లక్ష్యం చేయొద్దు**

చలికాలంలో పిల్లలకు చర్మ, శ్వాసకోశ వ్యాధులు ఎక్కువగా వస్తాయి. నిర్లక్ష్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని వసతులున్నాయి. డాక్టర్ వెంకటేశ్

# అమ్మలేం.. అనుభవించలేం

తాడేపల్లిగూడెం : డెల్టాలో రహదారి పక్కన సారవంతమైన భూములున్నాయి. కానీ.. అన్నదాత అవసరానికి ఉపయోగపడటం లేదు. గత వైకాపా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేలో 30వేల ఎకరాల భూములు నిషేధిత జాబితాలోకి వెళ్లడంతో వారసులకు బదిలీ చేయలేక, ఆర్థిక అవసరాలకు అమ్ముకోలేక ఆర్థికంగా, మానసికంగా నలిగిపోతున్నారు. తమ భూములను క్రమబద్ధీకరించాలని కోరుతూ వెళ్లని కార్యాలయం లేదు.. కలవని అధికారి లేరు. మొగల్తూరులో 722/1ఏ1 సర్వే నంబరు పరిధిలో సుమారు 98 ఎకరాలకు 25 సెంట్లు మాత్రమే ప్రభుత్వ భూమి కాగా మిగిలినది నిషేధిత జాబితాలో చేర్చారు. భీమవరం మండలం రాయలంలో 14/1లో 23 ఎకరాలు, 49/2లో 85 సెంట్లు, 51/2లో ఎకరంన్నర నిషేధిత జాబితాలోకి వెళ్లిపోయాయి.

**ఏలూరులో గ్రీవెన్స్**

కూటమి సర్కారు చేపట్టిన రెవెన్యూ సదస్సుల్లో ఉమ్మడి జిల్లాలో సుమారు 18 వేల ఫిర్యాదులొచ్చాయి. వాటిలో తమ భూములు నిషేధిత జాబితాలో చేర్చారని సుమారు 300 వరకు ఉన్నాయి. ఇదిగో అదిగో అంటూ అధికారులు చెప్పడమే గానీ ఇచ్చిన అర్జీలకు పరిష్కారం దొరకలేదు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో భూ సమస్యల పరిష్కారానికి డిసెంబరు 16న గ్రీవెన్స్ ఏర్పాటు చేసి అర్జీలు స్వీకరిస్తున్నారు. ఇలాంటి గ్రీవెన్స్‌ను పశ్చిమగోదావరి జిల్లాలోనూ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఎటూ ఉపయోగపడక..** రెవెన్యూ రికార్డుల్లో పట్టాభూములుగా నమోదై క్రయవిక్రయాలు జరిగిన భూములను సైతం 22ఏలో చేర్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలున్నా ఆన్‌లైన్‌లో మాత్రం నిషేధిత జాబితాలో చూపిస్తున్నాయి. వైద్య అవసరాలతో పాటు పిల్లల విద్య, వివాహ, ఇతర అవసరాలకు క్రయవిక్రయాలు చేసే వీల్లేక రైతులు అప్పుల పాలవుతున్నారు. ముఖ్యంగా గతంలో ఆ భూములను కొనుగోలు చేసిన రైతులు విక్రయించిన వారిపై గొడవలకు దిగుతున్నారు. మూడేళ్ల కిందట క్రయవిక్రయాలు జరిగిన భూమికి ఇటీవల మొగల్తూరులో ఇద్దరి రైతుల మధ్య తగాదా చోటుచేసుకుంది. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని డీఆర్వో నారాయణరెడ్డి తెలిపారు.

## 'జీవీఎంసీ'లో విలీనానికి సమ్మతమేనా?!

భీమిలి : రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో పంచాయతీలను విలీనం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేలోపు ఆ ప్రక్రియ పూర్తి చేయాలని పేర్కొంది. భీమిలిలో మూడు మండలాలకు సంబంధించి 64 పంచాయతీలను జీవీఎంసీలో విలీనం చేసేందుకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఇప్పటికే అక్కడి నాయకులతో చర్చించారు. స్థానిక పాలకుల అనుమతితో ప్రక్రియ పూర్తయితే ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. విలీనమైతే 98 వార్డులతో విస్తరించిన ఉన్న జీవీఎంసీ పరిధి మారుతుంది. మళ్లీ వార్డుల విభజన ప్రక్రియ చేపట్టాల్సి ఉంటుంది.

**అభివృద్ధి జరిగేనా..?**

భీమిలి, అనకాపల్లి పరిధికి చెందిన కాపులుప్పాడ, చేపలుప్పాడ, నిడిగట్టు, నగరంపాలెం, జేవీ అగ్రహారం, తాడి, వల్లూరు, తల్లపువాని పాలెం, రాజుపాలెం విలీనం తర్వాత గ్రేటర్ విస్తీర్ణం 535 చదరపు కిలోమీటర్ల నుంచి 640 చదరపు కిలోమీటర్లకు పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో ఇప్పటికీ గ్రామీణ వాతావరణమే కనిపిస్తుంది.

ఇప్పుడు మళ్లీ మరో 64 పంచాయతీలను విలీనం చేస్తే.. నగర విస్తీర్ణం పెరుగుతుందే తప్ప, ప్రజల జీవనం విధానంలో మార్పులు ఆశించొచ్చా



అనే చర్చ కూడా సాగుతోంది.

భీమిలి, ఆనందపురం, పద్మనాభం మండలాల్లో పంచాయతీల విలీనం అంశం ఇంకా తమ దృష్టికి రాలేదని జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారి ప్రభాకరరావు తెలిపారు.

**గతంలో ఇలా..** 2012లో పాలకవర్గం కాలపరిమితి తర్వాత భీమిలి, అనకాపల్లికి చెందిన పది పంచాయతీలను విలీనం చేయడానికి ప్రతిపాదించారు. ఆయా పంచాయతీల నాయకులు హైకోర్టును ఆశ్రయించారు. ఏళ్ల పాటు కేసులు పరిష్కారం కాలేదు. ఆ తర్వాత విలీన ప్రక్రియ పూర్తి చేసి, 2020లో జీవీఎంసీ ఎన్నికలు నిర్వహించారు. 2005లో గాజువాకతో పాటు, పలు పంచాయతీలను విలీనం చేశారు. ఇప్పటికీ ఆయా ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో రహదారుల నిర్మాణం లేదు. తాగునీరు, వీధి దీపాలు, కాలువలు వంటి వసతులు అరకొరగానే ఉన్నాయి.

## కొత్త పంచాయితీలిస్తున్నారహో..

నక్కపల్లి : గ్రామాల అభివృద్ధిలో పంచాయతీలే కీలకం. ప్రస్తుతం మరిన్ని పంచాయతీల ఏర్పాటుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయిదేళ్ల కిందట ఏర్పాటు చేసిన నూతన పంచాయతీలకు తోడు ఇప్పుడు మరిన్ని ఏర్పాటయ్యే అవకాశం ఉంది. ఉమ్మడి విశాఖగా ఉన్న సమయంలో 2020లో నూతన పంచాయతీల ఏర్పాటు జరిగింది. ఈ క్రమంలో 50 గ్రామాలు ఏర్పాటు కాగా, ఒక్క అనకాపల్లి జిల్లాలోనే 49 ఉన్నాయి. ఇందులో చీడిక, ఆవరాజాం, గొర్లి ధర్మవరం, చినమదీనా, సీతయ్యపేట, కంతారం, రామన్నపాలెం, చామంతిపురం, మామిడిపాలెం, మూలపేట, రామగిరి, దుగ్గాడ, మెట్టపాలెం, సుందరకోట, తిక్కవానిపాలెం, వెంకటాపురం, కె.కోట్నిబిల్లి, రొంగలపాలెం, ములకాపల్లి తదితర అప్పట్లో ఏర్పాటైనవే. ఇందులో ఒకట్రెండు మినహా మిగిలిన వాటన్నింటికి ఎన్నికలూ జరిగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తాజాగా నూతన పంచాయతీలు, ఇతరత్రా సవరణలకు ప్రభుత్వం సుముఖత తెలుపుతూ వీటిపై ఉన్న నిషేధాన్ని ప్రస్తుతం సడలించింది.

ప్రభుత్వం చేసిన సడలింపు ద్వారా పంచాయతీని రెండు పంచాయతీలుగా మార్పు చేయడం, రెండు పంచాయతీలను ఒకేదానిగా మార్పు, ఒక పంచాయతీలో గ్రామాన్ని మరో పంచాయతీలోకి విలీనం చేయడం, సమీపంలోని పుర, నగరపాలక సంస్థల్లోకి చేర్చడం వరకు అవకాశం ఉంటుంది. ఓ పంచాయతీని మరో మండలంలోకి విలీనం చేసే సౌలభ్యం మాత్రం లేదు.

జిల్లాలో ప్రస్తుతం నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి బోయపాడు, పెదతీనార్ల నుంచి దొండవాక, వి.మాడుగుల మండలం పోతనపూడి అగ్రహారం నుంచి కొండయ్యపాలెం, కోటవురట్ల మండలం కొత్త తంగేడు నుంచి పాత తంగేడు, రాంబిల్లి మండలం గోకివాడ నుంచి మూలకొత్తూరును విభజించి పంచాయతీ చేయాలనే ప్రతిపాదనలు స్థానికుల నుంచి వచ్చాయి. ఇలా జిల్లాలో 40 వరకు ఉంటాయని అంచనా. మరోవైపు దేవరాపల్లి మండలం కొత్తపెంట పంచాయతీని



కె.కోటపాడు మండలంలోకి విలీనం చేయాలనే డిమాండ్ ఉంది.

పంచాయతీ ఏర్పాటు కావాలంటే గ్రామంలో జనాభా, వనరులు, ప్రస్తుత పంచాయతీకి..ప్రతిపాదిత గ్రామానికి మధ్య దూరం, రెవెన్యూ సర్వే నంబర్ల విభజన తదితర వాటిని పరిగణనలోకి తీసుకుంటారు. గ్రామాల విలీనం, విభజనకు సంబంధించి పంచాయతీల్లో పాలకవర్గం తీర్మానం చేయాలి. పాలకవర్గం లేని చోట్ల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో ప్రక్రియ జరుగుతుంది.

**ప్రస్తుతం జిల్లా స్వరూపం**

మొత్తం పంచాయతీలు : 646

ప్రత్యేకాధికారి పాలనలో ఉన్నవి: మూడు (చీడిక, ఎం.చింతువ, అప్పారాయుడుపాలెం)

మేజర్ పంచాయతీలు : 48

జనాభా : 14,94,947

**ఆదేశాలు రాగానే అమలు**

ప్రభుత్వం పంచాయతీల్లో మార్పులు, చేర్పులకు సంబంధించి నిషేధం ఎత్తివేయడం ద్వారా నూతన ప్రతిపాదనలకు మార్గం సుగమం అవుతుంది. ఇందుకు సంబంధించి పూర్తిస్థాయిలో ఆదేశాలు రాగానే, ప్రతిపాదనలను కలెక్టర్ ద్వారా కమిషనర్‌కు పంపిస్తాం. అక్కడ ఆమోదం పొందుతాయి. ఈ ప్రక్రియ పూర్తయ్యే క్రమంలో గ్రామసభలు పెట్టి, తీర్మానాలు, అభ్యంతరాలు స్వీకరిస్తారు.

సందీప్, జిల్లా పంచాయతీ అధికారి

## గుట్టలనూ వదలడం లేదు..




పుత్తూరు : భూముల ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి.. ఈ నేపథ్యంలో అక్రమార్కుల కన్ను కొండలు, గుట్టలపై పడింది.. ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ గద్దల్లా వాలిపోతున్నారు.. సెలవు రోజులైతే చాలా జేసీబీలు పెట్టి చదును చేస్తున్నారు.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోంది.

పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లి రెవెన్యూ పరిధిలోని చిన్నరాజుకుప్పం దళితవాడకు చెందిన వైకాపా నాయకులు, ఓ కూటమి కార్యకర్తతో కలిసి 15 రోజుల క్రితం గ్రామ సమీప పుత్తూరు-చిత్తూరు రోడ్డుకు కూతవేటు దూరంలోని గుట్టను జేసీబీతో చదును చేశారు. ఈ విషయాన్ని స్థానికులు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సిబ్బందితో వెళ్లి పనులు నిలిపివేయించారు. శని, ఆదివారాలు సెలవు కావడంతో మళ్లీ ఆ భూమిని అక్రమార్కులు దర్జాగా చదును చేశారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. గతంలో పనులు చేసిన సమయంలోనే వారిపై కేసులు పెట్టి ఉంటే మళ్లీ ఆక్రమణకు పాల్పడేవారు కాదు. చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. చెర్లోపల్లి రెవెన్యూలో ఇప్పటికే ఐదెకరాల మేర చదును చేశారు. పశువులు మేపుకోవడానికి గుట్ట లేకుండా చదును చేస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ఆ భూమిలోకి ప్రవేశిస్తే కఠిన చర్యలు..**

గుట్టభూమిని చదును చేసిన వారిని ఇప్పటికే పిలిచి హెచ్చరించాం. ఆదివారం కావడంతో జేసీబీతో చదును చేశారని తెలిసింది. తనకు తెలియగానే పోలీసులకు సమాచారం ఇచ్చా. అప్పటికే జేసీబీతో పాటు వెళ్లిపోయారు. చదును చేసిన భూమిలోకి ఎవరైనా ప్రవేశిస్తే చర్యలు తీసుకుంటా వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

## గుదిబండలా.. 'యూజీడీ'..!



గాజువాక : మహా విశాఖ నగరపాలక సంస్థ జీవీఎస్‌సీసీఎల్ (గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటి కార్పొరేషన్ లిమిటెడ్) ద్వారా పెందుర్తి, గాజువాకలో చేపట్టిన యూజీడీ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి. గుత్తేదారు సంస్థ చేతులెత్తేయడంతో ఇప్పటి వరకు చేసిన పనులకు జీవీఎంసీ నిధులు చెల్లించేలా చర్యలు చేపట్టింది. మిగతా పనులకు తిరిగి ప్రతిపాదనలు పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

తప్పని ఇక్కట్లు: రెండు ప్రాంతాల్లో యూజీడీ పనులకు టెండర్లు పూర్తయి, పనులు పూర్తయ్యే సరికి మరో ఐదేళ్లు పట్టే అవకాశాలున్నాయి. అప్పటి వరకు అసంపూర్తి పనులతో ప్రజలకు ఇక్కట్లు తప్పేలా లేవు

రెండుసార్లు గడువు పెంపు: తొమ్మిదేళ్ల క్రితం నగర పరిధిలోని పెందుర్తి, గాజువాక ప్రాంతాలలో యూజీడీ (భూగర్భ మురుగు వ్యవస్థ) ప్రాజెక్టు చేపట్టడానికి రూ.720 కోట్లతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. స్మార్ట్ సిటీ నిధులు రూ.100 కోట్లు, మిగతా జీవీఎంసీ సాధారణ నిధులు వెచ్చించాలని నిర్ణయించారు. సకాలంలో నిధులు సమకూరకపోవడంతోపాటు కొవిడ్ కారణంగా గుత్త సంస్థ ఆయా పనులను సకాలంలో పూర్తి చేయలేకపోయింది. దీంతో ఇప్పటి వరకు రెండుసార్లు గడువు పొడిగించారు.

**జరిగిన పనులు ఇలా..**

పెందుర్తిలో పైపులైన్లు 226 కి.మీ.గాను 210 కి.మీ., మ్యాన్‌హోళు 8048గాను 7328, రహదారి పునరుద్ధరణ 226 కి.మీ. గాను 190 కి.మీ. పూర్తి చేశారు.

గాజువాకలో పైపులైన్లు 429 కి.మీ. గాను 170 కి.మీ., 19,638 మ్యాన్‌హోళ్లకు గాను 5289, రహదారి పునరుద్ధరణ 129 కి.మీ.గాను 88కి.మీ. పూర్తి చేశారు.

ఆ ధరలతో చేయలేం: పెందుర్తిలో రూ.309.94 కోట్లు, గాజువాకలో రూ.411 కోట్లు వ్యయం చేయడానికి ప్రారంభంలో నిర్ణయించగా, పెరిగిన ధరలతో ప్రస్తుతం పనులు చేయలేమని గుత్తేదారు లేఖ సమర్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తాజాగా పెందుర్తిలో పనులు పూర్తి చేయడానికి రూ.250 కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. గాజవాక ప్రాంతానికి ఇంకా ప్రతిపాదనలు తయారు చేస్తున్నామ'ని ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీరు ఏడుకొండలు తెలిపారు.

## ఉందిగా.. పురమిత్ర

ఎలమంచిలి :నా వయస్సు 80 సంవత్సరాలు.. ఇంటి ముందు కాలువలు శుభ్రం చేయక భరించరాని దుర్గంధం. దోమల మోత, నడవలేని స్థితిలో ఉన్నా! విశ్రాంత ఉద్యోగైన నేను మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయలేని పరిస్థితి. పురమిత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కాలువ సమస్యపై ఫిర్యాదు చేశా. మరుసటి రోజే మున్సిపల్ సిబ్బంది వచ్చి కాలువ శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లి వెళ్లారు.

వి.లక్ష్మి, ఎలమంచిలి

ప్రజలు ఇంటి నుంచే వారి సమస్యలు పరిష్కరించుకోవడం కోసం ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. జిల్లాలోని ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల్లో గత నెలరోజులుగా ఈ యాప్‌పై ప్రచారం చేస్తున్నారు. డౌన్‌లోడ్ చేసుకోవడం తెలియని వారికి సచివాయం సిబ్బంది స్వయంగా అవగాహన కల్పిస్తున్నారు.

పురప్రజలు తమ సమస్యల పరిష్కారానికి కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు. ఫోన్ చేసి సిబ్బందిని బతిమలాడుకోవాల్సిన పనిలేదు.

ప్లేస్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేసి యాప్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. ఓపెన్ చేస్తే ఫోన్ నంబర్ అడుగుతుంది. ఎంటర్ చేసి సబ్మిట్ చేయగానే ఓటీపీ వస్తుంది.

మన చుట్టూ ఉన్న సమస్యలను ఫొటో తీసి యాప్‌లో పంపించవచ్చు. వాయిస్ రికార్డింగ్ ద్వారా సమస్యను చెప్పుకోవచ్చు. ఫిర్యాదుపై పురోగతిని ట్రాక్ ద్వారా తెలుసుకునే వీలుంది. ఇందులో 8 విభాగాలకు చెందిన 119 నుంచి 150 వరకూ పౌరసేవలు అందుబాటులో ఉన్నాయి. రెండు మున్సిపాల్టీల్లో కలిపి ఇప్పటివరకూ 14,767 మంది ఈయాప్ వాడుతున్నారు.

**3 నుంచి 30 రోజుల్లో..**

సమస్య తీవ్రతను బట్టి 3 నుంచి 30 రోజుల్లోగా పరిష్కరిస్తారు. సమస్య నేరుగా సంబంధిత శాఖకు చేరుతుంది. ఆ అధికారి స్పందించకపోతే ఉన్నతాధికారికి ఫిర్యాదు వెళ్లి స్పందించని అధికారిని బాధ్యుడిని చేస్తుంది. తెలుగు భాషలోనూ యాప్ అందుబాటులో ఉంది.

అందేసేవలు : ప్రజారోగ్యం, రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, అకౌంట్స్, జనన మరణ, వివాహ ధ్రువపత్రాలు, తాగునీటి సమస్య, చెత్తసేకరణ, కాలువలు, వీధి దీపాల నిర్వహణ, భవన నిర్మాణాలకు అనుమతులు వంటి సేవలను అందిస్తుంది.

**కార్యాలయానికి వచ్చే పనిలేదు**

సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే పనిలేదు. యాప్ ద్వారా ఫిర్యాదు చేయడం వల్ల జవాబుదారీతనం పెరిగి సిబ్బంది తొందరగా పరిష్కరిస్తారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

ప్రసాదరాజు, కమిషనర్, ఎలమంచిలి మున్సిపాలిటీ

## దస్తూరి.. భవితకు దారి

నర్సీపట్నం : పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణత సాధించడంపైనే ఇప్పుడు అందరి దృష్టి. పరీక్షల్లో విద్యార్థుల చేతిరాత కీలక పాత్ర పోషించనుంది. విద్యా శాఖ కమిషనర్ ఆదేశాలతో ఉపాధ్యాయులు దస్తూరి మెరుగుపడేలా విద్యార్థులతో సాధన చేయిస్తున్నారు. 'రాత బాగుంటే.. గీత బాగుంటుంది' అన్నది నానుడి. అక్షరాలను ముత్యాల్లా రాస్తే టాపర్లుగా నిలవవచ్చు. పదో తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16 నుంచి ప్రారంభంకానున్నాయి. విద్యార్థులకు ఇప్పటికే వంద రోజుల విద్యా ప్రణాళిక అమలవుతోంది. జిల్లా వ్యాప్తంగా 405 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 18,500 మంది విద్యార్థులు పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. దిద్దుళ్లు, కొట్టివేతలు లేకుండా చక్కని దస్తూరితో సమాధానాలు రాయడంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతోపాటు సాధన చేయిస్తున్నారు.

ఇలా చేయండి..ఇటుకలు పేర్చినట్లు అక్షరాలు అందంగా ఉండేందుకు కొన్ని చిట్కాలు పాటించాలని నర్సీపట్నం ఎంఈవో తలుపులు సూచిస్తున్నారు. చూడగానే ఆకట్టుకునేలా, ఒక క్రమపద్ధతిలో గుండ్రని అక్షరాలతో సమాధానాలు రాయాలి. గీతలు లేని కాగితంలోనూ వరుస తప్పకుండా రాయడం అలవాటు చేసుకోవాలి. ఒకదానికొకటి అంటుకోకుండా ప్రతి అక్షరం ఒకే పరిమాణంలో ఉండాలి. రెండు పదాల మధ్య '0' పట్టేంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి. ఉపాధ్యాయుల సలహాలను పాటిస్తూ సాధన చేస్తే చక్కని దస్తూరి సొంతమవుతుంది.

## స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్

కర్నూలు : నగరాలు, పట్టణాల్లో పెరుగుతున్న జనాభాతో పాటు డంపింగ్ యార్డుల్లో వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. వివిధ చోట్ల కొన్ని వస్తువులను రీసైక్లింగ్ చేస్తున్నా.. వ్యర్థాలన్నీ కలిసిపోయి ఉండటంతో వేరుచేయడం కష్టమవుతోంది. దీనికి పరిష్కారంగా కర్నూలుకు చెందిన జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఏఐ డస్ట్‌బిన్ రూపొందించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఇందులో వేయగానే ఆ రెండింటిని వేరుచేస్తోంది. సీఎస్ఎం చదువుతున్న ఎన్.హర్షవర్ధన్, ఎం.భరణికుమార్‌రెడ్డి, పి.లహరి కలిసి దీన్ని తయారుచేశారు. ఇందుకోసం ఎరుపు రంగు, ఆకుపచ్చ రంగు గల రెండు చెత్తబుట్టలను తీసుకొన్నారు. దీనికి సెన్సార్‌తో కూడిన



ఆర్డినో అండ్ స్టెప్పర్ మోటారు అమర్చారు. చెత్తబుట్టలపైన వస్తువులను ఉంచేందుకు వీలుగా ఓ అట్టముక్కను ఏర్పాటు చేశారు. ఆపైన ఓ ఇనుప కడ్డీకి ఈఎస్‌పీ32-సీఎంఏ కెమెరా బిగించారు. రీసైక్లింగ్, నాన్ రీసైక్లింగ్‌కు సంబంధించిన 88 రకాల వస్తువులను గుర్తించేందుకు వీలుగా వాటి చిత్రాలను ముందుగానే అందులో నిక్షిప్తం చేశారు. వివిధ రకాల వస్తువులను అట్టముక్కపై ఉంచగానే సెన్సార్ సాయంతో వాటిని గుర్తిస్తోంది. రీసైక్లింగ్ చేసే వస్తువులను ఆకుపచ్చ రంగు చెత్తబుట్టలో, నాన్ రీసైక్లింగ్ వస్తువులను ఎరుపు రంగు చెత్తబుట్టలో వేస్తోంది. ఇందుకు అనుగుణంగా మోటారు ఎడమ, కుడివైపు సులువుగా తిరుగుతోంది. దీన్ని ప్రయోగాత్మకంగా పరీక్షించగా విజయవంతమైంది. తమిళనాడులోని చెంగల్పట్టులో సెప్టెంబరు 4న ఇన్ఫోసిస్-పాల్స్ టెక్ జూకా హ్యాకథాన్-2025లో నిర్వహించిన ప్రదర్శనలో జాతీయస్థాయిలో రెండో బహుమతి సాధించింది. నమూనా రూపొందించగా.. పూర్తిస్థాయిలో తయారీకి కసరత్తులు చేస్తున్నారు.

## గుట్ట దిగని మైలు'రాయి'

నంద్యాల : నిధులున్నా 'దారి'న పడటం లేదు. ఈ-పాస్ విధానంతో ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల రహదారులు, వంతెనల నిర్మాణాలు ఆగిపోయాయి. రోడ్డు, వంతెనలకు సంబంధించి నంద్యాల జిల్లాలో 27 పనులు(రూ.663 కోట్లు), కర్నూలులో 11 పనులు(రూ.523 కోట్లు) చేపట్టాల్సి ఉంది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. వీటి నిర్మాణానికి అవసరమైన కంకరను గతంలో నేరుగా క్వారీలు, గనుల నుంచి సేకరించేవారు. ప్రస్తుతం తీసుకొచ్చిన ఈ-పాస్ విధానంతో గుత్తే'దారి' కదలడం లేదు.

**అన్నింటికీ ఆటంకం**

కొత్తగా తీసుకొచ్చిన ఈ-పాస్ విధానం పలు అభివృద్ధి పనులపై ప్రభావం చూపుతోంది. కేంద్ర రహదారుల పనులు, కోర్‌నెట్ ప్లాన్, ఆర్ఐడీఎఫ్, మేజర్ జిల్లా రహదారులు, ఎన్‌డీబీ పనులు, భవన నిర్మాణాలు, నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఫేజ్-2, బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్ నిర్మాణ పనులు ఫేజ్-1, ఫేజ్-2, జీవో నంబరు 350, 151 కింద మంజూరైనా ప్రధాన జిల్లా, రాష్ట్ర రహదారులు, నాబార్డు, ఎండీఆర్ పనులు ఉన్నాయి.

నంద్యాల నియోజకవర్గం పరిధిలో ఆరు, మంత్రాలయంలో మూడు, ఆలూరులో నాలుగు, పత్తికొండలో ఆరు, కోడుమూరు నియోజకవర్గం పరిధిలో రెండు చోట్ల రహదారి పనులు ప్రారంభమే కాలేదు.

**ఈపాస్ కష్టాలు** రహదారి, వంతెన తదితర నిర్మాణాలకు అవసరమైన మెటల్, గ్రావెల్, కంకర తదితరాల కోసం ముందుగా ఆర్అండ్‌బీ హెచ్‌వోడీ వర్క్ ఆర్డర్ ఇవ్వాలి. ఇందుకు తగ్గ అంచనాలు పేర్కొనాలి. ఆ దస్త్రం శాఖకు చేరుతుంది. అప్పుడు సీనరేజ్ పుస్తకం ఇస్తారు. ఆ వివరాలు తిరిగి ఆర్అండ్‌బీకి చేరుతాయి.

కంకర, గ్రావెల్ తదితర సామగ్రికి సంబంధించిన చలానాను 'ఆన్‌లైన్'లో చెల్లించాలి. అప్పుడు గనుల శాఖ సీనరేజ్ 'ఈ-పాస్' బిల్లు జారీ చేస్తుంది. దాని ప్రకారం రోడ్డు నిర్మాణ సామగ్రిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. ఇదంతా జరగడానికి నెలల తరబడి పట్టే అవకాశం ఉంది.

వీటిపై తీవ్ర ప్రభావం

కర్నూలు జిల్లాలో ఎండీఆర్ పథకం కింద 13 పనులు మంజూరయ్యాయి. 2 మాత్రమే పూర్తయ్యాయి. నంద్యాల జిల్లాలో ఆత్మకూరు షాదీఖానాకు డిపాజిట్ వర్క్స్ బిల్డింగ్ కింద నిధులు మంజూరు కాగా కొత్త నిబంధనలతో పనులు ముందుకు సాగడం లేదు.

కర్నూలులో రూ.15 కోట్ల వ్యయంతో నిర్మించనున్న న్యాయస్థానాల భవనాలపై ప్రభావం చూపాయి. ఉమ్మడి జిల్లాలో ఇటీవల జీవో నంబరు 350 కింద 42 సీడీ పనులు మంజూరయ్యాయి. రూ.40 కోట్లతో చేపట్టాల్సిన ఈ పనులు ఒక్కటీ ప్రారంభం కాలేదు.

## తేనె తోట.. ఉపాధి బాట

నందికొట్కూరు : ఆత్మకూరు, పాములపాడు, జూపాడుబంగ్లా, మిడుతూరు మండలాల పరిధిల్లోని పంట పొలాల పక్కన ఎక్కువగా తేనెటీగల బాక్సులు కనిపిస్తాయి. గుంటూరు, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు చెందిన యువకులు వచ్చి, ఇక్కడ తేనె ఉత్పత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నారు.

ఏటా నవంబరు నుంచి జనవరి వరకు ఎక్కువగా తేనె బాక్సులు ఏర్పాటు చేస్తుంటారు. ఆ సమయంలో చుట్టుపక్కల పంటల్లోని పుష్పాల మకరందాన్ని తేనెటీగలు తీసుకొచ్చి బాక్సుల్లో ఉన్న ప్లేట్లకు తెట్టను ఏర్పాటు చేసుకొని సంతతితోపాటు తేనెను ఉత్పత్తి చేస్తాయి.

ఒక బాక్సు నుంచి ఐదు కిలోలు తేనెటీగల ఫారం పెట్టేవారు రూ.4,600 వెచ్చించి ఒక్కొక్క బాక్సు కొనుగోలు చేయాలి. గుంటూరు, హైదరాబాద్‌లలో ఉన్న ఉత్పత్తి కేంద్రాల నుంచి రెండు వేల ఈగలను రూ.2వేల చొప్పున కొనుగోలు చేయాల్సి ఉంటుంది. మొదట 10 బాక్సులతో ఉత్పత్తి ప్రారంభిస్తారు. ప్రస్తుతం 50 నుంచి 150 వరకు బాక్సులు ఏర్పాటు చేస్తున్నారు. తేనెటీగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె తయారు కావడానికి నెల సమయం పడుతోంది. ఒక్కొక్క బాక్సు నుంచి ఐదు కిలోల తేనె ఉత్పత్తి అవుతుంది.

మూడు రకాల ఈగలు ఒక్కొక్క బాక్సులో తొమ్మిది వరకు ప్లేట్లు ఉంటాయి. ప్లేటుకు 2వేల చొప్పున ఒక్క బాక్సులో 18వేల వరకు ఈగలు ఉంటాయి. పోతు, రాణి, కూలి ఈగలు ఉంటాయి. కూలి ఈగలు మకరందాన్ని తీసుకువచ్చి తేనె ఉత్పత్తి చేస్తాయి. ఆడ, పోతు ఈగలు సంతానాన్ని ఉత్పత్తి చేస్తుంటాయి. ఈగలు అధికమైతే వాటిని ఇతర బాక్సుల్లోకి మార్చవచ్చు, కొత్తగా ఫారాలు నిర్వహించే వారికి విక్రయించవచ్చు. ఏటా బాక్సులు ఏర్పాటు చేస్తాను మణికంఠ, గుంటూరు మొదట భయంగా, కష్టంగా ఉన్నా.. కాలక్రమేన అలవాటు కావడంతో లాభాలు తీయవచ్చు. నేను గుంటూరు నుంచి ఇక్కడికి వచ్చాను. ఏటా రెండు నెలలు ఇక్కడ బాక్సులు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతాను. పంటలను బట్టి బాక్సుకు 5 నుంచి 8 కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఆసక్తి ఉంటే ఉచితంగా శిక్షణ ఇస్తా రమేష్, శిక్షకుడు యూపీ, ఎంపీ, రాజస్థాన్, గుజరాత్, తెలంగాణ, ఏపీ ప్రాంతాల్లో పంటల కాలాన్ని బట్టి బాక్సులు ఏర్పాటు చేస్తుంటాను.

చురకలు



## మ్యాక్సీ డ్రెస్ లో మెస్మరైజ్ చేస్తున్న దీపిక.. ఖరీదు తెలిస్తే షాక్!

సాధారణంగా సెలబ్రిటీలు లగ్జరీ లైఫ్ ను అనుభవిస్తారన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే అందులో భాగంగానే ఎప్పటికప్పుడు తమ కారు కలెక్షన్స్ , వాడే వస్తువుల కలెక్షన్ తో అందరినీ ఆశ్చర్యపరచడమే కాకుండా తాము ధరించే దుస్తులతోనే కాదు వాటి ధరలతో కూడా అందరినీ ఆశ్చర్యపరుస్తూ ఉంటారు. ఈ క్రమంలోనే బాలీవుడ్లో అగ్ర కథానాయకగా పేరు సొంతం చేసుకొని.. ఇప్పుడు తెలుగు చిత్రాలలో కూడా నటించి పాన్ ఇండియా హీరోయిన్గా పేరు సొంతం చేసుకున్న దీపికా పదుకొనే కూడా ఆ జాబితాలోకి చేరిపోయింది. ఎప్పటికప్పుడు ట్రెండీ ఔటిఫిట్ తో దర్శనం ఇచ్చే ఈ ముద్దుగుమ్మ తాజాగా మరో మ్యాక్సీ డ్రెస్ ధరించి అభిమానులను సర్ప్రైజ్ చేసింది. ఇక్కడ మరో ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఈ డ్రెస్ ఖరీదు తెలిసి అభిమానులే కాదు నెటిజన్స్ కూడా ఆశ్చర్యపోతున్నారు. డ్రెస్ తో పాటు ఆమె చేతిలో పట్టుకున్న బ్యాగ్ ఖరీదు కూడా అందరిని ఆశ్చర్యపరుస్తోంది. మరి లగ్జరీ మెయింటైన్ చేస్తున్న దీపిక.. తాజాగా తను వేసుకున్న డ్రెస్, పట్టుకున్న బ్యాగ్ ఖరీదు ఎంతో ఇప్పుడు చూద్దాం దీపికా పదుకొనే తాజాగా మాగ్డా బుట్రిమ్ హై నెక్ బ్రౌన్ కలర్ మ్యాక్సీ డ్రెస్ ధరించింది. వింటేజ్ స్టైల్ లో ఓవర్ సైజ్డ్ లెదర్ జాకెట్ తో స్టైల్ చేసింది. ఈ మ్యాక్సీ డ్రెస్ ఖరీదు అక్షరాలా రూ.1,80,600. అలాగే తన చేతిలో లూయిస్



విట్టన్ సైడ్ ట్రంక్ బ్యాగును ధరించింది. దీని విలువ అక్షరాలా రూ.3,50,000. ముఖ్యంగా ఈ బ్యాగు ఆమెకు ఒక క్లాసిక్ రిచ్ లుక్కును అందిస్తోంది అని చెప్పవచ్చు. ఇక బ్లాక్ కలర్ హై హీల్డ్ బూట్లు ధరించిన ఈమె బంగారు వర?ం కలిగిన బ్రాస్ లెట్ లతో తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ముఖ్యంగా ఆకట్టుకుంటున్న చెవి దిద్దులు మరింత హైలెట్గా నిలిచాయి. అంతేకాదు లూజ్ హెయిర్ తో తన అందాన్ని మరింత రెట్టింపు చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. ఇక దీపిక పదుకొనే తన ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇవి చూసిన నెటిజెన్స్ దీపిక లగ్జరీకి ఈ వస్తువులే నిదర్శనం అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇక దీపిక విషయానికి వస్తే.. బాలీవుడ్ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈమె వరుస సినిమాలు చేస్తూ బాలీవుడ్ లో అత్యధిక రెమ్యూనరేషన్ తీసుకుంటున్న హీరోయిన్గా పేరు సొంతం చేసుకుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో కల్కి 2898%ూణ% చిత్రంతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. కల్కి సీక్వెల్ నుండి తప్పుకొని విమర్శలు ఎదుర్కొంది. అలాగే స్పిరిట్ నుండి సందీప్ రెడ్డి వంగా ఈమెను తప్పించడంతో ఈ విషయం మరింత హాట్ టాపిక్ గా మారిన విషయం తెలిసిందే. ఇప్పుడు బాలీవుడ్లో పలు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన ఈమె తాజాగా అట్లీ, అల్లు అర్జున్ కాంబినేషన్లో వస్తున్న సినిమాలో హీరోయిన్గా నటిస్తోంది.

## రామ్ పై భాగ్యశ్రీ ఆసక్తికర కామెంట్స్.. చూసి నేర్చుకోండయ్యా!

ప్రముఖ యంగ్ బ్యూటీ భాగ్యశ్రీ బోర్సే గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన నటనతో, అందంతో మెప్పిస్తున్న ఈ ముద్దుగుమ్మ.. రామ్ పోతినేనితో కలిసి ఇటీవల ఆంధ్ర కింగ్ తాలూకా అనే సినిమాలో నటించింది. అలా నవంబర్ 27న విడుదలైన ఈ సినిమా మంచి టాక్ సొంతం చేసుకుంది. ఇదిలా ఉ ండగా మరొకవైపు ఈ సినిమా షూటింగ్ ఎప్పుడైతే మొదలు పెట్టారో అప్పటి నుంచే రామ్ పోతినేనితో రిలేషన్ లో ఉన్నట్లు పెద్ద ఎత్తున ఎఫైర్ రూమర్స్ కూడా వినిపించాయి. అయితే అవన్నీ పుకార్లు అంటూ కొట్టిపారేసింది. అయితే ఇప్పుడు తాజాగా రామ్ పోతినేని పై చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే ఆంధ్ర కింగ్ తాలూకా సినిమా మంచి టాక్ అందుకోవడంతో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన థ్యాంక్స్ మీట్ లో భాగ్యశ్రీ రామ్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. భాగ్యశ్రీ మాట్లాడుతూ..” రామ్ ఎప్పుడు కూడా చాలా పాజిటివ్ గానే ఆలోచిస్తాడు. రామ్ ఎక్కడ ఉ



ంటే అక్కడ పాజిటివ్ ఎనర్జీ ఉంటుంది. ముఖ్యంగా సెట్స్ లో కూడా రామ్ పాజిటివ్ ఎనర్జీని తీసుకొచ్చాడు. ఆయన నుంచి నేను ఎన్నో విషయాలు నేర్చుకున్నాను” అంటూ భాగ్యశ్రీ తెలిపింది. ప్రస్తుతం ఈమె చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఈ కామెంట్స్ విన్న నెటిజన్స్.. కొంతమంది సెలబ్రిటీలు ప్రతి చిన్న విషయానికి చిరాకు పడుతూ ఉంటారు.. రామ్ ని చూసి నేర్చుకోండయ్యా అంటూ కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికి అయితే రామ్ పై భాగ్యశ్రీ చేసిన ఈ కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. భాగ్యశ్రీ విషయానికి వస్తే.. పూణే నగరానికి చెందిన ఈమె మోడల్ గా కెరియర్ ను మొదలుపెట్టింది. ఆ తర్వాత నటిగా మారిన భాగ్య శ్రీ 2003లో వచ్చిన హిందీ చిత్రం యారియాన్ 2 అనే సినిమాతో అరంగేట్రం చేసింది. తర్వాత ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్, మాస్ మహారాజా రవితేజ కాంబినేషన్లో 2024 లో విడుదలైన తెలుగు సినిమా మిస్టర్ బచ్చన్ లో హీరోయిన్ గా నటించి మెప్పించింది. అలాగే ఈ సినిమాలో తన పాత్రకు తానే స్వయంగా డబ్బింగ్ చెప్పుకుంది కూడా. నైజీరియాలోని లాగోస్ లో చదువుకున్న ఈమె.. ఇండియా తిరిగి వచ్చి బిజినెస్ మేనేజ్మెంట్లో డిగ్రీలో చేరింది. ఆ సమయంలోనే మోడలింగ్ ను కెరీర్ గా ఎంచుకొని ఒక ఏజెన్సీ తో కలిసి పని చేసింది. అంతేకాదు పలు బ్రాండ్లకు అంబాసిడర్ గా వ్యవహరించిన ఈమె.. క్యాడ్బరీ డైరీ మిల్క్ సిల్క్ యాడ్ తో మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. మిస్టర్ బచ్చన్ తర్వాత కింగ్డమ్ లో నటించిన ఈమె.. అలాగే తమిళ చిత్రం కాంత లో కూడా నటించింది. ఇప్పుడు ఆంధ్ర కింగ్ తాలూకాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది.





## 2026 సంక్రాంతి రేస్.. ఆ ఒక్కటే సరిపోదు..



2026 సంక్రాంతి సీజన్ టాలీవుడ్ కు ఒక రియల్ టెస్ట్ లా మారబోతోంది. ఏకంగా ఐదు తెలుగు సినిమాలు బాక్సాఫీస్ బరిలో దిగుతుండటం మామూలు విషయం కాదు. అయితే గతంలో లాగా కేవలం హీరోల కటౌట్లు చూసి జనం థియేటర్లకు వస్తారా లేదా అనేది సందేహమే. ఆడియెన్స్ మైండ్ సెట్ మారింది. అందుకే ఈసారి పోటీలో ఎవరు గెలుస్తారనేది పూర్తిగా కంటెంట్ మీదే ఆధార పడి ఉంటుంది. స్టార్ పవర్ ఓపెనింగ్స్ ఇస్తుందేమో కానీ, లాంగ్ రన్ మాత్రం కథలోని దమ్ము మీదే డిపెండ్ అవుతుంది. అందరి ఫోకస్ నేచురల్ గానే రెబల్ స్టార్ ప్రభాస్ నటిస్తున్న ‘ది రాజా సాబ్’ మీదే ఉంది. పాన్ ఇండియా స్టార్ కాబట్టి అంచనాలు స్కై రేంజ్ లో ఉంటాయి. అయితే ఇక్కడ ఫ్యాన్స్ లోనూ, ట్రేడ్ లోనూ ఉన్న చిన్న డౌట్ ఏంటంటే.. డైరెక్టర్ మారుతి ఎగ్జిక్యూషన్ ఎలా ఉంటుందనేది. వింటేజ్ ప్రభాస్ ను చూపిస్తానని మారుతి చెబుతున్నా, ఆ స్కేల్ ని ఆయన ఎలా హ్యాండిల్ చేశారనే దానిపైనే సినిమా రిజల్ట్ ఉంటుంది. మారుతి గనక మ్యాజిక్ చేస్తే రికార్డులు బద్దలవ్వడం ఖాయం. ఇక మెగాస్టార్ చిరంజీవి ‘మన శంకర వరప్రసాద్ గారు’ విషయంలో స్ట్రాటజీ చాలా క్లియర్ గా కనిపిస్తోంది. అనిల్ రావిపూడి ఎప్పటిలాగే తన ఫేవరెట్ సేఫ్ జోన్ అయిన కమర్షియల్ ఫ్యామిలీ ఆడియెన్స్ ని టార్గెట్ చేశారు. పండగకి ఫ్యామిలీస్ థియేటర్లకు క్యూ కడతారనేది నిజమే. కానీ, ఇన్ని ఆప్షన్స్ ఉన్నప్పుడు కేవలం ఆ జానర్ అడ్వాంటేజ్ మాత్రమే సరిపోదు. స్క్రీన్ ప్లే చాలా గ్రిప్పింగ్ గా ఉంటే తప్ప, మిగతా స్టార్స్ కాంపిటీషన్ ని తట్టుకుని ఈ సినిమా సర్వైవ్ అవ్వడం కష్టం. మరోవైపు రవితేజ ‘భర్త మహాశయులకు విజ్ఞప్తి’ పరిస్థితిని ప్రాక్టికల్ గా అనలైజ్ చేస్తే.. ఆన్ పేపర్ మిగతా సినిమాలతో కంపేర్ చేస్తే ఇది కొంచెం వీక్ గానే అనిపిస్తోంది. టైటిల్ పరంగా గానీ, బజ్ పరంగా గానీ ఇంకా పీక్స్ కి వెళ్ళలేదు. కానీ రవితేజను మనం తక్కువ అంచనా వేయలేం. ఆయనకు పర్ఫెక్ట్ కంటెంట్ దొరికితే సీన్ మొత్తం మార్చేస్తారు. కంటెంట్ స్ట్రాంగ్ గా ఉంటే ఈ సంక్రాంతికి ఈ సినిమానే గేమ్ ఛేంజర్ అయ్యే ఛాన్స్ ఉంది. యంగ్ హీరోల సినిమాల విషయానికి వస్తే.. ‘అనగనగా ఒక రాజు’ సక్సెస్ భారం మొత్తం నవీన్ పొలిశెట్టి మీదే ఉంది. ఇది పూర్తిగా వన్ మ్యాన్ షో. ఆయన కామెడీ టైమింగ్, పర్ఫార్మెన్స్ క్లిక్ అయితేనే సినిమా నిలబడుతుంది. ఇక శర్వానంద్ ‘నారీ నారీ నడుమ మురారి’ కూడా రేసులో ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు దీనిపై అఫీషియల్ గా పెద్ద బజ్ క్రియేట్ అవ్వలేదు. ప్రమోషన్స్ విషయంలో టీమ్ అర్జెంట్ గా గేర్ మార్చాల్సిన అవసరం ఉంది. ఫైనల్ గా 2026 సంక్రాంతి బాక్సాఫీస్ ఫైట్ ఈసారి చాలా కొత్తగా ఉండనున్నట్లు తెలుస్తోంది. భారీ అంచనాలు ఉన్న సినిమాలు డిజప్పాయింట్ చేయొచ్చు, అంచనాలు లేని సినిమాలు బ్లాక్ బస్టర్ అవ్వొచ్చు. అంతిమంగా ఆడియెన్స్ ని ఎంగేజ్ చేసే సాలిడ్ కంటెంట్ ఉన్న సినిమానే విన్నర్ గా నిలుస్తుంది. స్టార్ డమ్ కంటే కంటెంటే ఈసారి డిసైడింగ్ ఫ్యాక్టర్ కానుంది. చూడాలి మరి కంటెంట్ పరంగా బాక్సాఫీస్ వద్ద ఎవరు విన్ అవుతారో..!

## రాజా సాబ్ కు ఆర్థిక సమస్యలా?.. విశ్వప్రసాద్ ఏమన్నారంటే?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబినేషన్ లో ది రాజా సాబ్ మూవీ రూపొందుతున్న విషయం తెలిసిందే. హారర్ కామెడీ థ్రిల్లర్ గా తెరకెక్కుతున్న ఆ సినిమాను ప్రముఖ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి కానుకగా విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. జనవరి 9వ తేదీన మూవీ వరల్డ్ వైడ్ గా పాన్ ఇండియా రేంజ్ లో విడుదల కానుండగా.. కొన్ని గంటలుగా సినిమా రిలీజ్ పై ఊహాగానాలు చక్కర్లు కొడుతు న్నాయి. రీసెంట్ గా బాలయ్య అఖండ 2 తాండవం మూవీ పోస్ట్ పోన్ అవ్వడంతో రాజా సాబ్ కూడా సంక్రాంతికి వచ్చే అవకాశం లేదని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అంతే కాదు.. ఆ సినిమా మేకర్స్ కు కూడా ఆర్థిక సమస్యలు ఉ న్నాయంటూ రూమర్స్ స్ప్రెడ్ చేస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థ కూడా బాలీవుడ్ నిర్మాణ సంస్థకు డబ్బులు పెండింగ్ ఉ ందంటూ పోస్టులు పెడుతున్నారు. దీంతో నిర్మాత విశ్వప్రసాద్.. ఇప్పుడు స్పందించారు. రూమర్స్ పై రెస్పాండ్ అవుతూ పోస్ట్ ద్వారా క్లారిటీ ఇచ్చారు. “విడుదలకు ముందే సినిమాలు ఆగిపోవ డం, అది పరిశ్రమలోని వివిధ రంగాలపై చూపే ప్రభావం దురదృష్టకరం. చిన్న చిత్రాల నిర్మాతలు తమ మూవీలను పెద్ద సినిమాల ప్రకారం ప్లాన్ చేసుకుని.. ఇప్పుడు వేచి ఉండటం నన్ను తీవ్రంగా కలవరపెట్టింది” అంటూ విశ్వప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. “చివరి నిమిషంలో సినిమా విడుదలకు అంతరా యం కలిగించడానికి ప్రయత్నించడం చాలా దురదృష్టకరం. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండించాలి. అంతరాయాలు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు, నిర్మాతలు, సాంకేతిక నిపుణులు సహా వేలాది మంది జీవనోపాధిని ప్రభావితం చేస్తాయి. అందుకే దాన్ని ఖండించాల్సిందే'' అని చెప్పారు. ''చివరి నిమిషంలో అంతరాయాలను నివారించడానికి థర్డ్ పార్టీ వ్యక్తులు విషయంలో స్పష్టమైన చట్టపరమైన మార్గదర్శకాలు రూపొందించడం చాలా ముఖ్యం. బాధ్యతారహిత ప్రయత్నాలపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి” అని తెలిపారు. ప్రస్తుతం రాజా సాబ్ మూవీ చుట్టూ.. దాన్ని రిలీజ్ చుట్టూ అనేక ఊహాగానాలు ఉన్నాయని అన్నారు. అయితే రాజాసాబ్ మేకింగ్ కు తీసుకున్న ఫైనాన్స్ పూర్తిగా క్లియర్ అయిందని, వడ్డీలు కూడా అనుకున్నదాని కంటే ముందుగానే క్లియర్ చేస్తామని చెప్పారు. రాజా సాబ్ తో పాటు వస్తున్న అన్ని సంక్రాంతి రిలీజ్ చిత్రాలు ఇబ్బందులు లేకుండా విడుదల కావాలని ఆకాంక్షించారు. అన్ని సినిమాలు కూడా ఘన విజయం సాధించాలని కోరుతున్నట్లు ట్వీట్ చేశారు.

## లెక్చరర్ తో హీరోయిన్ స్టోరీ.. ఎగ్జామ్ పేపర్స్ లీక్

సాధారణంగా సినిమా ప్రమోషన్స్ లో నటీనటులు తమ పాత్రల గురించి లేదా షూటింగ్ విశేషాల గురించి చెబుతుంటారు. కానీ కొన్నిసార్లు ఫ్లోలో నోరు జారి లేదా కావాలనే బోల్డ్ గా మాట్లాడి సంచలనం సృష్టిస్తుంటారు. లేటెస్ట్ గా హీరోయిన్ రాశీ సింగ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. మాస్ మూవీ మేకర్స్ బ్యానర్ పై ఎస్కేఎన్ నిర్మించిన ‘త్రీ రోజెస్’ సీజన్ 2 వెబ్ సిరీస్ ప్రమోషన్స్ లో ఆమె పాల్గొంది. ఈషా రెబ్బా, కుషిత కల్లపులతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటున్న రాశీ, డిసెంబర్ 12న ‘ఆహా’లో స్ట్రీమింగ్ కానున్న ఈ సిరీస్ కోసం ఇంటర్వ్యూలు ఇస్తూ తన పర్సనల్ లైఫ్ సీక్రెట్ ను బయటపెట్టి అందరినీ ఆశ్చర్యపరిచింది. రాశీ సింగ్ తన గతం గురించి మాట్లాడుతూ.. స్కూల్ డేస్ అయిపోయాక జస్ట్ కాలేజీలో అడుగుపెట్టిన కొత్తలోనే తనకో బాయ్ ఫ్రెండ్ ఉండేవాడని చెప్పింది. అయితే ఆ వ్యక్తి మరెవరో



కాదు, స్వయంగా ఆమెకు పాఠాలు చెప్పే యంగ్ లెక్చరర్ అట. అప్పుడు తన వయసు కేవలం 17 ఏళ్లు మాత్రమేనని, ఆ లెక్చరర్ కూడా అప్పుడు చాలా యంగ్ గా ఉండేవారని, ఇంకా పెళ్లి కాలేదని రాశీ తెలిపింది. స్టూడెంట్ లెక్చరర్ మధ్య ఫన్నీ థింగ్స్ నడిచిందనే విషయం ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశమైంది. అసలు ట్విస్ట్ ఏంటంటే.. అతని వల్ల రాశీ సింగ్ కు కాలేజీలో క్వశ్చన్ పేపర్లు ముందే చేతికి వచ్చేవట. ఆయన స్పెషల్ గా తన కోసం పేపర్స్ లీక్ చేసేవారని ఆమె ఓపెన్ గానే ఒప్పుకుంది. ఇది విన్న %ాఖచీ% తో పాటు అక్కడున్న వారంతా షాక్ అయ్యారు. అంతేకాదు, ప్రాక్టికల్ ఎగ్జామ్స్ లో వైవా రూమ్ లోకి వెళ్తే.. ఆ లెక్చరర్ ఆమెను ఒక్క సబ్జెక్ట్ క్వశ్చన్ కూడా అడిగేవారు కాదని, కేవలం ఒక పది నిమిషాల పాటు కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటూ టైమ్ పాస్ చేసేవారని ఆమె నవ్వుతూ చెప్పింది. అయితే లెక్చరర్ తో రిలేషన్ అనగానే ఇంకేదో ఊహించుకోవద్దని, తమ మధ్య అప్పుడు ఏమీ జరగలేదని రాశీ సింగ్ క్లారిటీ ఇచ్చింది. అదొక బాండ్ అని “ఏం జరగలేదు” అని ఆమె పదే పదే చెప్పడం కొసమెరుపు. ప్రస్తుతం ఆ లెక్చరర్ కు పెళ్లయిందని, విశేషం ఏంటంటే ఇప్పటికీ ఆయన తనను ఇన్ స్టాగ్రామ్ లో ఫాలో అవుతుంటారని చెప్పింది. ఇంకా విచిత్రం ఏంటంటే.. ఆయన భార్య కూడా రాశీని ఫాలో అవుతుందట. ఇక ‘త్రీ రోజెస్ 2’ సిరీస్ లో ఎంత బోల్డ్ కంటెంట్ ఉందో తెలియదు కానీ, ప్రమోషన్స్ లో మాత్రం రాశీ సింగ్ తన బోల్డ్ కామెంట్స్ తో హీట్ పెంచేసింది. డిసెంబర్ 12న రాబోతున్న ఈ సిరీస్ లో ఇంకెన్ని ట్విస్టులు ఉంటాయో చూడాలి.

## ఆ తప్పులను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నా...

జీవితంలో మనిషి అన్నాక తప్పనిసరిగా ఏదో ఒక సందర్భంలో తెలిసో తెలియకో తప్పులు చేస్తూ ఉంటారు. అయితే వాటిని సరిదిద్దుకోవడానికి ప్రయత్నం చేసినప్పుడే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకుంటాం అని ఇప్పటికే ఎంతోమంది నిరూపించారు కూడా. అలాంటి వారిలో సౌత్ లేడీ సూపర్ స్టార్ నయనతార కూడా ఒకరు. తెలుగు, తమిళ్ భాషా చిత్రాలలో నటిస్తూ తన నటనతో భారీ పాపులారిటీ అందుకున్న ఈమె.. ఇండస్ట్రీకి వచ్చి 20 ఏళ్లు అవుతున్నా.. ఇంకా స్టార్ హీరోయిన్ గానే బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తూ అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది. ఒకవైపు సౌత్ సినిమాలతోనే కాదు మరొకవైపు హిందీ చిత్రాలలో కూడా నటిస్తూ అక్కడ కూడా భారీ పాపులారిటీ అందుకున్న నయనతార.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీ కెరియర్లో తాను చేసిన తప్పులు, పొరపాట్ల గురించి చెబుతూ అందరిని ఆశ్చర్యపరిచింది. ఇంటర్వ్యూలో



భాగంగా తన కెరియర్ గురించి నయనతార మాట్లాడుతూ.. “నేను ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి 20 సంవత్సరాలు గడిచిపోయాయి. ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి నటించాను. ఆ హీరోలతో నటించేటప్పుడు చిన్న చిన్న పొరపాట్లు కూడా చేస్తూ వచ్చాను. అందులో నటన గురించి మెలకువలు నేర్చుకోవడంలో చేసిన పొరపాట్లు ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను. ఒకసారి ఒక సినిమా షూటింగ్లో మోహన్ లాల్ గారితో నటించినప్పుడు నా పాత్రకు చాలా డైలాగులు ఉండేవి. అయితే ఆ డైలాగులకు తగ్గట్టుగా హావాభావాలను పలికించేందుకు తెగ కష్టపడి పోయాను. మోహన్ లాల్ గారేమో ఇంకా బాగా హావభావాలు పలకాలి అని నాతో చెప్పారు. ఇక పదేపదే చెబుతూ ఉంటే ఏం చేయాలో అర్థం కాక తెగ కంగారు పడిపోయాను. అయితే నా పరిస్థితిని అర్థం చేసుకున్న డైరెక్టర్ అక్కడికి వచ్చి ఈరోజుటికి చాలు.. రేపు ఏం చేయాలో రేపు ఆలోచిద్దాం అని చెప్పి నన్ను రక్షించారు. ఇంటికి వెళ్ళాక కూడా మరునాడు చేయబోయే సీన్ల కోసం రాత్రంతా రిహార్సల్స్ చేశాను. మరుసటి రోజు షూటింగ్ సెట్లో అందరూ అనుకున్నట్టుగానే నటించాను. షాట్ చాలా బాగా వచ్చింది. ఇక నన్ను అందరూ మెచ్చుకున్నారు. అయితే నిజానికి అప్పుడప్పుడు సినిమాలలో పొరపాట్లు జరుగుతూనే ఉంటాయి. అయితే ఆ విషయాలను నేను ఇప్పటికీ మర్చిపోలేకపోతున్నాను” అంటూ నయనతార తెలిపింది. అదే ఇంటర్వ్యూలో తన భర్త , పిల్లల గురించి కూడా చెప్పుకొచ్చింది నయనతార.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536